www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 24-4-2025 | పేజీలు: 16 | వెల (Price): Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 8

శ్రీవిశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం, తిథి: ఏకాదశి మ.2.33 తదుపరి ద్వాదశి, నక్షత్రం: శతభిషం ఉ.10.49 తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం:సా.4.42-6.10, దుర్ముహూర్తం: ఉ.10.07-10.58, మ.3.09-3.59, అమృతఘడియలు: రా.1.31-2.59, రాహుకాలం: మ.1.30-మ.3.00, సూర్యోదయం: 5.56, సూర్యాస్తమయం: 6.29 | విజయవాడ సిటీ**


Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

BHASHYAM® BLOOMS

the global school

Andhra Pradesh | Telangana | Karnataka





NURTURING YOUNG MINDS

Bhashyam Blooms - The fastest growing chain of CBSE campuses in South India



Our VIBRANT Campuses

ANDHRA PRADESH

GUNTUR : Tel.: 0863-2246015, 2256939, Mbl.: 98485 36968
VIJAYAWADA : Mbl.: 95422 54444, 96185 08686
TIRUPATI : Mbl.: 88855 34848
RAJAHMUNDRY : Mbl.: 88869 22422, 88869 33433
KAKINADA : Mbl.: 88850 34224, 88861 24949
VIZIANAGARAM : Mbl.: 88862 86677, 88862 96677
TANUKU : Mbl.: 88850 34849

TELANGANA

MANIKONDA : Mbl.: 88866 77111, 88866 55444, **MAHESWARAM :** Mbl.: 88866 68985/86
NAGOLE : Tel.: 040-29704920, Mbl.: 88866 69920/30, **ECIL :** Mbl.: 88866 33746/56/96
PRAGATHI NAGAR : Mbl.: 91213 26111/222/333, **PATANCHERU :** Mbl.: 91213 26444/555
HAYATH NAGAR : Mbl.: 73374 46363/6464, **PEERZADIGUDA :** Mbl.: 73374 48282/8383
ALWAL : Mbl.: 93917 75428/29, **SAMANAGAR :** Mbl.: 63039 12101/02/03
BRAHMANAPALLY : Mbl.: 88861 24646/4747
BROOKS, KUKATPALLY : Mbl.: 98487 79020, 88855 50044

KARNATAKA

BENGALURU - BANNERGHATTA : Mob : 99880 90948, 99880 90947, **BENGALURU - ELECTRONIC CITY :** Mob : 88850 34276, 88850 34842

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 24-4-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ

తుపాకీ లాక్కోబోయి.. తూటాలకు బలైపోయి..



పర్యాటకులపై దాడిని అడ్డుకోబోయిన కశ్మీరీ యువకుడు

కాల్చి చంపిన ఉగ్రవాదులు

పర్యాటకులను గుర్రంపై తీసుకెళ్లూ ఆదిల్ హుస్సేన్ షా ఉపాధి

మృతితో రోడ్డునపడ్డ కుటుంబం

ఆదిల్ హుస్సేన్ షా అంతిమ యాత్రలో ప్రజలు. (ఇన్‌సెట్) ఆదిల్

పోలీసులు విడుదల చేసిన పహల్గాం దాడి ఉగ్రవాదుల ఊహా చిత్రాలు



వాళ్లు పాకిస్థానీలే!

పహల్గాం దాడి ఉగ్రవాదుల్లో ఐదుగురు ఆ దేశస్థులే.. వారి భాష ఆధారంగా గుర్తింపు

దాడిలో పాల్గొన్నది ఏడుగురు.. అందులో ఇద్దరు స్థానికులు.. మొత్తం 70 రౌండ్ల కాల్పులు

దర్యాప్తు బృందాల వెల్లడి.. ఉగ్రవాదుల ఊహాచిత్రాలను విడుదల చేసిన పోలీసులు

నిఘా వర్గాలు హెచ్చరించినా.. భద్రతా దళాల వైఫల్యం వల్లే ఉగ్ర దాడి?

కశ్మీర్‌లో 56 మంది విదేశీ ఉగ్రవాదులు.. అత్యధికులు లష్కరే ముష్కరులే!

పహల్గాం, ఏప్రిల్ 23: జమ్మూకశ్మీరులోని పహల్గాంలో పర్యాటకులపై దాడి పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదుల పనేనని దర్యాప్తు సంస్థలు తేల్చాయి. దాడి సమయంలో ఉగ్రవాదులు మాట్లాడిన భాష, యాస ఆధారంగా ఈ నిర్ణయానికి వచ్చాయి. ఈ దాడిలో మొత్తం ఏడుగురు ఉగ్రవాదులు పాల్గొనగా వాళ్లల్లో ఐదుగురు పాకిస్థానీలు, ఇద్దరు స్థానికులు(కశ్మీరీలు) ఉన్నట్టు గుర్తించాయి. ఉగ్రదాడి నుంచి తప్పించుకున్న వారు, ప్రత్యక్ష సాక్షులతో మాట్లాడిన దర్యాప్తు అధికారులు.. ఉగ్రవాదులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించారు. ఈ క్రమంలో దాడి సమయంలో ఉగ్రవాదుల్లో కొందరు మాట్లాడిన భాష, ఉపయోగించిన యాస పాకిస్థాన్‌లో మాత్రమే మాట్లాడేవిగా గుర్తించారు. దీంతో ఉగ్రదాడిలో పాకిస్థానీల పాత్రను నిర్ధారించారు. అయితే, ఉగ్రవాదులకు సహకరించిన స్థానికుల వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, దాడిలో పాల్గొన్న ఉగ్రవాదుల ఫొటో, ఊహాచిత్రాలను దర్యాప్తు సంస్థలు బుధవారం విడుదల చేశాయి. దర్యాప్తు సంస్థలు విడుదల చేసిన ఫొటోలో సాయుధులైన నలుగురు వ్యక్తులు ఉన్నారు. అలాగే, ఆసిఫ్ ఫౌజీ, సులేమాన్ షా, అబు తాలా అనే ముగ్గురి ఊహాచిత్రాలను కూడా విడుదల

మిగతా 11వ పేజీలో...

ఖాళీ అవుతున్న కశ్మీరం!

కశ్మీర్‌ను వీడుతున్న పర్యాటకులు

దాడికి నిరసనగా జమ్మూకశ్మీర్‌లో బంద్

మొదటి పేజీలను నలుపు రంగుతో ప్రచురించిన పత్రికలు

మరో ఉగ్రదాడి జరిగే ప్రమాదం

నిఘావర్గాల సమాచారం

రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం

దాడితో సంబంధం లేదు: పాక్

సరిహద్దులకు సైన్యం, విమానాల తరలింపు

భారత్ ప్రతీకార దాడులపై భయం

సమగ్ర కథనాలు.. 2,11లో

సింధు జలాలు బంద్

పాక్‌పై జల ఖడ్గం



1960 నాటి సింధు జలాల ఒప్పందం అమలును నిలిపేసిన భారత్

వాఘా-అట్టారీ సరిహద్దు చెక్ పోస్ట్ తక్షణం మూసివేత

సార్క్ వీసా మినహాయింపు కింద పాకిస్థానీలకు భారత్‌లోకి ప్రవేశం నిషిద్ధం.. ఇప్పటికే అలా వచ్చినవారి వీసాలు రద్దు

ఈ వీసాపై వచ్చిన పాకిస్థానీలు 48 గంటల్లోగా వెళ్లిపోవాలి

భారత్‌లోని పాక్ హైకమిషన్‌లో సలహాదారుల గుర్తింపు రద్దు

వారంతా వారంలోగా తమ దేశానికి వెళ్లిపోవాలని ఆదేశం

2 దేశాల్లోని హైకమిషన్ల సిబ్బంది 55 నుంచి 30కి కుదింపు

ఉగ్రదాడి నేపథ్యంలో ప్రధాని మోదీ నేతృత్వంలో సీసీఎస్ భేటీ

దాయాది దేశంతో సంబంధాలపై అత్యంత కఠిన నిర్ణయాలు

నేడు అఖిల పక్ష సమావేశం నిర్వహించాలని భేటీలో నిర్ణయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిని భారత ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. దాడి వెనుక ఉన్న పాకిస్థాన్‌తో సంబంధాలపై అత్యంత కఠిన నిర్ణయాలు తీసుకుంది. పాకిస్థాన్ దాహార్తిని తీర్చే సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసేసింది. వాఘా-అట్టారీ సరిహద్దును తక్షణం మూసివేసింది. పాక్ జాతీయులకు భారత్‌లోకి ప్రవేశాన్ని నిషేధించడంతోసహా మరిన్ని కీలక నిర్ణయాలను తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఆయన నివాసంలో బుధవారం సాయంత్రం 'భద్రతపై క్యాబినెట్ కమిటీ (సీసీఎస్)' సమావేశమైంది. ఉగ్రదాడిని తీవ్రపదజాలంతో ఖండించింది. దాడిలో మృతి చెందినవారి కుటుంబాలకు సానుభూతి తెలిపింది. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. పహల్గాంలో పర్యటించి

మిగతా 11వ పేజీలో...



వినయ్ నర్వాల్‌కు కన్నీటి వీడ్కోలు పలుకుతున్న భార్య హిమాన్షి

కలలు కల్లలు

నిండు నూరేళ్ల జీవితాన్ని సంతోషంగా గడిపేందుకు కోటి ఆశలతో ఒక్కటైన రెండు జంటలు.. ఒకరికొకరు తోడుగా ప్రకృతి అందాలను వీక్షిస్తూ మైమరిచిపోయిన సమయంలో ముష్కర మూకలు వారిని విడదీశాయి. ఇటీవలే పెళ్లయిన ఇద్దరు యువకులు ఉగ్రవాదుల మారణకాండలో కన్నుమూశారు. వారిలో ఒకరు నావికాదళంలో లెఫ్టినెంట్‌గా పనిచేస్తున్న వినయ్ నర్వాల్ (26), మరొకరు వ్యాపారవేత్త శుభమ్ ద్వివేదీ (30).

పహల్గాంలో ఘటనా స్థలాన్ని

పరిశీలించిన షా

మృతులకు నివాళులు.. ఆస్పత్రిలో బాధితులకు పరామర్శ

త్వరలోనే బదులిస్తాం

త్రివిధ దళాధిపతులతో భేటీ అనంతరం రక్షణ మంత్రి రాజ్‌నాథ్



చంద్రమౌళి | మధుసూదనరావు

ఉగ్రదాడిలో ఇద్దరు ఏపీ వాసుల దుర్మరణం

విశాఖకు చెందిన చంద్రమౌళి విశ్రాంత బ్యాంకు ఉద్యోగి

కావలి వాసి మధుసూదనరావు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్



ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలులో వీరయ్యచౌదరి మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

12

ఆ కిరాతకులను వదలం

భూగర్భంలో దాక్కున్నా పట్టుకుని శిక్షిస్తాం.. హత్యా రాజకీయాలను సహించేది లేదు

టీడీపీ నేత వీరయ్య హత్య కలచివేసింది: చంద్రబాబు.. మృతుడి స్వగ్రామంలో నివాళి

ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలులో పర్యటన.. అండగా ఉంటామని కుటుంబానికి భరోసా

అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రులు, నేతలు.. అన్ని కోణాల్లో ముమ్మరంగా కేసు దర్యాప్తు

పోలీసుల అదుపులో వైసీపీ రౌడీషీటర్.. పొన్నూరులో మరో ముగ్గురు

చూడమని చెప్పానంతే!

వారితో నేను తప్పులు చేయించినట్లా?

కుక్కల విద్యాసాగర్ సాయం అడిగారు

ఆ కేసేమిటో చూడాలని రాణాకు చెప్పా

జత్వానీ అరెస్టుకు సహకరించాలని ముంబై పోలీసులను కోరాను

రాణా, గున్నీ సీఎంవోకు రాక యాదృచ్ఛికమే

విచారణ సమయంలో పీఎస్సార్ జవాబులు

అధికారుల ముందు వింత వైఖరి

పేరుతో పిలుస్తూ.. 'మహానుభావా' అంటూ తోచినట్టు వ్యాఖ్యలు

మీరంతా దొంగలు అంటూ రుసరుసలు



పీఎస్సార్ ఆంజనేయులును జైలులోకి పంపుతున్న పోలీసులు

పీఎస్ఆర్‌కు రిమాండ్

విజయవాడ జైలుకు తరలింపు

హోరాహోరీగా సాగిన వాదనలు

విజయవాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): 'కుక్కల విద్యాసాగర్ అనే వ్యక్తి వచ్చి.. తనకు సహాయం చేయాలని అడిగాడు. ఆ కేసు ఏదో చూడాలని అప్పటి విజయవాడ నగర కమిషనర్ కాంతిరాణాకు చెప్పాను. కిందివాళ్లు తప్పులు చేస్తే.. నేనే చేయించినట్లా?'.. అని ముంబై నటి కాదంబరి జత్వానీ కేసులో అరెస్టయిన సీనియర్ ఐపీఎస్, ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్సార్ ఆంజనేయులు విచారణ అధికారులను దబాయించినట్లు తెలిసింది. కాంతిరాణా, విశాల్ గున్నీ అడిగారు కాబట్టి..

మిగతా 13వ పేజీలో...

కంచే చేను మేసిన తీరు..

పోలీసుల్ని ఆటబొమ్మల్లా ఆడించిన పీఎస్సార్

పోలీసు అధికారి అయిఉండీ మహిళపై కుట్ర

కొండల మధ్య బంధించి తీవ్రంగా వేధించారు

నిఘా మాజీ చీఫ్‌పై సిట్ రిమాండ్ రిపోర్ట్

రాజ్ తోడల్లుడు అరెస్టు

13

మద్యం స్కామ్‌లో 8వ నిందితుడిగా చాణక్య

ముడుపుల వసూళ్లు, తరలింపులో కీలక పాత్ర

మద్యం కంపెనీల ప్రతినిధులతో నిత్యం టచ్‌లో!

మరో ఇద్దరు సహాయకులతో కలిసి 'కలెక్షన్లు'

ప్రభుత్వం మారగానే దుబాయ్‌కి జంప్.. తాజాగా రాక

కసిరెడ్డిని కస్టడీకి ఇవ్వండి

మద్యం ముడుపులు ఎక్కడికెళ్లాయో తేల్చాలి

ఏసీబీ కోర్టులో సిట్ పిటిషన్ దాఖలు

13

చైనాపై సుంకాలు గణనీయంగా

తగ్గుతాయ్

2

కానీ సున్నాకు మాత్రం చేరవు: ట్రంప్



తాజ్‌మహల్ ముందు పిల్లలతో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఉషా దంపతులు

2

భారత్‌కు ఎఫ్-35లు ఇస్తాం

వాటితో వాయుసేనకు అదనపు బలం: వాన్స్

రాష్ట్రం నిప్పుల కొలిమి

నంద్యాల జిల్లా గోనవరంలో 44 డిగ్రీలు

3

కృష్ణా జలాల పునఃపంపిణీపై..

కేంద్ర గెజిట్‌ను రద్దు చేయండి



ట్రైబ్యునల్‌కు అదనంగా ఇచ్చిన టీవోఆర్ చెల్లదు

సుప్రీంకోర్టులో ఆంధ్రప్రదేశ్ వాదనలు

విభజన చట్టం ప్రకారం ఇప్పటికే కేటాయింపులు

వాటిని మళ్లీ పరిశీలించాలనడం తగదు

అంతర్రాష్ట్ర చట్టం సెక్షన్-3తో మాకు అన్యాయం: ఏపీ

న్యూఢిల్లీ/అమరావతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపకానికి బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌కు కేంద్రం జారీ చేసిన నూతన అదనపు మార్గదర్శకాలు (టెర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్-టీవోఆర్) సరికాదని ఆంధ్రప్రదేశ్ తెలిపింది. అంతర్రాష్ట్ర నదీ జలాల చట్టం-1956లోని సెక్షన్-3 ప్రకారం కృష్ణా జలాల పంపిణీ చేపడితే

మిగతా 13వ పేజీలో...

బాబుపై 'అంగళ్లు' కేసులు మూసివేత!

నాడు వైసీపీ మూకల రాళ్ల దాడి.. పైగా ఆయనపైనే హత్యాయత్నం సహా 4 తప్పుడు కేసులు

3

తప్పుడు కేసులని నిర్ధారించి మూసివేస్తున్నట్లు కోర్టుకు నివేదన

అనంతబాబు డ్రైవర్ హత్య కేసులో

తదుపరి దర్యాప్తు అవసరం

రాజమహేంద్రి కోర్టులో ప్రాసిక్యూషన్ పిటిషన్

మృతుడి తల్లి లేవనెత్తిన అనుమానాల ప్రస్తావన

మరికొందరు సాక్షులను ప్రశ్నించాలి..

సాంకేతిక ఆధారాలూ సేకరించాలి

13

తదుపరి విచారణకు అనుమతివ్వాలని వినతి

టెన్త్‌లో 81.14% ఉత్తీర్ణత



కాకినాడ విద్యార్థిని నేహాంజనికి 600 మార్కులు

రాష్ట్రంలో ఆరుగురికి 599 మార్కులు

బాలికలు 84.09%, బాలురు 78.31% పాస్

1,680 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత

19 పాఠశాలల్లో ఒక్కరూ పాస్ కాలేదు

పార్వతీపురం మన్యం జిల్లా హ్యాట్రిక్

వరుసగా మూడోసారి టాప్‌లో 'మన్యం'

అట్టడుగున అల్లూరి సీతారామరాజు జిల్లా

గురుకుల పాఠశాలల్లో 95.02% ఉత్తీర్ణత

మే 19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

చదువుల తల్లి నేహాంజని

అన్ని సబ్జెక్టుల్లోనూ వందకు వంద

టెన్త్‌లో ఇన్ని మార్కులు ఇదే తొలిసారి

కాకినాడ విద్యార్థిని అరుదైన ఘనత

రోజూ 17 గంటలు పుస్తకాలతోనే కుస్తీ

నూరు శాతం స్ట్రైక్ రేట్‌తో రికార్డు

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 81.14 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. టెన్త్ పరీక్షల ఫలితాలను మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ బుధవారం 'ఎక్స్' ద్వారా విడుదల చేశారు. రాష్ట్రంలోని 11,819 పాఠశాలల

మిగతా 12వ పేజీలో...

తుపాకీ లాక్కోబోయి.. తూటాలకు బలైపోయి..

పర్యాటకులపై దాడిని అడ్డుకునే క్రమంలో హుస్సేన్ మృతి



పహల్గాం, ఏప్రిల్ 23: ప్రకృతి అందాలను చూసి మైమరచిపోతున్న పర్యాటకులపైకి ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులకు తెగబడగా.. ప్రాణభయంతో అందరూ పరుగులు తీశారు. కానీ, ఒక్క వ్యక్తి మాత్రం ముష్కరులను అడ్డుకునే ప్రయత్నం చేశాడు. పహల్గాంలోని బైసారన్‌లో ఉగ్రవాదులు కాల్పులు జరుపుతుండగా.. తుపాకీ లాక్కొనేందుకు యత్నించాడు. అతనే సయీద్ అదిల్ హుస్సేన్ షా. స్థానికుడైన హుస్సేన్.. తన గుర్రంపై పర్యాటకులను బైసారన్ తీసుకెళుతుంటాడు. మంగళవారం తన కళ్లెదుటే ముష్కరులు అమాయకులైన పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరుపుతుంటే తట్టుకోలేకపోయాడు. దాడిని అడ్డుకునేందుకు ధైర్యంగా ముందుకెళ్లాడు. ఉగ్రవాదుల నుంచి తుపాకులు లాక్కోవడానికి ప్రయత్నించాడు. ఆ క్రమంలో ముష్కరుల తూటాలకు బలైపోయాడు. పహల్గాం నుంచి సముద్ర మట్టానికి సుమారు 3 వేల అడుగుల ఎత్తులో ఉన్న టులియన్ సరస్సుకు వెళ్లాలంటే నడక, గుర్రపు స్వారీ తప్ప వేరే మార్గం లేదు. ఈ క్రమంలోనే వాహనాలు పార్కింగ్ చేసిన చోటు నుంచి పర్యాటకులను గుర్రంపై బైసారన్‌కు తీసుకెళ్తుంటాడు హుస్సేన్. ఇదే అతనికి జీవనోపాధి. భార్య, పిల్లలు, తల్లిదండ్రులను అతనే పోషిస్తున్నాడు. మంగళవారం కూడా పర్యటకులను బైసారన్ పచ్చిక బయళ్ల ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడి క్యాంపుల్లోని పర్యాటకులు ప్రకృతిని ఆస్వాదిస్తున్నప్పుడే ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. వారిని అడ్డుకొనే క్రమంలో హుస్సేన్ ప్రాణాలొదిలాడు. దీంతో అతని కుటుంబం రోడ్డున పడినట్లయింది. తమకు న్యాయం చేయాలని హుస్సేన్ తల్లిదండ్రులు కోరుతున్నారు. 'నా కుమారుడు గుర్రం తీసుకొని పహల్గాం వెళ్లాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఉగ్రదాడి గురించి మాకు తెలిసింది. వెంటనే హుస్సేన్‌కు ఫోన్ చేస్తే స్విచాఫ్ వచ్చింది. ఆ దాడిలో నా కుమారుడు చనిపోయాడని తర్వాత తెలిసింది' అంటూ హుస్సేన్ తండ్రి సయ్యద్ హైదర్ కన్నీరుమున్నీరయ్యారు.

ప్రపంచ దేశాల ఖండన

పహల్గాం ఉగ్రదాడిని ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి. అమాయకులైన పౌరులను కాల్చిచంపడం అనాగరిక, అమానవీయ చర్య అని 20కు పైగా దేశాలు పేర్కొన్నాయి. అమెరికా, రష్యా, చైనా, జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, ఇజ్రాయెల్, యూఏఈ, శ్రీలంక, నేపాల్, మాల్దీవులు, తదితర దేశాలు ఉగ్రదాడిని ఖండిస్తూ మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపాయి. పహల్గాం ఉగ్రదాడిని ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్, ఈయూ విదేశాంగ వ్యవహారాల ప్రతినిధి కాజా కల్లాస్ కూడా ఖండించారు.

ఖాళీ అవుతున్న కశ్మీరం!

విమానాల్లో 6 గంటల్లోనే.. 3,337 మంది పర్యాటకులు వెనక్కి!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: దారుణ ఉగ్రదాడి నేపథ్యంలో కశ్మీర్‌లోని పర్యాటక స్థలాలన్నీ ఖాళీ అవుతున్నాయి. వివిధ ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చిన వేలాది మంది పర్యాటకులు భయంతో వెనుదిరుగుతున్నారు. ఉగ్రదాడి జరిగిన తర్వాత కేవలం ఆరు గంటల్లోనే 3,337 మంది విమానాల్లో శ్రీనగర్‌ను వీడినట్టు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. రద్దీ దృష్ట్యా అదనపు విమానాలను అందుబాటులోకి తెచ్చామని, విమానాశ్రయంలో ప్రత్యేక సదుపాయాలు కల్పించామని తెలిపారు. టికెట్ ధరలు పెంచొద్దని విమానయాన సంస్థలను ఆదేశించామని, అన్ని సంస్థలు ఇప్పటికే టికెట్ల క్యాన్సిలేషన్, రీషెడ్యూల్ చార్జీలను రద్దు చేశాయని వివరించారు. మరోవైపు త్వరలో కశ్మీర్‌లో పర్యటించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నవారు.. తమ ప్రయాణ టికెట్లు, హోటల్ బుకింగ్స్ వంటివి రద్దు చేసుకుంటున్నారు. ఉగ్రదాడి జరిగాక ఒక్క రోజులోనే జమ్మూకశ్మీర్‌కు 90 శాతం బుకింగ్స్ రద్దయినట్టు ఢిల్లీలోని ట్రావెల్స్ సంస్థలు చెబుతున్నాయి. మిగతావారు కూడా రద్దు చేయాలని కోరుతున్నారని ఢిల్లీ కన్నాట్‌ప్లేస్‌లోని స్వాన్ ట్రావెలర్స్ సంస్థ నిర్వాహకుడు గౌరవ్ రాఠీ పేర్కొన్నారు. జమ్మూకు, వైష్ణోదేవి ఆలయం వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు కూడా పర్యాటకులు భయపడుతున్నారని స్వస్తిక్ ట్రావెల్స్ సంస్థ ప్రతినిధి తెలిపారు. ఇక జమ్మూకశ్మీర్‌కు సంబంధించి ఎలాంటి కొత్త బుకింగ్స్ తీసుకోవద్దని శ్రీనగర్ ట్రావెల్ అసోసియేషన్ నుంచి సమాచారం వచ్చిందని ఏజే టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రతినిధి వెల్లడించారు.



శ్రీనగర్‌లోని నమ్రూస్ హోటల్‌లో తెలంగాణ పర్యాటకులు

ఆరేళ్లలో తొలిసారి బంద్..

ఉగ్రదాడిని నిరసిస్తూ జమ్మూకశ్మీర్‌లోని చాలా ప్రాంతాల్లో బుధవారం బంద్ పాటించారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత బంద్ జరగడం ఇదే తొలిసారి. ముఖ్యంగా జమ్మూ నగరం, ఉధంపూర్, కత్రా, కథువా, సాంబ తదితర ప్రాంతాల్లో పూర్తిగా బంద్ పాటించారు. దుకాణాలు, వాణిజ్య సంస్థలు, విద్యా సంస్థలు మూసివేశారు. సర్జికల్ స్ట్రైక్స్ తరహా దాడులతో ఉగ్రమూకల స్థావరాలపై దాడిచేసి పాకిస్థాన్‌కు బుద్ధిచెప్పాలని బీజేపీ ఎమ్మెల్యే యుధ్‌వీర్ సేథీ డిమాండ్ చేశారు. ఇటీవల హమాస్ చేసిన దాడికి ప్రతిగా ఇజ్రాయెల్ విరుచుకుపడిన స్థాయిలో.. పాకిస్థాన్‌కు భారత్ సమాధానం ఇవ్వాలని జమ్మూకశ్మీర్ మాజీ డీజీపీ ఎస్పీ వైద్ పేర్కొన్నారు. మరోవైపు బనిహాల్, రాజౌరీ, పూంఛ్, దోడా తదితర ప్రాంతాల్లో జమ్మూకశ్మీర్ స్థానిక రాజకీయ పార్టీలు పీడీపీ, నేషనల్ కాన్ఫరెన్స్, పలు ముస్లిం సంస్థలు కూడా ఉగ్రదాడిని నిరసిస్తూ ప్రదర్శనలు నిర్వహించాయి. ఇదిలా ఉండగా, పహల్గామ్ ఉగ్రదాడిని నిరసిస్తూ జమ్మూకశ్మీర్‌లోని పత్రికలు బుధవారం నాటి తమ సంచికల మొదటి పేజీలను నలుపు రంగుతో నింపేశాయి. ముష్కర దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారంటూ నివాళి అర్పించాయి. కాగా, పర్యాటకులపై దాడికి పాల్పడినవారు మానవత్వం లేని జంతువులని, బాధితుల కుటుంబాలకు సానుభూతి ప్రకటిస్తున్నామని నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు.

కశ్మీర్‌లో 80మంది తెలంగాణ టూరిస్టులు

మెదక్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): విహారయాత్ర కోసం కశ్మీర్‌కు వెళ్లిన 80 మంది తెలంగాణ టూరిస్టులు పహల్‌గామ్ ఉగ్రదాడితో బెంబేలెత్తిపోతున్నారు. ఉగ్రదాడి తర్వాత జమ్మూకశ్మీర్‌లో ఆంక్షలు కొనసాగుతుండటంతో తిరిగి వెనక్కి రావడం కష్టంగా ఉందంటూ మెదక్ ప్రాంతానికి చెందిన ఓ విలేకరి రాష్ట్ర కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంత్‌రావుకు వీడియోల ద్వారా సమాచారం అందించారు. మైనంపల్లి వెంటనే స్పందిస్తూ.. గతంలో కరీంనగర్ ఎస్పీగా పనిచేసి ప్రస్తుతం జమ్మూకశ్మీర్ డీజీపీగా ఉన్న నళినీ ప్రభాత్‌తో మాట్లాడి టూరిస్టులను తిరిగి రప్పించేందుకు ఏర్పాట్లు చేయిస్తానని ధైర్యం చెప్పారు.

ఉగ్రదాడి దిగ్భ్రాంతి కలిగించింది: బాబు

» విశాఖ వాసి చంద్రమౌళి మృతదేహంపై జాతీయ పతాకం కప్పి నివాళి



చంద్రమౌళి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు

విశాఖపట్నం/గోపాలపట్నం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పెహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన జేఎస్ చంద్రమౌళి మృతదేహానికి ఆయన బుధవారం రాత్రి నివాళులర్పించారు. విశాఖ ఎయిర్‌పోర్టు ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పోడియంపై ఉంచిన మృతదేహంపై స్వయంగా జాతీయ పతాకాన్ని కప్పారు. చంద్రమౌళి తోడల్లుడు కుమార్‌రాజా, బావమరిది బీఎస్ నాగేశ్వరరావుతో పాటు ఇతర కుటుంబసభ్యులతో మాట్లాడి, కుటుంబ వివరాలను తెలుసుకున్నారు. అంతిమయాత్ర వాహనం ముందు నడుస్తూ నిర్వహించిన శాంతి ర్యాలీలో సీఎం పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడులను దేశంలో ఉన్న ప్రతిఒక్కరూ తీవ్రంగా ఖండించాలని అన్నారు. చంద్రమౌళి బాత్‌రూమ్‌కు వెళ్లారని, ఆ సమయంలో ఇద్దరు దుండగులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారని చెప్పారన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు భారత పర్యటనలో ఉన్నప్పుడు, ప్రధాని మోదీ వేరే దేశంలో ఉండగా ఇలాంటి ఘటన జరగడం చూస్తుంటే ఏదో కుట్ర ఉందనే భావన కలుగుతోందన్నారు. దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని యత్నించే శక్తులపై రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన ఇరువురి కుటుంబాలకు రూ.పది లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. చంద్రమౌళి మృతదేహానికి నివాళులర్పించిన వారిలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు అనిత, బాల వీరాంజనేయస్వామి, ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, పంచకర్ల రమేశ్‌బాబు ఉన్నారు.

విహారంలో విషాదం

కశ్మీర్ ఉగ్రదాడిలో ఇద్దరు ఏపీ వాసుల దుర్మరణం



చంద్రమౌళి



మధుసూదనరావు

విశాఖపట్నం/కావలి రూరల్/నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కశ్మీర్ ఉగ్రదాడిలో విశాఖపట్నానికి చెందిన విశ్రాంత బ్యాంకు ఉద్యోగి చంద్రమౌళి ప్రాణాలు కోల్పోయారు. భార్య, స్నేహితులతో కలిసి విహారం కోసం కశ్మీర్ వెళ్లారని, ఊహించని విధంగా ఉగ్రవాదుల దాడిలో చనిపోవడం తమ కుటుంబంలో విషాదం నింపిందని ఆయన తోడల్లుడు కుమార్‌రాజా ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాకుళానికి చెందిన జేఎస్ చంద్రమౌళి (68) ఎస్బీఐలో పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. తన స్నేహితులు అప్పన్న, శేషగిరి కుటుంబాలతో కలసి ఈ నెల 18న చంద్రమౌళి దంపతులు కశ్మీర్ యాత్రకు వెళ్లారు. కాగా, ఉగ్రదాడి జరిగిన స్థలంలో ఒక మృతదేహం చంద్రమౌళిదిగా అధికారులు గుర్తించారు. ఉగ్రవాదుల దాడిలో నెల్లూరు జిల్లా కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదనరావు(42) దుర్మరణం పాలయ్యారు. ఆయన ఐబీఎంలో, ఈయన భార్య ప్రసన్న కామాక్షి టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పని చేస్తున్నారు. బెంగుళూరులో స్థిరపడ్డారు. పిల్లలకు సెలవులు కావడంతో గత ఆదివారం రాత్రి వీరి కుటుంబం కశ్మీరు విహార యాత్రకు వెళ్లింది. మంగళవారం మధ్యాహ్నం వరకు సరదాగా సాగిన తమ యాత్ర ఫొటోలను బంధువులకు షేర్ చేశారు. అంతలోనే పహల్గాంలో ఉగ్రమూకలు జరిపిన కాల్పుల్లో మధుసూదనరావు అక్కడికక్కడే మృతిచెందారు.

మాకు సంబంధం లేదు: పాక్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: పహల్గాం ఉగ్రదాడితో తమకు ఎలాంటి సంబంధం లేదని పాకిస్థాన్ పేర్కొంది. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా ఆమోదించబోమని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం నాగాలాండ్, మణిపూర్, కశ్మీర్, ఛత్తీస్‌గఢ్ సహా చాలా రాష్ట్రాల్లో నిరసనలు ఎదుర్కొంటోందని, అనేక మందిపై ఉక్కుపాదం మోపుతోందని, వాటి పర్యవసానమే పహల్గాం దాడి అని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యానించారు. ఆ దాడి భారత్‌లో స్థానిక పరిస్థితుల వల్ల జరిగిందని పేర్కొన్నారు. స్థానిక శక్తులు భారత ప్రభుత్వాన్ని లక్ష్యం చేసుకుంటే.. నెపాన్ని పాకిస్థాన్‌పైకి నెట్టివేయడం సులువు అవుతుందని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదానికి స్థానికులు లక్ష్యం కారాదని, ఈ విషయంలో తమకు ఎలాంటి సందేహం లేదని పేర్కొన్నారు.

ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పాలి

» దాడిని ఖండిస్తున్నాం: అసదుద్దీన్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ పేర్కొన్నారు. భద్రతా లోపం, నిఘా వైఫల్యమే ఈ ఘటనకు కారణమన్నారు. పహల్గాంలో ఉగ్రవాదులు మతం అడిగి మరీ అమాయకులను చంపినట్టు వార్తలు వచ్చాయని, ఇది అత్యంత గర్హనీయమన్నారు. ఉరి, పుల్వామా దాడి కంటే పహల్గాం ఘటన ఘోరమని పేర్కొన్నారు. ఉగ్రవాదులకు ప్రభుత్వం గుణపాఠం చెప్పాలని కోరారు.

సుప్రీం కోర్టు సంతాపం

ఉగ్ర ఘటనలో మృతులకు సుప్రీంకోర్టు సంతాపం ప్రకటించింది. బుధవారం లంచ్ తర్వాత మధ్యాహ్నం 2గంటల సమయంలో అన్ని కోర్టు హాళ్లలో ఒకేసారి అందరూ పహల్‌గామ్ మృతులకు సంతాప సూచకంగా నిలబడి నిమిషం పాటు మౌనం పాటించారు.

నిఘా వర్గాలు హెచ్చరించినా



బుధవారం అనంత్‌నాగ్‌లో భద్రతా బలగాల సెర్చ్ ఆపరేషన్

భద్రతా దళాల వైఫల్యం వల్లే ఉగ్రదాడి జరిగిందంటున్న విశ్వసనీయ వర్గాలు

» సైనికుల దుస్తుల్లో వచ్చి 70 రౌండ్ల కాల్పులు.. ప్రాథమిక దర్యాప్తులో వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: పహల్గామ్‌లో ఉగ్రదాడి జరగబోతోందనే సమాచారం మన నిఘా వర్గాలకు కొద్ది రోజుల క్రితమే తెలిసిందా? "ఒక టెర్రర్ గ్రూప్ స్థానికేతరులపై (కశ్మీర్‌కు వచ్చే పర్యాటకులపై) దాడికి ప్రణాళికలు రచిస్తోంది" అంటూ నిఘావర్గాలు అప్రమత్తం చేశాయా? అయినా భద్రతా సంస్థలు పట్టించుకోకపోవడం వల్లే ఇంతమంది చనిపోయారా? అంటే.. విశ్వసనీయ వర్గాలు ఈ ప్రశ్నలు ఔననే సమాధానమే ఇస్తున్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు (పీవోకే) చెందిన ఒక ఉగ్రవాది.. ఈ దాడికి సంబంధించి సూచనప్రాయ వ్యాఖ్యలు చేశాడని, తాము ఆ సమాచారాన్ని అందించినా భద్రతా దళాలు వాటిని పట్టించుకోలేదని ఆ వర్గాలు చెబుతున్నాయి. ఈ దాడికి వ్యూహరచన మొత్తం పీవోకే, పాక్‌కు చెందిన అంతర్జాతీయ హ్యాండ్లర్లు చేశారని.. దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులకు రియల్‌టైమ్‌లో ఎప్పుడేం చేయాలో ఆదేశాలు ఇచ్చారని, ఏయే ప్రాంతాల్లో భద్రతా దళాల సంఖ్య తక్కువగా, పర్యాటకుల సంఖ్య ఎక్కువగా ఉంటుందో సమగ్ర సమాచారం అందించారని ఆ వర్గాలు వెల్లడించాయి. ఉగ్రవాదులకు ఆయుధాల వినియోగంలో సమగ్ర శిక్షణ ఇచ్చారని తెలిపాయి. వారి హెల్మెట్లపై కెమెరాలున్నాయని.. దాడి ఘటనలను చిత్రీకరించి, సూత్రధారులకు పంపేందుకే వాటిని వినియోగించారని పేర్కొన్నాయి. అయితే, పహల్గాంలో ఉగ్రదాడి విషయంలో భద్రతా సంస్థల వైఫల్యం నిజమేగానీ.. పూర్తిగా విఫలమయ్యాయని చెప్పలేమని కర్ణాటకకు చెందిన రక్షణ రంగ వ్యవహారాల విశ్లేషకుడు గిరీశ్ లింగన్న అభిప్రాయపడ్డారు. దాడికి ముందు ఆ పరిసర ప్రాంతాల్లో ఉగ్రవాదులు రెక్కీ నిర్వహించిన విషయం, వారి అనుమానాస్పద కదలికల గురించి నిఘా వర్గాలకు సమాచారం ఉన్నట్టుగా తెలుస్తోందని.. కానీ, ఏ సమయంలో దాడి జరగబోతోంది? ఏ స్థాయిలో జరగబోతోందనే అంశంపై పూర్తి సమాచారం లేనందునే భద్రతా దళాలు సరిగ్గా స్పందించలేకపోయాయని ఆయన వివరించారు. దాడి జరిగిన వెంటనే మాత్రం భద్రతా దళాలు వేగంగా స్పందించాయని, మన దళాల సన్నద్ధత సామర్థ్యాన్ని ఇది సూచిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ వైఫల్యం నుంచి పాఠాలు నేర్చుకోవాలని.. పర్యాటకులు ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లో మరింత మెరుగైన రియల్-టైమ్ సర్వైలెన్స్ ఏర్పాట్లు చేయాలని, కేంద్ర, రాష్ట్ర భద్రతా సంస్థల మధ్య బలమైన సమన్వయం ఉండాలని, ప్రత్యేకించి కశ్మీర్‌లో పర్యాటక ప్రదేశాలకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ఉగ్రవాద నిరోధక చర్యల్లో భాగంగా అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించాలని, అంతర్జాతీయ మద్దతు.. మరీ ముఖ్యంగా అమెరికా మద్దతు తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు.

అచ్చం సైనికుల్లా..

పహల్గాంలో పర్యాటకులపై దాడి జరిపిన ఉగ్రవాదులు సైనికుల యూనిఫారాలు, అమెరికన్ మేడ్ ఎం4 కార్బైన్ అసాల్ట్ రైఫిళ్లు, ఏకే-47లు ధరించి వచ్చి.. దాదాపు 70 రౌండ్ల కాల్పులు జరిపినట్టు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఆ ప్రాంతాన్ని జల్లెడపట్టిన దర్యాప్తు అధికారులు.. మంగళవారం సాయంత్రానికి 50 నుంచి 70 దాకా యూజ్డ్ క్యాట్రిడ్జ్‌లను స్వాధీనం చేసుకున్నారు. కాగా... ఈ దాడికి సంబంధించిన దర్యాప్తు బాధ్యతను జమ్ముకశ్మీర్ పోలీసుల నుంచి జాతీయ దర్యాప్తు సంస్థకు (ఎన్ఐఏ) అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది.

కశ్మీర్‌లో 56 మంది విదేశీ ఉగ్రవాదులు

అత్యధికంగా లష్కరే ముష్కరులు 35 మంది...జైషే ఉగ్రవాదులు 18 మంది

జమ్ముకశ్మీర్‌లో 56 మంది విదేశీ ఉగ్రవాదులు ఉన్నట్టు భద్రతా దళాలు, భద్రతా నిపుణుల సమాచారం. వారిలో అత్యధికులు.. 35 మంది.. లష్కరే తాయిబాకు చెందినవారేనని, 18 మంది జైషే మొహమ్మద్ ఉగ్ర సంస్థకు చెందినవారని, ముగ్గురు హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాదులని.. ఆ ముగ్గురూ పాకిస్థానీలని భద్రతాదళాలకు చెందిన ఒక అధికారి వెల్లడించారు. ఈ 56 మందికి తోడు మరో 17 మంది స్థానిక ఉగ్రవాదులు కూడా ఉన్నట్టు ఆయన తెలిపారు. మంగళవారం నాటి దాడి తమ పనేనని టీఆర్ఎఫ్ (ద రెసిస్టెంట్ ఫ్రంట్) ప్రకటించినప్పటికీ.. అది ముసుగు మాత్రమేనని.. వాస్తవంగా దీని వెనుక ఉన్నది లష్కరే ఉగ్రవాదులేనని జమ్ముకశ్మీర్ మాజీ పోలీసు బాస్ ఎస్పీ వైద్ అభిప్రాయపడ్డారు. దాదాపు మూడు దశాబ్దాలపాటు జమ్ముకశ్మీర్ పోలీసు శాఖలో పనిచేసిన వైద్.. గతంలో ఉగ్రవాదులు (విదేశీ, స్థానిక) అమర్‌నాథ్ యాత్రకు వచ్చే యాత్రికులను మాత్రమే లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడేవారని.. కానీ, ఇప్పుడు వారి వ్యూహం మారినట్టు కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు. "ఈ దాడి ప్రభావం కశ్మీర్‌లోయపై తీవ్రంగా పడుతుంది. పర్యాటకులు తమ బుకింగ్స్‌ను రద్దు చేసుకుంటారు. వేరే ప్రాంతాల నుంచి కశ్మీర్‌కు రావాలంటేనే భయపడే పరిస్థితి ఉంటుంది. హోటళ్లు ఖాళీ అవుతాయి. పాకిస్థాన్‌కు కావాల్సింది సరిగ్గా ఇదే" అని ఆయన ఆందోళన వెలిబుచ్చారు. కశ్మీరీలంతా దీనికి వ్యతిరేకంగా ఒక్కటై నిలవాలని ఆయన సూచించారు.

రెండు జంటలు.. ఇద్దరు నవవరుల మృతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: నిండు నూరేళ్ల జీవితాన్ని సంతోషంగా గడిపేందుకు కోటి ఆశలతో ఒక్కటైన రెండు జంటలు.. ఒకరికొకరు తోడుగా ప్రకృతి అందాలను వీక్షిస్తూ మైమరిచిపోయిన సమయంలో ముష్కర మూకలు వారిని విడదీశాయి. వందేళ్ల బతుకు కలలను క్షణంలో చిదిమేశాయి. జమ్మూకశ్మీర్‌లోని బైసారన్‌లో ఉగ్రవాదుల మారణకాండలో ఇటీవలే పెళ్లయిన ఇద్దరు యువకులు కన్నుమూశారు. వారిలో ఒకరు నావికాదళంలో లెఫ్టినెంట్‌గా పనిచేస్తున్న వినయ్ నర్వాల్ (26), మరొకరు వ్యాపారవేత్త శుభమ్ ద్వివేదీ (30). హరియాణాలోని కర్నాల్ ప్రాంతానికి చెందిన వినయ్ నర్వాల్‌కు ఈ నెల 16వ తేదీనే హిమాన్షితో వివాహం జరిగింది. 19వ తేదీన రిసెప్షన్ వేడుక జరిగింది. హనీమూన్ కోసం యూరప్ వెళ్లడానికి సిద్ధమైన ఈ జంట.. వీసా తిరస్కరణకు గురవడంతో బదులుగా కశ్మీర్‌ను ఎంచుకుంది. 22వ తేదీన బైసారన్ ప్రాంతంలో విహరిస్తుండగా ఉగ్రవాదుల దుశ్చర్యకు వినయ్ బలయ్యారు. తన కళ్లముందే భర్తను కాల్చి చంపేయడంతో హిమాన్షి తీవ్ర ఆవేదనలో కూరుకుపోయారు. బుధవారం వినయ్ మృతదేహాన్ని ఢిల్లీకి తరలించిన సమయంలో.. శవపేటికను గట్టిగా కౌగిలించుకుని ఆమె చేసిన రోదన అందరినీ కలచివేసింది. మే 1వ తేదీన వినయ్ పుట్టినరోజు ఉండటంతో.. కుటుంబ సభ్యులు వేడుకల కోసం ఏర్పాట్లు కూడా మొదలుపెట్టారు. కానీ ఇంతలోనే కన్నుమూశాడంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన శుభమ్ ద్వివేదీకి ఈ ఏడాది ఫిబ్రవరి 12వ తేదీనే అశాన్యతో వివాహం జరిగింది. హనీమూన్ కోసం తమ తొలి ట్రిప్‌గా వారు జమ్మూకశ్మీర్‌కు వచ్చారు. సరదాగా గుర్రాలు ఎక్కి బైసారన్ ప్రాంతానికి చేరుకున్నారు. ఇంతలోనే ఉగ్రదాడిలో శుభమ్ బలయ్యాడు. తన కళ్లముందే భర్తను చంపేయడంతో అశాన్య హతాశురాలైంది. "అప్పుడే గుర్రాలపై కొండపైకి చేరుకున్నాం. ఓ వ్యక్తి మావద్దకు వచ్చి.. మీరు హిందువా, ముస్లిమా అని అడిగాడు. అతను జోక్ చేస్తున్నాడని అనుకుని నవ్వేశాం. కానీ అతను మళ్లీ అడిగాడు. మేం ముస్లింలం కాదని చెప్పగానే.. గన్ తీసి శుభమ్‌ను తలపై కాల్చాడు. నన్ను కూడా కాల్చేసి ఉంటే బాగుండేది.." అంటూ అశాన్య వాపోయారు.



ఉగ్రదాడికి కొద్ది సేపటి ముందు వినయ్ నర్వాల్-హిమాన్షి దంపతులు సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న వీడియోలోని దృశ్యం

చైనాపై సుంకాలు తగ్గుతాయ్

కానీ సున్నాకు మాత్రం చేరవు: ట్రంప్

వాషింగ్టన్, ఏప్రిల్ 23: చైనాపై అధిక సుంకాలతో విరుచుకుపడి వాణిజ్య యుద్ధానికి తెరతీసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యూటర్న్ తీసుకున్నట్టుగా సంకేతాలిచ్చారు. చైనా ఉత్పత్తులపై విధించిన అధిక సుంకాలు గణనీయంగా తగ్గుతాయని, అయితే సున్నా మాత్రంకావని మంగళవారం వైట్ హౌస్‌లో ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికా విధించిన సుంకాలకు ప్రతీకారంగా చైనా సుంకాలు విధించడంతో ఆ దేశ ఉత్పత్తులపై అమెరికా సుంకాలు 145 శాతం మించాయి. ఈ నేపథ్యంలో "145 శాతం అనేది చాలా ఎక్కువ. అయితే అది అంత ఎక్కువగా ఉండదు.. గణనీయంగా తగ్గుతుంది. కానీ సున్నా మాత్రం కాదు" అని ఓవల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా, చైనా మధ్య అధిక సుంకాలు రెండు ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్యాన్ని అడ్డుకున్నాయని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ అంతకు ముందు వ్యాఖ్యానించారు. దీని గురించి ప్రశ్నించిన సందర్భంగా ట్రంప్ పై విధంగా స్పందించారు. కాగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో తనకు మంచి సంబంధం ఉందని ట్రంప్ పేర్కొన్నారు. షీ చర్చలకు వస్తారన్న ఆశాభావాన్ని ట్రంప్ మరోసారి వ్యక్తం చేశారు. ఒప్పందం కోసం చైనా లేదా షీతో అమెరికా కఠినంగా వ్యవహరించబోతోందా, కొవిడ్ మహమ్మారి గురించి అధికారులు ప్రస్తావిస్తారా అని ప్రశ్నించగా.. లేదని ఆయన సమాధానమిచ్చారు. కానీ వారు చివరకు ఒక ఒప్పందం కుదుర్చుకోవాలన్నారు.



ట్రంప్ వ్యాఖ్యలతో స్టాక్ మార్కెట్లో జోరు..

చైనాపై సుంకాలు గణనీయంగా తగ్గుతాయని, అమెరికా ఫెడరల్ రిజర్వు ఛైర్మన్ జెరోమ్ పావెల్‌ను తొలగించే ఉద్దేశం లేదని మంగళవారం డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు ఎగబాకాయి. ఎస్ అండ్ పీ 500 బ్లూచిప్ ఇండెక్స్, నాస్‌డాక్ 2.5 శాతానికి పైగా పెరిగాయి. ఆసియా మార్కెట్లో జపాన్ సూచీ నిక్కీ దాదాపు 2 శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 2.4 శాతం, దక్షిణ కొరియా కాస్పీ 1.6 శాతం పెరిగాయి. బుధవారం ప్రారంభ ట్రేడింగ్‌లో యూరప్ మార్కెట్లలోనూ ర్యాలీ నెలకొంది. యూకే ఎఫ్‌టీఎస్ఈ 100 ఇండెక్స్ 1.6 శాతం, ఇటాలియన్ ఎఫ్‌టీఎస్ఈ ఎంఐబీ 1.1 శాతం పెరిగాయి. జర్మనీ డాక్స్ 2.6 శాతం, ఫ్రాన్స్ సీఏసీ 2.5 శాతం పుంజుకుంది. పావెల్‌ను తొలగించబోమని ట్రంప్ పేర్కొనడంతో ఇన్వెస్టర్లలో విశ్వాసం పెరిగింది. ఇదిలా ఉండగా, సుంకాల ప్రయోగాన్ని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ బుధవారం తీవ్రంగా విమర్శించారు. ఇవి అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థను బలహీనపరచడమేకాకుండా ప్రపంచ ఆర్థిక క్రమాన్ని అస్థిరపరుస్తాయని ఆయన హెచ్చరించారు.

భారత్‌కు ఎఫ్-35లు అందిస్తాం

» అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: అమెరికా మరోసారి భారత్‌కు ఎఫ్-35 యుద్ధ విమానాలను ఆఫర్ చేసింది. భారత్‌కు ఎఫ్-35లు అందించడానికి సిద్ధంగా ఉన్నట్టు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రకటించారు. దేశ గగనతలాన్ని సంరక్షించడంలో ఈ ఐదో తరం అత్యాధునిక యుద్ధ విమానాలు భారత వైమానిక దళానికి మునుపెన్నడూ లేనంత సామర్థ్యాలను అందిస్తాయని చెప్పారు. అమెరికా నుంచి మరింతగా రక్షణ సామగ్రిని కొనుగోలు చేయడం భారత్‌కు ప్రయోజనకరమని అన్నారు. అమెరికాతో రక్షణ సహకారాన్ని కొనసాగించడం ద్వారా భారత్ మరింత ప్రయోజనం పొందాలని వాన్స్ ఆకాంక్షించారు. ఇటీవల ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఈ ఆధునిక స్టెల్త్ ఫైటర్‌ను భారత్‌కు అందిస్తామని ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా, ఎఫ్-35 విమానాల కొనుగోలుపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని వైమానిక దళాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ వ్యాఖ్యానించారు.

క్లస్టర్ విధానంతో వీఆర్వోలకు పని ఒత్తిడి: రవీంద్రరాజు

విజయవాడ (గాంధీనగర్), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్ పేరుతో జరుగుతున్న క్లస్టర్ విధానంతో వీఆర్వోలకు తీవ్ర పని ఒత్తిడి పెరుగుతుందని ఆంధ్రప్రదేశ్ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్.రవీంద్రరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులైన గ్రామ రెవెన్యూ అధికారులకు సీనియర్ అసిస్టెంట్లుగా, గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1 వీఆర్వోలుగా ప్రమోషన్లు కల్పించాలన్నారు. ఐవీఆర్ఎస్ సర్వే పేరుతో వీఆర్ఓల మనోభావాలు దెబ్బతీసేలా చేస్తున్న చర్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పోరేషన్ లిమిటెడ్
(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రంగ సంస్థ) మంగళగిరి
టెండరు ప్రకటన

ప్రకటన నెం.3/2025, తేది: 23.04.2025

ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పోరేషన్ లిమిటెడ్ వారు తమ ప్రధాన కార్యాలయము మరియు రాష్ట్రములో గల (29) లిక్కర్ డిపోల ఆవరణలో ఉన్న ఎక్కడ ఉన్న వస్తువులు అక్కడ నుంచే ప్రాతిపదికన (ఫర్నిచర్, ఇన్వెర్టరు-బ్యాటరీలతో సహా, కంప్యూటర్లు, ప్రింటర్లు, ఫ్రీజర్లు, ట్యాబ్లు, స్కానర్లు క్యాష్ కౌంటింగ్ మెషిన్లు, క్యాష్ చెస్టులు, సి.సి.కెమెరాలు వగైరాలు) అమ్మకానికి నిర్ణయించి టెండర్లను కోరుచున్నాము. వివరాలకు వెబ్‌సైట్ https://apsbcl.ap.gov.inను సంప్రదించగలరు.

సం/- మేనేజింగ్ డైరెక్టర్
DIPR RO No.4061PP/CL/ADVT/1/1/2021-22, Dt: 23.04.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
చిట్ టెండరు ప్రకటన

చిట్ నిట్ నెం.17 నుండి 28/టి.ఓ./2025-26, తేది: 23.04.2025

ప్రధాన మంత్రి పర్యటన నిమిత్తం అత్యవసర రహదారుల మరమ్మత్తుల పనులకు సుమారు రూ.384.50 లక్షల విలువ గల 12 పనులకు బాక్స్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు దాఖలు చేయుటకు చివరి తేది: 26.04.2025, సా.4గం.ల వరకు. తదుపరి వివరములకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్&బి) డివిజన్, గుంటూరు కార్యాలయము నందు సంప్రదించగలరు.

సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, (ర.భ) డివిజన్, గుంటూరు
DIPR RO No.16204/CL/ADVT/1/1/2021-22, Dt: 23.03.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనాల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

NIT No. 01 to 02/TO/SE(R&B)NLR/2025-26 తేది: 21.04.2025

SPSR నెల్లూరు జిల్లా, కలెక్టర్ బంగ్లాకు అత్యవసర మరమ్మతుల కొరకు ఇ-ప్లాట్‌ఫారం ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. అంచనామొత్తం: రూ.298.50 లక్షలు. టెండర్లను www.apeprocurement.gov.in నుండి 28.04.2025న మ.3 గం.నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది 16.05.2025న లేదా అలోగా మ.3 గం.వరకు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఆర్&బి) సర్కిల్, నెల్లూరు.
DIPR RO.No: 16198/CL/ADVT/1/1/2021-22, తేది: 23.04.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నెం.1 టు 10/2025-26, తేది: 19.04.2025

కార్యనిర్వాహక ఇంజనీరు, గ్రా.నీ.స & పారిశుధ్య (ప్రా) విభాగము, విజయవాడ వారిచే ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ డివిజనులో 8 పనులకు అంచనా విలువ: రూ.185.50 లక్షలకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు డాక్యుమెంట్స్ లభ్యత తేది: 28.04.2025, ఉ.10.30గం. నుండి 12.05.2025, సా.4గం. వరకు. ఇతర వివరాలను www.apeprocurement.gov.in నందు చూడగలరు.

సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, గ్రా.నీ.స & పారిశుధ్య (ప్రా) విభాగము, విజయవాడ
DIPR RO No.16189/CL/ADVT/1/1/2021-22, Dt: 23.04.2025

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)
Lenin Center, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

E-PROCUREMENT SHORT TENDER NOTICE

S.No	NIT No	Name of the Work
1	NIT No. 18/PROC/MAU61-OPOM0COMM/16/2025-JDC, Dt. 23.04.2025	APCRDA-"Request for Proposal (RfP) for Appointment of Agency for Branding, Communications, and Digital Outreach Strategy for Amaravati"

The bid can be downloaded on AP e-procurement portal from **24.04.2025 to 01.05.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid is **01.05.2025 up to 15.00 Hrs**, Technical bid opening **01.05.2025 @ 16.00 Hrs**

E-PROCUREMENT TENDER NOTICE

S.No	NIT No	Name of the Work
2	NIT No. MAU61-ADMN0SD(VI)/19/2025-HB, Dt. 23.04.2025.	Supply and fixing of split air conditioners of four numbers in APCRDA thullur unit office"- **Estimate Amount: Rs. 3.60 Lakhs.**
3	NIT No. MAU61-ADMN0SD(VI)/16/2025-HB, Dt. 23.04.2025.	"Construction of Horticulture Nursery cum training centre (HNTC) at UD Palem in CRDA Region"- **Estimate Amount: Rs. 96.00 Lakhs.**

(S.No 2) The bid can be downloaded on AP e-procurement portal from **24.04.2025 to 08.05.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid **08.05.2025 up to 15.00 Hrs**, Technical bid opening **08.05.2025 @16.00 Hrs.**

(S.No 3) The bid can be downloaded on AP e-procurement portal from **24.04.2025 to 09.05.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid **09.05.2025 up to 15.00 Hrs**, Technical bid opening **09.05.2025 @16.00 Hrs.**

For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in.**

Sd/- Commissioner, APCRDA, Vijayawada.

బాబుపై 'అంగళ్లు' కేసుల మూసివేత!

నాడు వైసీపీ మూకల రాళ్ల దాడి.. పైగా ఆయనపైనే హత్యాయత్నం సహా 4 తప్పుడు కేసులు

- **దేవినేని, అమరనాథ్‌రెడ్డి సహా 20 మంది క్రియాశీల నేతలపైనా బనాయింపు**
- **కూటమి ప్రభుత్వం వచ్చాక పూర్తిస్థాయి విచారణ**
- **తప్పుడు కేసులని పోలీసుల దర్యాప్తులో నిర్ధారణ**
- **వాటిని మూసివేస్తున్నట్లు కోర్టుకు వివరాల సమర్పణ**

రాయచోటి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబుపై అన్నమయ్య జిల్లా అంగళ్లులో అక్రమంగా బనాయించిన కేసులను పోలీసులు మూసివేశారు. పూర్తి స్థాయిలో విచారించిన తర్వాత ఆయనపై చేసినవి తప్పుడు ఫిర్యాదులుగా నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కోర్టుకు నివేదించినట్లు తెలిసింది. ప్రతిపక్ష నేత హోదాలో 2023 ఆగస్టు 9న చంద్రబాబు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పరిశీలనకు వచ్చారు. నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథరెడ్డి వర్గీయులు అడుగడుగునా ఆయన పర్యటనను అడ్డుకున్నారు. అప్పటి పోలీసుల సహకారంతో..వందల మంది వైసీపీ మూకలు కురబలకోట మండలం అంగళ్లు సర్కిల్‌లో నడిరోడ్డుపై బైఠాయించారు. టీడీపీ వర్గీయులపై యథేచ్ఛగా రాళ్లదాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో పలువురు టీడీపీ కార్యకర్తలకు దెబ్బలు తగిలాయి. చంద్రబాబుపైకీ రాళ్లు రువ్వారు. భద్రతా సిబ్బంది సకాలంలో స్పందించి అడ్డుకోవడంతో ఆయనకు ఎటువంటి గాయాలూ కాలేదు. అయితే ప్రాజెక్టుల సందర్శనకు వస్తున్న చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చేందుకు తాము వెళ్తుంటే.. టీడీపీ నాయకులు తమపై మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారని, చంద్రబాబు రెచ్చగొట్టడం వల్లే ఈ దాడులు జరిగాయని వైసీపీ ముఖ్యనాయకుడు ఉమాపతిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్పట్లో ముదివేడు పోలీసులు చంద్రబాబుపై ఏకంగా హత్యాయత్నం (307) సహా పలు నాన్‌బెయిలబుల్ సెక్షన్లతో (క్రైం నంబర్లు 79/2023, 74/2023, 75/2023, 76/2023) నాలుగు కేసులు నమోదు చేశారు. మాజీ మంత్రులు దేవినేని ఉమ, అమరనాథ్‌రెడ్డి సహా 20 మంది క్రియాశీల టీడీపీ నాయకుల పైనా కేసులు పెట్టారు. వైసీపీ నాయకుల ప్రోద్బలంతో కొందరు పోలీసులు.. తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాలకు చెందిన వందల మంది క్రియాశీల టీడీపీ నాయకులు, కార్యకర్తలను కూడా ఈ కేసుల్లో ఇరికించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక పోలీసులు ఈ సంఘటన పూర్వాపరాలను పూర్తి స్థాయిలో విచారించారు. చంద్రబాబు పర్యటనను వైసీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడమే కాకుండా.. ఆయనపై రాళ్లు రువ్వినట్లు కూడా గుర్తించారు. దాడులకు దిగిన వారిపై కేసులు నమోదు చేయకపోగా.. ఆయనపైన, ఇతర టీడీపీ నాయకులపైన అక్రమ కేసులు బనాయించినట్లు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో చంద్రబాబుపై బనాయించిన హత్యాయత్నం కేసుతో పాటు.. మిగిలిన మూడు కేసులూ తప్పుడువేనని తేల్చారు. వాటిని మూసివేస్తూ కోర్టుకు వివరాలు సమర్పించినట్లు సమాచారం.

బీటెక్ విద్యార్థులకు సమ్మర్ ఆన్‌లైన్ ఇంటర్న్‌షిప్

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ థర్డ్, ఫోర్త్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు మొదటి విడత వేసవి ఆన్‌లైన్ ఇంటర్న్‌షిప్-2025 కోసం శుక్రవారం వరకు దరఖాస్తు చేసుకోవచ్చని నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ జి.గణేష్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండో విడతకు మే 9 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మొదటి విడత ఇంటర్న్‌షిప్ ఏప్రిల్ 28న, రెండో విడత ఇంటర్న్‌షిప్ మే 12న ప్రారంభమవుతుందని వివరించారు. సీఎస్ఈ, ఐటీ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ విద్యార్థులు ఈ ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

RAJIV GANDHI UNIVERSITY OF KNOWLEDGE TECHNOLOGIES : ANDHRA PRADESH
(Established through Act No.18 of 2008 by the Govt. of Andhra Pradesh and recognized as per Section 2(f), 12(B) of UGC Act. 1956)

Admission Notification for Integrated Under Graduate Programs - 2025-26

No.1/RGUKT-AP/UG/Admissions/2025, Date:24-04-2025 Online applications are invited from eligible candidates for Admission into the Six Year Integrated B.Tech Programme in RGUKT AP campuses at Nuzvid, RK Valley (Idupulapaya), Ongole, and Srikakulam for the academic year 2025-26. Interested candidates can apply for admission online through University website **www.rgukt.in/** AP online center. Candidates can submit their online applications from 10:00 AM on 27.04.2025. The last date for submission is 20.05.2025, upto 5:00PM. For more details, visit the university website at **www.rgukt.in**

Sd/- Convener
DIPR RO No.4060PP/CL/ADVT/1/1/2021-22, Dt: 23.04.2025

రాష్ట్రం నిప్పుల కొలిమి

- **నంద్యాల జిల్లా గోనవరంలో 44 డిగ్రీల ఉష్ణోగ్రత**
- **మరో మూడు రోజులు ఎండలే**

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరిగింది. వాయవ్య దిశ నుంచి వచ్చే పొడిగాలుల ప్రభావంతో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎక్కువ ప్రాంతాల్లో వేడి వాతావరణం కొనసాగింది. అక్కడక్కడ వడగాడ్పులు వీచాయి. పలుచోట్ల పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. ఈ సీజన్‌లో తొలిసారిగా బుధవారం నంద్యాల జిల్లా గోనవరంలో 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ప్రకాశం జిల్లా గొల్లవిడిపిలో 43.8, కడప జిల్లా మద్దూరులో 43.6, నంద్యాలలో 43 డిగ్రీలు, కర్నూలు జిల్లా తోవిలో 42.9, పల్నాడు జిల్లా నర్మలపాడులో 42.8, నెల్లూరు జిల్లా ఉదయగిరిలో 42.5, జంఘమహేశ్వరపురం, కడపల్లో 42.6, కర్నూలులో 42.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 135 ప్రాంతాల్లో 41 డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న మూడు రోజులు కోస్తా, రాయలసీమల్లో ఎండ తీవ్రత, ఉక్కపోత కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే, ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ, రాయలసీమ, తమిళనాడు మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకూ ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. దీంతో బుధవారం కోస్తాలో అక్కడక్కడ ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. కాగా, గురువారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, జిల్లాల్లోని 30 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, మరో 29 మండలాల్లో వడగాడ్పుల ప్రభావం ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రాష్ట్రంలో అక్కడక్కడ పిడుగులతో కూడిన అకాల వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది.

నేడు పంచాయతీరాజ్ దినోత్సవం

- **మంగళగిరిలో పురస్కారాలు అందజేయనున్న ఉప ముఖ్యమంత్రి**

అమరావతి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా నేడు మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్లో నిర్వహించే కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, పంచాయతీరాజ్ విభాగాలు, గ్రామీణాభివృద్ధిశాఖ, గ్రామీణ నీటిసరఫరా విభాగం, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం, సోషల్ ఆడిట్, ఎస్ఐఆర్డీ, జాతీయ పంచాయతీ అవార్డు-2024 గ్రహీతలకు ఆయన పురస్కారాలు అందిస్తారు. పంచాయతీరాజ్‌లో భాగస్వాములైన గ్రామీణ స్థానికసంస్థల ప్రతినిధులు 994 మందిని ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు.

పాస్టర్ ప్రవీణ్ కేసులో సీసీ కెమెరా ఫుటేజ్ భద్రపరచాలి: పాల్

విజయవాడ (గాంధీనగర్) ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ మృతి ఘటనకు సంబంధించి అన్ని సీసీ కెమెరా ఫుటేజ్‌లను భద్రపరచాలని, రీ పోస్టుమార్టం చేయాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ. పాల్ డిమాండ్ చేశారు. విజయవాడలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రవీణ్ మృతిపై ఉన్న అనుమానాలపై హైకోర్టులో తాను వేసిన పిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు కౌంటర్ దాఖలు చేయకపోవడాన్ని తప్పుబట్టారు. మార్చి 28న ఇచ్చిన పోస్టుమార్టం నివేదికలో మద్యం సేవించినట్టు లేదని, తర్వాత ఇచ్చిన నివేదికలో మద్యం అనవాళ్లు ఉన్నాయని చెప్పడంపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రవీణ్ సంఘటనపై సిట్టింగ్ జడ్జితో లేదా సీబీఐతో విచారించి సీఎం చంద్రబాబు తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని కేఏ పాల్ తీవ్రంగా ఖండించారు.

VISAKHAPATNAM METROPOLITAN REGION DEVELOPMENT AUTHORITY

e-AUCTION NOTICE

Rc. No.17,18 & 20/School/commercial/2025/F1 Dt. 19-04-2025

The VMRDA, Visakhapatnam has proposed to sell the following School sites / Commercial sites available in Simhapuri, Chinamushidiwada and Kurmannapalem, Visakhapatnam District to the public on "as is where is basis" and applications are invited through GOAP e-auction portal **(https://Konugolu.ap.gov.in)** as detailed below:

e-Notification	Bulk land extent in Acre	Bulk land extent in Sq.yds	Sy.No. and Location	Application invited for registration	Date of auction
17/2024/BL/F1 (School site)	0.95	4,589.40	164/P of Vepagunta	From 21-04-2025 to 05-05-2025	07-05-2025 10.00 AM to 12.00 PM
18/2024/BL/F1 (School site)	0.76	3,689.14	198/P & 199/P of Chinamushidiwada Village		07-05-2025 12.00 PM to 2.00 PM
20/2024/BL/F1 (Commercial)	-	723.33	Sy.No. 86/P of Kurmannapalem Ph-IV		07-05-2025 2.00 PM to 4.00 PM

For more details at VMRDA website www.vmrda.gov.in /Email e.auctionvmrda@gmail.com / (Help desk Konugolu portal) 9154383633/34, 7337318402/03, VMRDA, Contact details : 9985614879, 9848716168, Land Line No.0891-2755554 & 0891-2754133/2754005.

Sd/-Metropolitan Commissioner, VMRDA

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పోప్ ఫ్రాన్సిస్

సంస్కర్త హృదయమున్న ఆధ్యాత్మిక పుణ్యమూర్తి పోప్ ఫ్రాన్సిస్. మొన్న సోమవారంనాడు మరణించిన ఈ పోప్ ప్రపంచ వ్యాప్తంగా 140 కోట్లకు పైగా ఉన్న రోమన్ కేథలిక్ మతస్థులకు వహించిన మార్గదర్శకత్వం విప్లవాత్మకమైనది. ఆయన పేదల పక్షపాతి. ధరిత్రికి ముంచుకొస్తున్న ముప్పును గుర్తించి వాతావరణ మార్పు వైపరీత్యాన్ని ఎదుర్కొనేందుకు ప్రభుత్వాలు, ప్రజలకు ప్రేరణ కల్పించిన కార్యాచరణ ద్రష్ట.

లాటిన్ అమెరికా నుంచి, ఆ మాటకొస్తే ఉభయ అమెరికా ఖండాల నుంచి క్రైస్తవ మత అత్యున్నత పీఠాన్ని అధిష్ఠించిన తొలివ్యక్తి పోప్ ఫ్రాన్సిస్. జార్జి మారియో బెర్ గొగ్లియోగా 1936లో అర్జెంటీనాలో జన్మించిన ఫ్రాన్సిస్, పోప్‌గా ఎన్నికైన తొలి జెసూట్స్ క్రైస్తవుడు కూడా కావడం ఒక విశేషం. వర్తమాన క్రైస్తవ, క్రైస్తవేతర మత, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక నాయకులలో ఆయన ఒక విలక్షణ వ్యక్తి. పోప్‌గా ఎన్నికైన తరువాత, తాను ఎంతగానో అభిమానించే పర్యావరణం, జంతువుల రక్షక ఋషిగా చిరంజీవి అయిన 13వ శతాబ్ది క్రైస్తవ సాధు పురుషుడు సెయింట్ ఫ్రాన్సిస్ పేరును ఆయన స్వీకరించారు. పేదరికం నిర్మూలనకు, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడం ద్వారా ఆ పేరును సార్థకం చేశారు.

పోప్‌గా నిరాడంబర జీవనం గడిపిన ఫ్రాన్సిస్ ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక అసమానతలు అమానుష స్థాయిలో పెరిగిపోవడాన్ని నిరసించారు. పేదల సంక్షేమం పట్ల ఉదాసీనత ప్రపంచీకరణ కావడాన్ని, సంపన్న దేశాలలో 'ఆధ్యాత్మిక దుర్భిక్షాన్ని' నిక్కచ్చిగా విమర్శించేందుకు ఆయన వెనుకాడేవారు కాదు. అర్జెంటీనాకు వలస వెళ్లిన ఇటాలియన్ వలసకారుల కుటుంబంలో జన్మించిన ఫ్రాన్సిస్ శరణార్థుల, నిరాశ్రయుల, మరీ ముఖ్యంగా వలసజీవుల శ్రేయస్సుకు స్వయంగా చొరవ తీసుకున్నారు. డోనాల్డ్ ట్రంప్ తన మొదటి పదవీ కాలంలో వలసకారులను అడ్డుకునేందుకు అమెరికా–మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మించడాన్ని ఫ్రాన్సిస్ హర్షించలేదు. ఆ చర్య క్రైస్తవ ధర్మానికి విరుద్ధమని స్పష్టం చేశారు. రెండోసారి అమెరికా అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత అక్రమ వలసకారులు అంటూ ట్రంప్ ఎంతో మందిని మానవతా విలువలు పాటించకుండా బలవంతంగా అమెరికా నుంచి పంపించివేయడాన్ని ఫ్రాన్సిస్ ఆమోదించలేదు. ట్రంప్ చర్యను గట్టిగా వ్యతిరేకించాలని అమెరికాలోని బిషప్‌లకు రాసిన లేఖలో ఆయన కోరారు. కేథలిక్ చర్చ్‌ల్లో మహిళలకు పురోహిత బాధ్యతలు అప్పగించేందుకు పూర్వ పోప్‌ల వలే ఫ్రాన్సిస్ కూడా సమ్మతించలేదు. అయితే వాటికన్ ప్రభుత్వ వ్యవస్థలో మహిళలను మున్నెన్నడు లేని విధంగా అత్యున్నత స్థానాలలో ఆయన తొలిసారిగా నియమించారు. అలాగే స్వలింగ సంపర్కాన్ని నిరసించినప్పటికీ అటువంటి వారి మధ్య వివాహాలకు మతపరమైన ఆమోదాన్ని తెలుపాలని పోప్ ఫ్రాన్సిస్ ఆదేశించారు. కెనడాలోని ప్రథమ జాతుల (మూల వాసులు) వారికి క్రైస్తవ మతాధికారుల మూలంగా వాటిల్లిన కష్ట నష్టాలకు పోప్ ఫ్రాన్సిస్ 2022లో క్షమాపణలు చెప్పారు. ఇంకా ఇలా ఉదారవాద దృక్పథంలో పలు నిర్ణయాలు తీసుకోవడం ద్వారా రోమన్ కేథలిక్ క్రైస్తవ మత వ్యవస్థలో గుణాత్మక విప్లవాత్మక మార్పులకు ఆయన దోహదం చేశారు.

ప్రపంచ పర్యావరణ ఉద్యమాన్ని పోప్ ఫ్రాన్సిస్ పలు విధాలుగా ప్రభావితం చేశారు. ధరిత్రిని 'మానవాళి ఉమ్మడి నివాసం'గా ఫ్రాన్సిస్ అభివర్ణించారు. ధరిత్రికి వాటిల్లుతున్న హానిని ప్రపంచ సమాజాలు సమష్టిగా ఎదుర్కోవాలని ఉద్బోధించారు. ఏటా జరిగే కాప్ సదస్సులలో చర్చలను ఆయన ప్రభావితం చేసేవారు. అమెజాన్ అరణ్యాల విధ్వంసాన్ని స్వయంగా చూసిన ఫ్రాన్సిస్ హరిత ధాత్రిని కాపాడుకునే విషయంలో మూలవాసుల అభిప్రాయాలకు విశేష ప్రాధాన్యమిచ్చారు.

మతాల మధ్య సదవగాహనను పెంపొందించడానికి పోప్ ఫ్రాన్సిస్ కృషి చేశారు. ఈ కృషికి పరాకాష్ఠగా 2019లో అబుధాబిలో 'మానవ సౌభ్రాతృత్వం' సదస్సు జరిగింది. ఆ సందర్భంగా అల్ అఝర్ (ఈజిప్ట్) లోని గ్రాండ్ ఇమామ్ అహ్మద్ అల్ తయ్యబ్‌తో కలిసి ఆయన ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఆ సదస్సు సందర్భంగా తనతో సమావేశమైన భారతీయ ప్రతినిధులకు భారత్ ఆధ్యాత్మిక సంస్కృతి పట్ల తనకెంతో గౌరవం ఉందని ఫ్రాన్సిస్ అన్నారు. వ్యక్తిగా, మతవేత్తగా ఆయన నిండు మానవతావాది. సమాజ జీవనంలో మానవత పరిపూర్ణంగా విలసిల్లేందుకు ఆయన అచంచలమైన అంకితభావంతో పాటుపడ్డారు. ఆయన ధర్మ ప్రవచనాలు క్రైస్తవులకే కాక క్రైస్తవేతరులకూ స్ఫూర్తిదాయకమైనవి. రాజకీయ సంబంధిత భావావేశాలతో మత ధర్మాలను తప్పుగా అర్థం చేసుకుంటున్న మన సమాజంలో పోప్ ఫ్రాన్సిస్ విశాల భావాలను పరివ్యాప్తం చేయవలసిన అవసరమున్నది.

'వక్ఫ్'పై వాట్సాప్ వర్సిటీ పరిజ్ఞానం!

మాజీ ఎంపీ, ప్రస్తుత బీజేపీ నాయకులు బూర నర్సయ్య గౌడ్ ఏప్రిల్ 9న ఆంధ్రజ్యోతిలో 'ముస్లిం సంక్షేమానికే వక్ఫ్ సవరణలు' పేరుతో వ్యాసం రాశారు. ఈ వ్యాసంలోని విషయాలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయి. వాట్సాప్ యూనివర్సిటీలో మోదీ భక్తులు చేసే ప్రచారాలతో ప్రభావితమై రాసినట్టు ఉంది.

భారతదేశంలో రక్షణ రంగం, రైల్వేల తర్వాత అత్యధిక ఆస్తులు వక్ఫ్ సంపదే అని రాశారు. ఇది అవాస్తవం. తమిళనాడు, ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఈ నాలుగు రాష్ట్రాలలోనే 14 లక్షల ఎకరాల ఎండోమెంట్ భూములు ఉంటే దేశవ్యాప్తంగా ఎన్ని లక్షల ఎకరాలు ఉండొచ్చు? రాజ్యసభ సభ్యులు కపిల్ సిబల్ ఇదే విషయాన్ని సభలో ప్రస్తావించిన విషయం మనం చూశాం. వాస్తవాలు ఇలా ఉంటే మోదీ అనుకూల మీడియాలో సాగుతున్న తప్పుడు ప్రచారాన్నే నర్సయ్య గౌడ్ కూడా కొనసాగించారు. 2013లో కాంగ్రెస్ ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి సవరణ చేసి సెక్షన్ 40 తీసుకువచ్చిందని, ఈ సెక్షన్ ప్రకారం ఏ భూమినైనా వక్ఫ్ ఆస్తిగా ప్రకటించే అవకాశం ఉందని, ఇలా దేశవ్యాప్తంగా 36 లక్షల ఎకరాల భూమిని వక్ఫ్ ఆస్తిగా ప్రకటించారని బూర నర్సయ్య గౌడ్ అన్నారు. ఏ కోర్టుకు కూడా ఈ చర్యలను సమీక్షించే అవకాశం లేదన్నారు. ఇది కూడా వాట్సాప్ యూనివర్సిటీ చేసే అబద్ధ ప్రచారమే. ప్రస్తుతం దేశంలోని వక్ఫ్ బోర్డుల పరిధిలో 9 లక్షల ఎకరాల భూమి ఉందని కేంద్ర ప్రభుత్వం బిల్లుపై చర్చలో ప్రకటించింది. మరి ఈ 36 లక్షల ఎకరాల భూమి ఎక్కడి నుండి వచ్చింది?



ఒక్క ముస్లిం వ్యక్తికి కూడా అసెంబ్లీ, పార్లమెంటు టికెట్ ఇవ్వని, ప్రతీ అంశంలో హిందూ–ముస్లిం విభజన తేవడానికి ప్రయత్నించే పార్టీ బీజేపీ. ఈ వక్ఫ్ సవరణలతో ముస్లింలలోని వెనుకబడిన వర్గాలకు న్యాయం చేస్తామని ఆ పార్టీ ప్రకటించినంత మాత్రాన ముస్లింలు ఎలా నమ్ముతారో బూర నర్సయ్య గౌడ్ చెప్పాలి.

ఇక వక్ఫ్ చట్టం 1995 సెక్షన్ 40 గురించి వాస్తవం చూద్దాం. ఈ సెక్షన్ ప్రకారం ఏదేని ఆస్తి వక్ఫ్‌దా కాదా? అన్న వివాదం వచ్చినప్పుడు విచారణ జరిపి నిర్ణయం తీసుకునే అధికారం వక్ఫ్ బోర్డుకు ఉంటుంది. బోర్డు నిర్ణయంపై ఎవరికైనా అభ్యంతరం ఉంటే వక్ఫ్ ట్రిబ్యునల్‌ని ఆశ్రయించవచ్చు. ట్రిబ్యునల్ తీర్పుపై కూడా అభ్యంతరం ఉంటే హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించవచ్చు. అంటే, ఏదైనా ఆస్తిని వక్ఫ్ బోర్డు తనదని క్లెయిమ్ చేసుకుంటే, దానిని న్యాయస్థానాలలో సవాలు చేయవచ్చు. కానీ ఆ అవకాశం లేదంటూ తీవ్ర దుష్ప్రచారం చేసి ప్రస్తుత సవరణ చట్టంలో సెక్షన్ 40ని తొలగించారు. వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టకముందే, తనదైన శైలిలో బీజేపీ వాట్సాప్ యూనివర్సిటీ ద్వారా వక్ఫ్ ఆస్తులపై, వక్ఫ్ బోర్డులపై తీవ్రమైన దుష్ప్రచారం చేసింది. జనబాహుళ్యంలో వక్ఫ్ బోర్డు అంటే ఒక భూ మాఫియా సంస్థగా, హిందువుల ఆస్తులను, దేశ ఆస్తులను కబళించే ఒక సంస్థగా చిత్రీకరించింది.

నూతన సవరణ చట్టం ప్రకారం వక్ఫ్ బోర్డులో ముస్లింలలోని షియా, ఆఘఖాని, బోరా, ఇస్మాయిలి వర్గాలకు ప్రాతినిధ్యం లభిస్తుందని నర్సయ్య గౌడ్ అన్నారు. కానీ వాస్తవం ఏంటంటే ప్రస్తుతం ఉన్న వక్ఫ్ బోర్డులను విభజించి 'ఆగాఖాని వక్ఫ్ బోర్డు', 'బోహరా'ల కొరకు ప్రత్యేక వక్ఫ్ బోర్డులను ఏర్పాటు చేయడం అన్నది ముస్లిం సమాజంలో చీలిక తేవడానికి ఉద్దేశించినది. ఇది 'విభజించి పాలించు' సూత్రానికి పరాకాష్ఠ. 1995 వక్ఫ్ చట్టం 14 ప్రకారం ప్రభుత్వం ఒక సున్నీ, ఒక షియా, ఒక ముస్లిం మహిళను రాష్ట్ర వక్ఫ్ బోర్డుకు నామినేట్ చేస్తుంది. నూతన సవరణలతో కేంద్ర ప్రభుత్వం కొత్తగా ముస్లింలలోని వర్గాలకు చేసే న్యాయం ఏమిటో నర్సయ్య గౌడ్‌కే తెలియాలి.

ఒక్క ముస్లిం వ్యక్తికి కూడా అసెంబ్లీకి గాని, పార్లమెంటుకు గాని టికెట్ ఇవ్వని, ప్రతీ అంశంలో హిందూ ముస్లింల మధ్య విభజన తేవడానికి ప్రయత్నించే బీజేపీ.. ఈ వక్ఫ్ సవరణలతో ముస్లింలలోని వెనుకబడిన వర్గాలకు న్యాయం చేస్తామని ప్రకటించినంత మాత్రాన ముస్లింలు ఎలా నమ్ముతారో నర్సయ్య గౌడ్ చెప్పాలి. వెనుకబడిన ముస్లింలకు బోర్డులో ప్రాతినిధ్యం లభించడం ఏమో కానీ, ప్రస్తుత సవరణతో ఇద్దరు ముస్లిమేతరులను ప్రభుత్వం వక్ఫ్ బోర్డుకి నామినేట్ చేస్తోంది. ముస్లిం ధార్మిక సంస్థలో ఇతర మతస్థుల ప్రవేశం దేనిని సూచిస్తుంది? హిందూ ఎండోమెంట్ సంస్థలలో ముస్లింలకు ఇలా అవకాశం కల్పిస్తారా? హిందూ దేవాలయాల్లో స్వీపర్ పోస్టులో కూడా అన్యమతస్థులు ఉండకూడదని వాదించే బీజేపీకి చెందిన దీనికి బూర నర్సయ్య దీనిని ఎలా సమర్థించుకుంటారు? ప్రస్తుతం 75శాతం వక్ఫ్ భూములు కబ్జా అయ్యాయని, సవరణ చట్టంతో ఈ కబ్జాలను అరికడతామని ఆయన అన్నారు. కానీ ప్రస్తుత సవరణ చట్టం ద్వారా 1995 వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 107, 108, 108Aలు తొలగించడం వలన వక్ఫ్ ఆస్తుల ఆక్రమణదారులు లిమిటేషన్ యాక్ట్ 1963 ప్రకారం తమ కబ్జాలను శాశ్వతపరచుకొని, తద్వారా వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కావడానికి పూర్తి అవకాశం కలుగుతుంది. సెక్షన్ 108Bను సవరించి వక్ఫ్ రూల్స్ తయారు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాల నుండి కేంద్రం గుంజుకోవడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధం. నూతన చట్టంతో వక్ఫ్ ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచి, పేద ముస్లింల సంక్షేమానికి మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందని బూర నర్సయ్య అంటున్నారు. అదే నిజమైతే వక్ఫ్ బోర్డుకు వచ్చే కమర్షియల్ లీజ్ రెంటును 7 శాతం నుండి 5 శాతానికి ఎందుకు తగ్గించారు?

కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో వచ్చిన సచార్ కమిటీ తన నివేదికలో పేర్కొన్న వక్ఫ్ నిర్వహణకు సంబంధించిన విషయాలను కేంద్ర మైనారిటీ శాఖ మంత్రితో పాటు నర్సయ్యగౌడ్ వంటి నేతలు పదేపదే ప్రస్తావిస్తున్నారు. మరి, గత పదకొండేళ్ల మోదీ పాలనలో ఒక్కసారైనా సచార్ కమిటీ నివేదికను పరిశీలించారా, ఒక్క సూచననైనా అమలు చేశారా, కబ్జాకు గురైన ఒక్క ఎకరం వక్ఫ్ భూమినైనా స్వాధీనం చేసుకొని వక్ఫ్ బోర్డుకి అప్పగించారా? మచ్చుకైనా లేదు. మరి సచార్ కమిటీ గురించి వల్లె వేయడం రాజకీయాలలో భాగం కాదా?

'పేద ముస్లింల సంక్షేమం' అన్న అందమైన ముసుగు తొడిగిన ఈ నూతన సవరణ చట్టం వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో ముస్లింల పాత్రను తగ్గిస్తుంది. ముస్లిమేతరులు ముఖ్యంగా ప్రభుత్వ తాబేదార్ల ప్రమేయాన్ని పెంచి, లక్షల ఎకరాల వక్ఫ్ భూములను బడా వ్యాపారవేత్తలకు కట్టబెట్టడానికి మార్గం సుగమం చేశారు. దేశహితాన్ని, మత ఐక్యతను కోరేవారు ఎవరూ కూడా ఈ చట్టంలోని ఏ ఒక్క సవరణనూ అంగీకరించడం లేదు.

• సలీమ్ పాష
కన్వీనర్, తెలంగాణ ముస్లిం ఆర్గనైజేషన్స్ జేఏసీ

ఆవిష్కరణల్లో వెనకబడితే భవిష్యత్తులో చోటుండదు!

కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ ఇటీవల అన్న ఒక మాట పలు విమర్శలకు దారితీయటమే గాక, చర్చలకూ తావిచ్చింది. "ఇవాళ భారతదేశంలో గొప్ప స్టార్టప్‌లు ఏమున్నాయి? మన శ్రద్ధ అంతా ఫుడ్ డెలివరీ యాప్స్‌కే పరిమితం! నిరుద్యోగులను చవకగా దొరికే కూలీల్లా తయారు చేసి, వాళ్ళచేత ధనవంతులకు ఇంటిపట్టునే భోజనం అందేలా చేస్తున్నామంతే!"

కేంద్రమంత్రి మాటలు వినటానికి కటువుగా ఉండొచ్చు. కానీ అవి మన దేశ స్టార్టప్ వ్యవస్థలో ఉన్న అతి పెద్ద లోపాన్ని ఎత్తిచూపుతున్నాయి. అది– భవిష్యత్తుకు అవసరమైన సాంకేతిక ఆవిష్కరణల కొరత. దేశంలో ఒకపక్క సౌకర్యాల్ని పెంచే స్టార్టప్‌లు పెరుగుతుంటే, మరోపక్క నూతన ఆవిష్కరణల దిశగా ప్రయత్నాలు తగ్గుతున్నాయి. స్టార్టప్ కంపెనీల విషయంలో మన దేశం అమెరికా, చైనాల తర్వాత ప్రపంచంలో మూడో స్థానంలో ఉంది. కానీ, ఈ స్టార్టప్ కంపెనీలు చాలావరకు వినియోగదారుడికి సౌకర్యాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయే తప్ప, గొప్ప మార్పు తేగల సాంకేతిక ఆవిష్కరణల దిశగా దృష్టి పెట్టడం లేదు.

దీనికి ముఖ్య కారణం భారత ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా వినియోగం మీద ఆధారపడి నడవటమే. దీనివల్ల పారిశ్రామికవేత్తలందరూ ఎక్కువ స్థాయిలో వినిమయం జరిగే రంగాల వైపే ఆసక్తి చూపుతున్నారు. ఈ–కామర్స్, ఆహారమూ కిరాణా వస్తువుల డెలివరీ, చిరుతిళ్ళ ఉత్పత్తి.. తదితర రంగాలన్నీ ఇందులో భాగమే. ఈ రంగాల్లో పెట్టిన పెట్టుబడికి వెంటనే లాభాలు వస్తాయి కాబట్టి పారిశ్రామికవేత్తలు ఉత్సాహం చూపిస్తున్నారు. కానీ డీప్‌టెక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బయోటెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీ.. మొదలైన ఆవిష్కరణలు అవసరమైన రంగాల్లో పెట్టే ప్రయత్నం సాకారం కావటానికి ఎక్కువ సమయం పడుతుంది కాబట్టి పారిశ్రామికవేత్తలు అంతగా అటువైపు వెళ్ళటం లేదు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వం అనేక విధానాలను ప్రకటిస్తున్నది. కానీ అసలైన సవాలు విధానాల రూపకల్పన కాదు, వాటి అమలు.

ఆవిష్కరణల కేంద్రంగా కొనసాగే ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అనేక ముఖ్యమైన చర్యలు తీసుకున్నది. వీటిలో కొన్ని– నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎన్ఆర్ఎఫ్) స్థాపన, నేషనల్ ఏఐ మిషన్ ప్రారంభం, డీప్‌టెక్ స్టార్టప్‌లను (లోతైన సాంకేతిక ఆవిష్కరణలు అవసరమైన స్టార్టప్‌లను) ప్రోత్సహించేందుకు రూ.10వేల కోట్లతో 'ఫండ్ ఆఫ్ ఫండ్స్' ఏర్పాటు.. మొదలైనవి. అయితే విధాన ప్రకటనలకూ, వాటి అమలుకూ మధ్య పొంతన లేకపోవడమే అసలు సమస్య.



కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రస్తావించిన సాంకేతిక రంగంలోని ఆవిష్కరణల కొరతను తీర్చాలంటే ప్రభుత్వం చేస్తున్న విధాన ప్రకటనలు అర్థవంతంగా అమలయ్యేట్టు చూడాలి. అప్పుడే మన దేశం పెట్టుబడి ఆధారంగా నడిచే ఆర్థిక వ్యవస్థ నుంచి ఆవిష్కరణల ఆధారంగా నడిచే ఆర్థిక వ్యవస్థగా మారగలదు.

ఉదాహరణకు 2016లో భారత చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు ఆధ్వర్యంలో మొదలైన 'ఫండ్ ఆఫ్ ఫండ్స్' (ఎఫ్ఎఫ్ఎస్) విషయమే తీసుకుందాం. రూ.9,121కోట్లు ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఫండ్స్‌కు ఇస్తామని చెప్పి, ఏప్రిల్ 2023 నాటికి అందులో కేవలం రూ.3,931కోట్లు (43శాతం) మాత్రమే చెల్లించారు. 2018లో యుటిలైజేషన్ రేట్లు మరింతగా తగ్గటంతో ఇస్తామన్న రూ.920కోట్లలో కేవలం రూ.168 కోట్లు (18శాతం) మాత్రమే చెల్లించారు.

ఇదేవిధంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు మద్దతుగా 2020లో రూ.50వేల కోట్ల 'సెల్ఫ్ రిలయంట్ ఇండియా' (ఎస్ఆర్ఐ) ఫండ్‌ను ప్రకటించారు. కానీ దేశంలో నమోదైన దాదాపు 5.93 కోట్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో కేవలం 577 పరిశ్రమలు మాత్రమే దీని ద్వారా లబ్ధి పొందాయి. దీన్ని బట్టి లోపం ఎక్కడ ఉన్నదో స్పష్టంగానే తెలుస్తున్నది. సదుద్దేశ్యాలతో నిధుల కేటాయింపు జరుగుతున్నది. కానీ అమలులో వైఫల్యం వల్ల క్షేత్రస్థాయిలో వాటి ప్రభావం అంతంతమాత్రం.

ఇలాంటి సవాళ్ళే మన దేశంలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ రంగాన్నీ వెంటాడుతున్నాయి. 2021–22 కేంద్ర బడ్జెట్‌లో నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు ఐదేళ్ళ కాలానికి రూ.50వేల కోట్లు కేటాయించారు. కానీ 2024–25 నాటికి ఈ కేటాయింపును కేవలం రూ.200కోట్లకు కుదించారు. మరోపక్క రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ రంగంపై 2009–10 సంవత్సరంలో చేసిన మొత్తం వ్యయం జీడీపీలో 0.82శాతం కాగా అది 2020–21 నాటికి 0.64శాతానికి క్షీణించింది. దీనికి భిన్నంగా, చైనా తన జీడీపీలో 2.24శాతాన్ని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు కేటాయిస్తుండగా, జర్మనీ, అమెరికా దేశాలు తమ జీడీపీలో 3శాతానికి పైగా ఇందుకు కేటాయిస్తున్నాయి.

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రస్తావించిన సాంకేతిక రంగంలోని ఆవిష్కరణల కొరతను తీర్చాలంటే ప్రభుత్వం చేస్తున్న విధాన ప్రకటనలు అర్థవంతంగా అమలయ్యేట్టు చూడాలి. అప్పుడే మన దేశం పెట్టుబడి ఆధారంగా నడిచే ఆర్థిక వ్యవస్థ నుంచి ఆవిష్కరణల ఆధారంగా నడిచే ఆర్థిక వ్యవస్థగా మారగలదు.

మొదటగా– మన దేశం దీర్ఘకాలిక దృష్టిగల పెట్టుబడులను పెంచుకోవాలి. త్వరిత లాభాలను ఆశించని, ప్రయోగాలను తట్టుకునే ఇలాంటి పెట్టుబడి డీప్‌టెక్ స్టార్టప్‌లకు ఎంతో అవసరం. మన దేశపు అంతర్గత ఆస్తులు మొత్తం 11.1 ట్రిలియన్ డాలర్లని అంచనా. ఇందులో 65శాతం భౌతిక ఆస్తులుగా ఉన్నాయి. అంటే మన దగ్గర భారీ పెట్టుబడులు ఉన్నాయి గానీ వాటిని కొత్త సాంకేతికతల ఆవిష్కరణకు వినియోగించే ప్రయత్నాలు గానీ, ఆ దిశగా రిస్క్ చేసే తత్త్వం గానీ ఇక్కడ చాలా తక్కువ. అందుకే, స్థానికంగా పనిచేసే స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల స్థాపన, దీర్ఘకాలిక ఆర్థిక సాధనాలను అమల్లోకి తేవడం, ఏర్పాటు దశలోనే ఎక్కువ కాలం తీసుకునే రంగాలకు పెట్టుబడుల మరలింపును ప్రోత్సహించడం... ఇలాంటి చర్యలు మన దేశంలో ఆవిష్కరణల కొరతను తీర్చగలవు.



రెండోది– డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం కేటాయించిన రూ.10వేల కోట్ల నిధి విషయంలో దరఖాస్తు పద్ధతిని సరళీకరించడం, నిధుల కేటాయింపులో పారదర్శకత, ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్‌కూ స్టార్టప్‌లకూ మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం చాలా ముఖ్యం.

మూడోది– డీప్‌టెక్ ఆవిష్కరణలలో ప్రైవేటు పెట్టుబడులను పెంచేందుకు పన్ను తగ్గింపు కీలకం. 2024లో చైనా ప్రభుత్వం అక్కడి సాంకేతిక సంస్థలపై 361 బిలియన్ డాలర్ల మేరకు పన్నుల, ఫీజుల తగ్గింపును ప్రకటించింది. ఇందులో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌కు 80.7 బిలియన్ డాలర్ల కేటాయింపు కూడా ఉంది. మరోపక్క, మన దేశం 2025–26 బడ్జెట్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌లో ప్రైవేటు పెట్టుబడుల ప్రోత్సాహం కోసం కేవలం రూ.20వేల కోట్లను కేటాయించింది. చైనా కేటాయింపుల్లో ఇది ఐదు శాతం కూడా కాదు.

మన దేశ స్టార్టప్ రంగంలో వినియోగదారుల సౌకర్యాన్ని పెంచే ప్రయత్నాలే ఎక్కువ భాగాన్ని ఆక్రమిస్తున్నాయి. వీటి ప్రాముఖ్యాన్ని కాదనలేం. కానీ సాంకేతిక రంగంలో ఇవి మాత్రమే మనల్ని అగ్రస్థానంలో నిలబెట్టలేవు. పైన ప్రస్తావించిన కొన్ని పరిష్కార మార్గాలను అనుసరిస్తే మన స్టార్టప్ వాతావరణం మారుతుంది. ఆవిష్కరణల కొరత తీరుతుంది. కాబట్టి కేంద్రమంత్రి వ్యాఖ్యలు కాస్త కటువుగానే ధ్వనించినా, అవి మరీ అంత సత్యదూరం కావని మనం గుర్తించాలి.

మారుతున్న ప్రపంచ రాజకీయ ఆర్థిక పరిణామాలు కొత్త ద్వారాలను తెరుస్తున్నాయి. ప్రపంచం మొత్తం ఆవిష్కరణలకు కొత్త కేంద్రాల కోసం వెతుకుతున్నది. మన దగ్గర ప్రతిభ ఉంది, మార్కెట్ ఉంది, పెట్టుబడులు ఉన్నాయి. ఇప్పుడు కావాల్సిందల్లా ప్రకటనలను అమలు చేయగల చిత్తశుద్ధి.

నేషనల్ డీప్‌టెక్ స్టార్టప్ పాలసీ ముసాయిదాను ఆమోదించి అమలు చేయటం ఈ దిశగా వేయాల్సిన మొదటి అడుగు. ఈ పాలసీకి సమర్థవంతమైన అమలు ప్రక్రియను కూడా జోడిస్తే మన దేశం నిరుద్యోగులను చవకగా దొరికే కూలీల్లా వాడుకునే దేశంగా మిగిలిపోదు. భవిష్యత్తుకు అవసరమైన సాంకేతికతలను సరఫరా చేసే యువత గల దేశంగా తయారవుతుంది

▪ లావు శ్రీకృష్ణదేవరాయలు
నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు

శ్రామిక వర్గ కోణంలో 'సుంకాల యుద్ధం'

కొన్ని వారాలుగా, వార్తల్లో వినవస్తున్న మాటలు: 'సుంకాలు!', 'ప్రతీకార సుంకాలు!', 'సుంకాల యుద్ధం!'

'సుంకాలు' అంటే, తేలిక మాటల్లో, చెప్పాలంటే, ప్రభుత్వాలకు చెల్లించవలిసిన 'పన్నులే!' ఒక దేశం తన సరుకుల్ని ఇంకో దేశానికి ఎగుమతి చేస్తే, దానికోసం తన ప్రభుత్వానికి కొంత పన్ను కట్టాలి. అది ఎగుమతి సుంకం. ఆ సరుకుల్ని దిగుమతి చేసుకున్న వేరే దేశపు వ్యాపారి కూడా తన ప్రభుత్వానికి కొంత పన్ను కట్టాలి. అది దిగుమతి సుంకం. ఆ ఎగుమతి సుంకమూ, ఈ దిగుమతి సుంకమూ రెండూ కూడా, పెట్టుబడిదారీ విధానంలో, సరుకు ధరలో భాగాలే!

ఇప్పుడు 'సుంకాల యుద్ధం' అనే మాట ఎందుకు మొదలైందంటే, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇతర దేశాల నించీ అమెరికాకు వచ్చే సరుకుల మీద ఇప్పటికే వున్న దిగుమతి సుంకాల్ని బాగా పెంచేశాడు– అని! దానికి అతను చెప్పే కారణాలు ఏమిటంటే, 'ఇన్నాళ్ళూ ఇతర దేశాలు అమెరికా నించీ దిగుమతి చేసుకున్న సరుకుల మీద భారీ సుంకాలు విధిస్తున్నాయి. అమెరికా మాత్రం ఇన్నాళ్ళూ విదేశాల నించీ వచ్చే సరుకుల దిగుమతుల మీద భారీ సుంకాలు వెయ్యలేదు. దాని వల్ల, అమెరికాకు చాలా ఆదాయం రాకుండా పోతున్నది. పైగా ఆ ఇతర దేశాల సరుకుల దిగుమతి వల్ల, జనాలు దిగుమతుల మీదే ఆధారపడతారు. అమెరికాలో పరిశ్రమల అభివృద్ధి జరగదు. అమెరికా నించీ ఎగుమతులు తక్కువై, దిగుమతులు ఎక్కువైతే అమెరికాకు నష్టం కదా!' ఇవీ ట్రంపు మాటలు! ఈ రకపు వాదనల్ని, పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రం భాషలో, 'రక్షణ వాదం' అనీ, 'రక్షణ సుంకాలు' అనీ అంటారు. స్వదేశంలోనే పరిశ్రమల్ని అభివృద్ధిపరిచి, దేశ ప్రజలకి ఆ పరిశ్రమల్లోనే ఉద్యోగాలు కల్పిస్తానని, ట్రంప్ చెప్పే మాటలు మంచివిగానే కనపడతాయి. కానీ, ఈ 'మంచి' అనేక ఇతర విషయాల్ని బట్టి వుంటుంది.

నిజానికి పెట్టుబడిదారీ ఆర్థిక విధానానికి స్వతహాగా వున్న లక్షణం ఏమిటంటే, ఒక దేశంలో తయారయ్యే సరుకులు ఆ దేశ సరిహద్దులు దాటి, ప్రపంచమంతటా, ఎటువంటి నిబంధనలూ, అడ్డంకులూ లేకుండా అమ్మకాలు జరగాలి– అని! దీన్నే 'స్వేచ్ఛా వ్యాపారం' అంటారు. ఇందులో, సుంకాల సమస్య ఘర్షణగా వుండదు. ఏ ఖర్చు ఎంత అవసరం అయితే, అంతకు మించి చేరదు. కానీ, పెట్టుబడిదారీ విధానానికి పుట్టుకతో వున్న అసలు జబ్బు 'పోటీ'. ఈ పోటీలో నెగ్గుకు రావడానికి, కొన్ని దేశాలలోని పెట్టుబడిదారులు వేసే ఒక ఎత్తుగడ ఈ 'రక్షణ సుంకాలు'. ఇప్పుడు ట్రంప్ ప్రారంభించిన ఈ సుంకాల యుద్ధం కూడా అలాంటి ఎత్తుగడే!

ఇప్పుడు, పత్రికల్లోనూ, టీవీల్లోనూ చర్చలన్నీ ట్రంప్ ప్రకటించిన దిగుమతి సుంకాల పెంపుల గురించే! దిగుమతి సుంకాలు ఎక్కువైతే, ధర పెరిగి, మిగిలే లాభం తక్కువ. సుంకాలు తక్కువ అయితే, ధర తగ్గి, మిగిలే లాభం ఎక్కువ! ట్రంపు పెంచిన సుంకాలు వేరు వేరు దేశాల మీద వేరు వేరు శాతాలుగా వున్నాయి గదా? వీటి వల్ల భారతదేశానికి ఎంత నష్టం, ఎంత లాభం? భారతదేశం కంటే, చైనా వంటి ఇతర దేశాల మీద ఎక్కువ సుంకాలు వెయ్యడం వల్ల, ఆ దేశాల్లో పరిశ్రమలు పెట్టిన పెట్టుబడిదారులు, ఆ పరిశ్రమల్ని అక్కణ్ణించీ తక్కువ సుంకాలు గల భారతదేశానికి తరలించే అవకాశాలు ఏ రంగంలో ఎక్కువ వుంటాయి? – ఇలాంటి చర్చలే జరుగుతున్నాయి. ఈ సుంకాల యుద్ధం అంతా అసలు వేరు వేరు దేశాల పెట్టుబడిదారుల మధ్య లాభాల పెంపుల కోసం జరుగుతున్న పోటీ మాత్రమేననే సంగతిని పత్రికల్లోనూ, టీవీల్లోనూ, మేధావులు ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతున్నారు.

పెట్టుబడిదారీ విధానానికి పుట్టుకతో వున్న అసలు జబ్బు 'పోటీ'. ఈ పోటీలో నెగ్గుకురావడానికి, కొన్ని దేశాలలోని పెట్టుబడిదారులు వేసే ఒక ఎత్తుగడ ఈ 'రక్షణ సుంకాలు'. ఇప్పుడు ట్రంప్ ప్రారంభించిన ఈ సుంకాల యుద్ధం కూడా అలాంటి ఎత్తుగడే! ఈ సుంకాల యుద్ధం అంతా అసలు వేరు వేరు దేశాల పెట్టుబడిదారుల మధ్య లాభాల పెంపు కోసం జరుగుతున్న పోటీ మాత్రమేననే సంగతిని పత్రికల్లోనూ, టీవీల్లోనూ, మేధావులు ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతున్నారు.



మార్క్స్, ఎప్పుడో, 1847లో రాసిన, 'రక్షణ సుంకాలూ, స్వేచ్ఛా వ్యాపారమూ, కార్మికవర్గమూ' అనే వ్యాసంలో ఈ విషయాన్నే గ్రహించి చెప్పాడు, ఇలా: "రక్షణాత్మక సుంకాల వ్యవస్థ ఒక దేశంలో వున్న పెట్టుబడి చేతుల్లో, ఇతర దేశాల పెట్టుబడిని ప్రతిఘటించే, ఆయుధాలను ('వెపన్స్') పెడుతుంది; ఇది విదేశీ పెట్టుబడికి వ్యతిరేకంగా స్వదేశ పెట్టుబడి శక్తిని పెంచుతుంది." అయితే, రక్షణ సుంకాల సమర్థకుల వాదన ఎలా వుంటుందని మార్క్స్ చెబుతాడంటే, 'విదేశీయుల సరుకులు కొనడం ద్వారా, వాళ్ళ చేతుల్లో దోపిడీకి గురి అవడం కంటే, స్వదేశస్థుల ('ఫెలో –కంట్రీమెన్') చేతుల్లో దోపిడీకి గురిఅవడం మేలు ('బెటర్')'– అని కార్మికులకు చెపుతారట, ఆ సమర్థకులు!

సుంకాల యుద్ధాలు వేరు వేరు దేశాల శ్రామిక ప్రజల్లో అక్కడి ప్రభుత్వాల పట్ల కొన్ని రాజకీయ భ్రమల్ని కూడా కలిగిస్తాయి. ఎలాగంటే, దిగుమతి సుంకాల్ని పెంచిన దేశాల్లో జనాలు ఇలా అనుకుంటారు: "మన ప్రభుత్వం, విదేశీ సరుకుల మీద ఎక్కువ సుంకాలు వెయ్యడమే మంచిది. దానివల్ల ఆ సరుకులకు ధరలు పెరిగి, వాటిని జనం కొనరు. క్రమంగా, దిగుమతులు తగ్గిపోతాయి. దానివల్ల, మన దేశంలోనే సరుకులు తయారై, మన పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయి. అంటే, మన నిరుద్యోగులకి ఎన్నో ఉద్యోగాలు వస్తాయి. కాబట్టి, మనం మన ప్రభుత్వ విధానాల్ని సమర్థించాలి" అనే అర్థాలకు వస్తారు. ఇతర దేశాలకు సరుకుల్ని ఎగుమతి చేసే దేశాలలోని కార్మికులేమో, "మన దేశం నించీ అక్కడికి వెళ్ళే సరుకులమీద దిగుమతి చేసుకునే ఆ దేశాలు భారీ సుంకాలు వేస్తే, అక్కడ మన సరుకులు కొనేవాళ్ళు తగ్గిపోతారు. అలా జరిగితే, ఇక్కడి పరిశ్రమల యజమానులు, తమ సరుకుల ఎగుమతులు ఎక్కువగా జరగవు గనక ఉత్పత్తులు తగ్గిస్తారు. అప్పుడు, మనలో చాలా మందికి ఉద్యోగాలు పోతాయి. కాబట్టి, మన ఎగుమతుల మీద అక్కడ దిగుమతి సుంకాలు ఎక్కువగా పడకుండా ప్రయత్నించే మన ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలి" అనుకుంటారు.

రక్షణ సుంకాల విధానంవల్ల, ప్రపంచ దేశాలలోని కార్మికులందరూ దేశాల వారీగా విడిపోయి వేరు వేరుగా ఆలోచిస్తారు. వారిలో ఐక్యతకు ఇది పెద్ద అడ్డు. సుంకాల నిజాల్ని అర్థమే చేసుకోరు.

విదేశీ వర్తకంలో రక్షణ సుంకాలకు భిన్నమైన వాదన కూడా ఒకటి వుంది. అదే, స్వేచ్ఛా వ్యాపారం! అంటే, 'వర్తకం అనేది, ఎటువంటి నిబంధనలూ లేకుండా, సుంకాల పెంపులు లేకుండా, దేశాల సరిహద్దులు దాటి స్వేచ్ఛగా జరగాలి' అన్నదే ఈ వాదన సారాంశం. శ్రామిక జనాల దృష్టితో చూస్తే, రక్షణ సుంకాల విధానాన్ని సమర్థించాలా, స్వేచ్ఛా వ్యాపారాన్ని సమర్థించాలా అన్న ప్రశ్న వచ్చినప్పుడు, రెంటినీ వ్యతిరేకించాలంటాడు ఎంగెల్సు. కాకపోతే, రెంటినీ పోల్చినప్పుడు, స్వేచ్ఛా వ్యాపార విధానం అనేది, 'జాతుల మధ్యా, దేశాల మధ్యా వున్న అడ్డంకుల్ని ('బారియర్స్'ని) బద్దలుకొట్టి, ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక వర్గానికీ– పెట్టుబడిదారీ వర్గానికీ మధ్య వున్న వైరుధ్యాన్ని మరింతగా తీవ్రతరం ('పుషెస్ టు యాన్ ఎక్స్‌ట్రీమ్ పాయింట్') చేస్తుందనీ, ఆ రకంగా అది సామాజిక విప్లవాన్ని ఒక రకంగా త్వరితం చేసే అవకాశం వుంటుందనీ మార్క్సు అంటాడు. అంటే, వేరే మాటల్లో చెప్పాలంటే, అన్ని దేశాల పెట్టుబడులూ, అన్ని దేశాల కార్మికులనూ దోస్తున్నాయి అనే వర్గ చైతన్యం తీసుకురావడానికి అవకాశం వుంటుంది అని!

అసలు గ్రహించవలిసిన విషయం ఏమిటంటే, స్వదేశీ వర్తకమైనా, విదేశీ వర్తకమైనా, వర్తకుడికి వచ్చేది సరుకు ధరలో నించి 'కమిషను'! ఆ కమిషను, ఆ వర్తకం ఏ సరుకుతో జరుగుతుందో ఆ సరుకులో వుండే కార్మికుల 'అదనపు విలువ'లో భాగమే తప్ప ఇంకెక్కడినించో రాదు. అంటే, శ్రమ దోపిడీ నించీ అన్నమాట! స్వదేశీ సరుకుల ద్వారా సంపాదించే కమిషను, స్వదేశీ కార్మికుల అదనపు విలువ అయితే, విదేశీ సరుకుల ద్వారా సంపాదించే కమిషను, విదేశీ కార్మికుల అదనపు విలువ. 'వర్తకం' అనేది– స్వదేశీ వర్తకమైనా, విదేశీ వర్తకమైనా; మొత్తం అన్ని దేశాల వర్తకాల్నీ కలిపి చూస్తే, 'ప్రపంచ వర్తక లాభాలన్నీ', ప్రపంచ కార్మికుల అదనపు విలువలలో భాగమే. అందుకే, 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి!' అనే నినాదం పుట్టింది!



ఏ సమస్యని అయినా, పెట్టుబడిదారీ కోణంలో కాదు, శ్రామికవర్గ కోణంలో చూస్తేనే, అసలు నిజం కనపడుతుంది!

కానీ, మన మేధావులు ఇంకా మేల్కొనడం లేదు!

▪ రంగనాయకమ్మ



చూసావా

చూసావా
చిగురుటాకులా వణుకుతున్న
జనజీవన దృశ్యం
అమాయకప్రాణాలే
కుంచెలై గీసిన రక్తవర్ణచిత్రం
నాగరిక సమాజానికి
తగిలిన పెనుగాయం
గణతంత్ర వ్యవస్థ పాడిన
మహా విషాద గేయం

చూసావా
సర్వోన్నత జాతికి హేయం
స్వేచ్ఛగా యథేచ్ఛగా
గుండాలు గుడ్డురిమిన
హింసాకాండ నిర్వహణలో
నేరజ్వాల రగిల్చిన
భయానక మృత్యురవళి

చూసావా
ఎడతెగని హింస
క్షతగాత్రమైన శాంతిహంస
కుల మత వర్గ వర్ణ తెగ కాంక్ష
విశ్వశ్రేయాన్ని బలిపెడితే
కుత్తుకలు తెగిపడి రక్తాలు ధారకట్టి
అశాంతి చెలరేగితే
కంటక రహదారికి దారి చూపేది
లౌకిక భువన భవన
నిర్మాణానికి రాళ్లెత్తేకూలీలు
విశాల భారత నందన వనమాలీలు

— కోటం చంద్రశేఖర్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి,
ప్లాట్–76, అశ్వినీ లే ఔట్,
హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్:
editpage@andhrajyothy.com

ఆ నాలుగు సంస్థలకు కట్టబెట్టేందుకే..!

ఇసుక టెండర్ల వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. కృష్ణాజిల్లాలోని పామర్రు, పెనమలూరు మండలాల పరిధిలోని చోడవరం, రొయ్యూరు, నార్త్ వల్లూరు, లంకపల్లి ఇసుక క్వారీలకు పిలిచిన టెండర్లను సిండికేట్ రింగ్ బాగోతం బయటపడటంతో ముఖ్యనేత ఆదేశాలతో కృష్ణాజిల్లా యంత్రాంగం రద్దు చేసింది. మళ్లీ టెండరు నోటిఫికేషన్‌ను వెలువరించింది. ముందుగానే ఫిక్స్ చేసుకున్న కాంట్రాక్టు సంస్థలకే టెండర్లు దక్కేలా నిబంధనలను సవరించింది. జిల్లా మైనింగ్ డీడీ వ్యవహారం తీవ్ర ఆరోపణలకు దారి తీస్తోంది.

- (ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఇసుక టెండర్లు రద్దు.. రీ నోటిఫికేషన్

ఏ జిల్లాలోనూ లేని నిబంధన అమలు



ఆ నాలుగు కాంట్రాక్టు సంస్థలతో డీల్!

ఇసుక క్వారీలను దక్కించుకునేందుకు వచ్చిన రాష్ట్రేతర నాలుగు కాంట్రాక్టు సంస్థలతో రూ. కోట్లలో డీల్‌ను కుదుర్చుకున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. వాటికి తప్ప మిగిలిన ఏ సంస్థకు కూడా టెండరు దక్కకుండా ఉండాలన్న ఉద్దేశ్యంతో కొత్తగా పిలిచిన టెండరు నోటిఫికేషన్‌లో మార్పులు చేశారు. ఆ నాలుగు కంపెనీల జీఎస్టీలను కృష్ణాజిల్లా మైనింగ్ అధికారులు వ్యక్తిగతంగా తెప్పించుకుని మరీ పరిశీలించినట్లు తెలిసింది. ఆ జీఎస్టీలన్నీ కూడా స్థానికంగా బ్రాంచ్‌లు కలిగినట్టుగా ఎప్పటి నుంచి ఉన్నాయో నిర్ధారించుకున్నట్లు సమాచారం. మార్చి 25వ తేదీ నాటికి అవి జీఎస్టీ లోకల్ బ్రాంచ్‌లుగా రిజిస్ట్రేషన్ అయినట్టుగా తీసుకుని ఉన్నాయి. టెండర్లు వేసిన మిగిలిన కంపెనీల స్థానిక జీఎస్టీ బ్రాంచ్‌లు ఎప్పుడు రిజిస్టర్ అయ్యాయో కూడా సరిచూసుకున్నారు. ముఖ్యనేత చెప్పినట్టుగా ఇసుక టెండర్లు నాలుగు కంపెనీలకు దక్కేలా జీఎస్టీ బ్రాంచ్ అడ్రస్‌ల రిజిస్ట్రేషన్ మార్చి 31వ తేదీ నాటికి జరిగి ఉండాలన్న సరికొత్త టెండరు నిబంధన విధించారు. అంటే కొత్తగా టెండర్లు వేయాల్సి వస్తే.. ఆ నాలుగు కంపెనీలు తప్పితే మరే కంపెనీ కూడా టెండరు వేయటానికి అర్హత సాధించదు.

- పోటీ తప్పించేందుకు పక్కా వ్యూహం
- ముఖ్యనేత ఆదేశాలు శిరసావహిస్తున్న యంత్రాంగం!
- అంతా తానై నడిపిస్తున్న మైనింగ్ డీడీ!
- అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

23న టెండర్లు.. 26న తుది గడువు

కృష్ణాజిల్లా ఇసుక టెండర్ల రీ నోటిఫికేషన్‌ను బుధవారం విడుదల చేశారు. ఈ నెల 26వ తేదీతో ఈ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో బిడ్లను దాఖలు చేయటానికి తుది గడువుగా నిర్దేశించారు. ఎక్కడాలేని విధంగా మూడు రోజుల్లో బిడ్లను సమర్పించటం అనే నిబంధనను ఇక్కడ చేర్చారు.

పెద్ద కాంట్రాక్టు సంస్థను తప్పించేందుకే రద్దు నాటకం!

వాస్తవానికి ఈ టెండర్లను రద్దు చేసే వారు కాదు. అనుకోకుండా వివాదాస్పదం కావటంతో పాటు ఇసుక టెండర్లలో సిండికేట్ రింగ్ సంస్థలతో పాటు ఒక పెద్ద కాంట్రాక్టు సంస్థ కూడా టెండరు వేసింది. ఆ సంస్థను తప్పించేందుకు కూడా చాలా తెలివిగా వివాదాస్పదమయ్యాయన్న పేరుతో టెండర్లను రద్దు చేశారు. వాస్తవానికి ఆ సంస్థ

మిగతా 6లో..

ఎక్కడా లేని నిబంధన ఇక్కడ!

ఇలాంటి నిబంధన రాష్ట్రంలో ఏ జిల్లాలో కూడా ఇంత వరకు అమలు చేయలేదు. స్థానిక జిల్లాలోనే జీఎస్టీ బ్రాంచ్‌లు కలిగి ఉండాలన్న నిబంధనను ఎక్కడా కూడా విధించలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు చాలా జిల్లాల్లో ఇసుక టెండర్లు నిర్వహించారు. రాష్ట్రంలో జీఎస్టీ ఎక్కడ కలిగి ఉన్నా టెండర్లలో పాల్గొనే అవకాశం కల్పించారు. దీని వల్ల ప్రభుత్వానికి కూడా ఆదాయం వచ్చింది. గుంటూరు జిల్లాలో నిర్వహించిన ఇసుక టెండర్లు అయితే టెక్నికల్ బిడ్ పాస్ అయిన వాటికి లాటరీ తీసి ఇసుక రేవులను కేటాయించారు. దీంతో ఎక్కడా ఆరోపణలు రాలేదు. ఒక్క కృష్ణాజిల్లాలో మాత్రమే జిల్లాలో జీఎస్టీ రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలన్న నిబంధన విధించారు. ఈ నిబంధన వల్ల టెండర్లలో పాలు పంచుకోవటానికి ఎవరూ రారు. పెద్దగా పోటీ పడరు. వచ్చిన వాళ్లను ఏదో ఒక కారణంతో తప్పించాలన్న వ్యూహం ఎలాగూ సిద్ధం చేసుకున్నారు. కాబట్టి అస్మదీయ నాలుగు కాంట్రాక్టు సంస్థలకు చోడవరం, రొయ్యూరు, నార్త్ వల్లూరు, లంకపల్లి ఇసుక క్వారీలు దక్కేలా ముఖ్యనేత ఆదేశాలతో జిల్లా మైనింగ్ శాఖ అధికారులు మాస్టర్ ప్లాన్ రూపొందించారని తెలిసింది. లోకల్‌గా ఉన్న సంస్థలు టెండర్లు వేసినా వాటికి పెద్దగా టర్నోవర్ లేకపోవటంతో అవి ఎలాగూ దక్కించుకోలేవు. ఎందుకంటే రేటు ఒకటే వేస్తే ఆ కంపెనీల వార్షిక టర్నోవర్ దేనికి ఎక్కువ ఉంటే దానికి అప్పగిస్తారు. స్థానిక కంపెనీలకు అంత పెద్ద వార్షిక టర్నోవర్ ఉండదు కాబట్టి ఈ మేరకు పథక రచన చేశారు.



పదిలం

టెన్త్ ఫలితాల్లో సత్తాచాటిన ఉమ్మడి కృష్ణా

ఉత్తీర్ణతలో పెరిగిన ఎన్టీఆర్ జిల్లా స్థానం

- ఒక్కసారిగా ఆరు స్థానాలు అధిగమించి.. రాష్ట్రంలో ఎనిమిదో స్థానం

గతేడాదితో పోలిస్తే మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులు

- పదో స్థానంలో నిలిచిన కృష్ణాజిల్లా

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. 86.68 శాతం ఉత్తీర్ణతతో ఎన్టీఆర్‌జిల్లా ఒక్కసారిగా 13వ స్థానం నుంచి ఎనిమిదో స్థానానికి వెళ్లింది. 85.32 ఉత్తీర్ణత శాతంతో కృష్ణాజిల్లా 11వ స్థానం నుంచి పదో స్థానానికి చేరింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించింది.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా ఉత్తమ ప్రతిభను కనబరిచింది. ఎన్టీఆర్ జిల్లా ఈ ఏడాది ఒక్కసారిగా ఆరు స్థానాలుపైకి ఎగబాకింది. బుధవారం విడుదలైన పరీక్షా ఫలితాల్లో జిల్లా 86.68శాతం ఉత్తీర్ణతను సాధించింది. రాష్ట్రంలో ఎనిమిదో స్థానంలో నిలిచింది. గడచిన విద్యాసంవత్సరం 86.76 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 13వ స్థానంలో ఉంది. ఈ ఏడాది ఫలితాల్లో ఆరు మెట్లు ఎక్కింది. జిల్లాలో మొత్తం 13,938 మంది బాలురు పరీక్షలు రాయగా 11,662 మంది పాసయ్యారు. బాలికలు 13,529 మంది పరీక్షలకు హాజరవ్వగా 11,872 మంది ఉత్తీర్ణతను సాధించారు. పదో తరగతి ఫలితాల్లో కృష్ణా జిల్లా నుంచి 20,776 మంది విద్యార్థులు హాజరవ్వగా 17,726 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 8,998 మంది,

మిగతా 6లో..

19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలను మే 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నారు. పరీక్షరాసే వారు గురువారం నుంచి 30వ తేదీలోగా పరీక్ష ఫీజును చెల్లించాల్సి ఉంది. జవాబు పత్రాల రీవెరిఫికేషన్, రీకౌంటింగ్ కోసం గురువారం నుంచి మే 1వ తేదీలోగా ఫీజును చెల్లించాల్సి ఉంది. రీకౌంటింగ్‌కు ఒక్కోసబ్జెక్టుకు రూ.500, రీ వెరిఫికేషన్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 చెల్లించాల్సి ఉంది.



బౌద్ధ స్థూపాలకు పూర్వ వైభవం

జిల్లాలో పర్యాటకం పరుగులు

కొండపల్లికి కొత్త పుంతలు


6

టాయ్ లైబ్రరీతో చిన్నారుల్లో మేధాశక్తి పెంపు

- సర్వోత్తమ గ్రంథాలయంలో ప్రారంభం

సెలవుల్లోనూ.. చదువుల బాధలు!

కార్పొరేట్ కళాశాలల నిర్వాకంతో వేసవి సెలవుల్లోనూ విద్యార్థులకు చదువుల బాధలు తప్పడంలేదు. జేఈఈ, ఎంసెట్ ర్యాంకుల పేరుతో సంవత్సరం పొడవునా పుస్తకాలతో కుస్తీ పట్టిస్తున్నారు. ప్రత్యేక కోర్సుల పేరిట తల్లిదండ్రుల జేబులను ఖాళీ చేస్తున్నారు. ఎవరైనా వేసవి సెలవులు కదా అంటే మీకు ర్యాంకులు రావాలా.. వద్దా అంటూ కరకుగా సమాధానం చెబుతున్నారు. బస్సులు నడపం.. మీరే ఎక్కించుకురావాలి అంటూ హుకుం జారీ చేస్తున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



కార్పొరేట్ కళాశాలల నిర్వాకం

- వేసవి సెలవుల్లోనూ విద్యార్థులు రావాల్సిందేనని హుకుం
- జేఈఈ, ఎంసెట్ ర్యాంకుల పేరిట చితికిపోతున్న బాల్యం
- సంవత్సరం పొడవునా పుస్తకాలతో కుస్తీ!
- ప్రత్యేక కోర్సుల పేరిట అధిక ఫీజులు
- రవాణా విషయంలో మాత్రం శ్రద్ధ వహించని కాలేజీలు
- చిన్న వయస్సులోనే డిప్రెషన్, ఆరోగ్య సమస్యలు

విజయవాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లాలో సుమారు 170 వరకు కార్పొరేట్ విద్యా సంస్థలు ఉన్నాయి. వాటిలో ప్రధానంగా మొగల్రాజపురంలోని 47 కళాశాలలు, బెంజ్‌సర్కిల్‌లోని 20 కళాశాలలు, రామవర ప్పాడు ఏరియాలోని మరో 13 కళాశాలల్లో వేసవి తరగతులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇంటర్మీడియట్ విద్యార్థులపై ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు రోజురోజుకు చదువు ఒత్తిడి పెంచుతున్నాయి. ప్రథమ సంవత్సరం పరీక్షలు పూర్తయి మూడు వారాలు కూడా గడవకముందే ద్వితీయ సంవత్సరం మార్కుల టార్గెట్ అంటూ తరగతులు నిర్వహిస్తున్నాయి. విద్యార్థులకు కొన్నేళ్ల కిందట వరకు ప్రత్యేక తరగతులు పెట్టేవారు. ప్రస్తుతం కాలానికనుగుణంగా ప్రథమ సంవత్సరం పూర్తి కాగానే ద్వితీయ సంవత్సర తరగతులతో పాటు, జేఈఈ, ఎంసెట్ తరగతులను నిర్వహిస్తున్నారు. ఇప్పటికే నగర పరిధిలోని అనేక ప్రైవేటు కాలేజీలు ఇంటర్ మొదటి ఏడాది ఉత్తీర్ణత అయిన విద్యార్థులకు రెండవ ఏడాదికి ప్రత్యేక తరగతులను ప్రారంభించాయి. ఇందుకు సంబంధించి ఆయా కాలేజీలు విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. ఎక్కువ మార్కుల సాధించిన విద్యార్థులపై ప్రత్యేకంగా

మిగతా 6లో..

సంపద సృష్టికి అడుగులు పడినట్టే..!

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

8

అమరావతిలో బయోడైవర్సిటీ పార్కులు!

- ఢిల్లీలోని బయోడైవర్సిటీ పార్కులు సందర్శించిన ఏడీసీఎల్ సీఎండీ

8

కశ్మీర్ నరమేధం కారకుల్ని కఠినంగా శిక్షించాలి

8

15 ఎకరాల్లో మొక్క జొన్న బుగ్గిపాలు

కేశినేని బ్రదర్స్.. ఎక్స్ వార్!

ఎంపీ శివనాథ్‌పై ఎక్స్ వేదికగా మాజీ ఎంపీ నాని పోస్టు

అభివృద్ధిపై విషం చిమ్ముతున్న సైకోకు స్పందించాల్సిన అవసరం లేదు : ఎంపీ చిన్ని

- ఇసుక వ్యాపారం, ఫ్లై యాష్ తోలకం, గ్రావెల్ అమ్మకం, భూ దందాలు బ్రోకరేజీలు, పేకాట గృహాలు, రేషన్ మాఫియా దగ్గర వసూళ్లు అంటూ నాని సెటైర్లు!
- ఎంపీ కార్యాలయానికి ఛార్లెస్ శోభరాజ్ భవన్‌గా పేరు మార్చాలని సలహా
- కేశినేని శ్రీనివాస్‌పై ప్రతిగా ఎక్స్‌లో పోస్టు పెట్టిన శివనాథ్
- రోడ్ల మీద మతిభ్రమించి తిరుగుతున్న సైకోకు చిప్ దొబ్బింది అంటూ ఫైర్ అయిన చిన్ని

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కేశినేని బ్రదర్స్ మధ్య 'ఎక్స్' వేదికగా 'వార్' జరగటం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. అన్నదమ్ముల వ్యవహారం కాస్తా జిల్లా ప్రజలకు హాట్ టాపిక్‌గా మారింది. ఉర్సా కంపెనీతో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)కు సంబంధాలు ఉన్నాయంటూ మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) మంగళవారం ఎక్స్‌లో పోస్టు చేయటంతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖ దుమారం రేపింది. కేశినేని నాని ట్వీట్‌ను ఖండిస్తూ ఎమ్మెల్యే బొండా ఉమా, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్నలు చేసిన వ్యాఖ్యలు మరింత హీట్ పెంచాయి. కేశినేని నాని ఆరోపణలపై ఉర్సా కంపెనీ ప్రతినిధులు కూడా జూమ్ కాల్ ద్వారా ఖండించారు. కేశినేని శివనాథ్‌తో తమకు ఎలాంటి సంబంధంలేదని ప్రకటించారు. ఇంతటితో ఈ వివాదం సమసిందనుకుంటే బుధవారం కూడా మాజీ ఎంపీ కేశినేని నాని తన సోదరుడు ఎంపీ కేశినేని శివనాథ్‌పై ఎక్స్ వేదికగా మరో పోస్ట్ పెట్టారు. "విజయవాడ ప్రజలు చరిత్రలో లేని విధంగా భారీ మెజార్టీతో తనను గెలిపించుకున్నారు అని గర్వంగా చెప్పుకునే ప్రజాప్రతినిధి తన కార్యాలయంలో కూర్చొని ఇసుక వ్యాపారం, ఫ్లైయాష్ తొలకం, గ్రావెల్ అమ్మకం, భూ దందాలు, బ్రోకరేజీలు, పేకాట గృహాలు, రేషన్ మాఫియా దగ్గర వసూళ్ల వగైరా పనులు చేస్తుంటారు. కాబట్టి నీ కార్యాలయానికి ఎన్టీఆర్ పేరు మార్చి 'ఛార్లెస్ శోభరాజ్ భవన్' అని పెడితే బాగుంటుందని.. నిన్ను భారీ మెజార్టీతో గెలిపించిన విజయవాడ ప్రజలు కోరుకుంటున్నారు" అంటూ కేశినేని నాని ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.



నాని



చిన్ని

సోదరుడు తనపై డైరెక్ట్‌గా చేసిన ట్వీట్‌పై ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కూడా స్పందించారు. "రోడ్ల మీద మతిభ్రమించి తిరుగుతున్న సైకో చిప్ దొబ్బి.. సోషల్ వాల్స్‌పై కసి, పగ, ద్వేషంతో రగిలిపోతూ విజయవాడ అభివృద్ధిపై విషం చిమ్ముతున్న సైకోకు స్పందించాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండండి" అంటూ ఎక్స్ వేదికగా శివనాథ్ బుధవారం పోస్ట్ చేశారు. అన్నదమ్ముల మధ్యన ఈ ఎక్స్ వార్ రానున్న రోజుల్లో ఏ స్థాయికి వెళుతుందోనన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



మినిట్స్ పుస్తకంలో సంతకం చేస్తున్న చైర్‌పర్సన్

మున్సిపల్ చైర్‌పర్సన్ రాజీనామా ఆమోదం

ముగిసిన తిరువూరు చైర్‌పర్సన్ వివాదం

నూతన చైర్‌పర్సన్ ఎన్నిక ప్రశ్నార్థకం

ఇద్దరు వైస్ చైర్మన్లలో బాధ్యతలు ఎవరికి?

తిరువూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి రాజీనామాను కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో అజెండాలోని మూడు అంశాలతో పాటు, 4వ అంశమైన రాజీనామాను సభ్యులు ఆమోదించారు. ఈ సందర్భంగా కస్తూరిబాయి మాట్లాడుతూ తాను పార్టీకి కట్టుబడి ఉంటానని, అధ్యక్షుడి సూచన మేరకు, రాజీనామా చేశానని, గత కౌన్సిల్ సమావేశంలో ఆమోదించాల్సి ఉండగా అనారోగ్యంతో పూర్తి సమావేశంలో పాల్గొలేదని, కానీ కొందరు తప్పుడు ప్రచారం చేయడం బాధించిందన్నారు. రాజీనామా ఆమోదం తీర్మానం రికార్డులో (మినిట్స్ పుస్తకం)లో చైర్‌పర్సన్ సంతకం చేసి వెళ్లిపోయారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ వెలుగొటి విజయలక్ష్మి, కమిషనర్ జి.లోవరాజు, కార్యాలయం సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తెరపైకి కొత్త సమస్య

తీవ్ర ఉత్కంఠ, నాటకీయ పరిణామాల నేపథ్యంలో చైర్‌పర్సన్ రాజీనామా ఆమోదంతో తిరిగి నూతన చైర్‌పర్సన్ ఎన్నిక జరుగుతుందా లేదా అన్న మీమాంస కొందరు కౌన్సిలర్లలో నెలకొంది. ప్రస్తుతం ఆమోదించిన రాజీనామా అంశాన్ని మున్సిపల్ కార్యాలయం నుంచి సీడీఎం, ఎన్నికల కమిషన్‌కు పంపాల్సి ఉంటుంది. చైర్‌పర్సన్ ఎన్నికకు సమయం పట్టే అవకాశం ఉండటంతో తాత్కాలికంగా వైస్ చైర్‌పర్సన్‌కు బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. అయితే ఇక్కడ ఇద్దరు వైస్ చైర్‌పర్సన్లు ఉండటంతో ఎవరికి బాధ్యతలు అప్పగించాలనే విషయంపై ఉన్నతాధికారులు నిర్ణయించాల్సి ఉంది. బోర్డు పదవీకాలం కేవలం 10 నెలలు మాత్రమే ఉండటంతో, నూతన చైర్‌పర్సన్ ఎన్నిక సాధ్యమవుతుందా లేదా అన్న అనుమానం కొందరు వ్యక్తం చేస్తున్నారు. నాటి ఒప్పందం ప్రకారం చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్‌పర్సన్స్ మార్పు ఉంటుందా అనే అనుమానాన్ని కూడా కొందరు వ్యక్తం చేస్తున్నారు.

బౌద్ధ స్థూపాలకు పూర్వ వైభవం

జిల్లాలో పర్యాటకం పరుగులు.. కొండపల్లికి కొత్త పుంతలు : ఏపీటీడీసీ


జగ్గయ్యపేటలోని ధనంబోడులో బౌద్ధస్థూపం

విజయవాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పర్యాటకశాఖ కసరత్తు ప్రారంభించింది. ప్రధానంగా బౌద్ధ ఆనవాళ్లున్న ధనంబోడు, రామిరెడ్డిపల్లి(గుమ్మడిరుద్ర) ప్రాంతాలను అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించాలని టూరిజం, ఏపీటీడీసీ శాఖ భావిస్తోంది. దీనిలో భాగంగా సంబంధిత ప్రదేశాలను పరిశీలించి నివేదికలను ప్రభుత్వానికి సమర్పించింది. ఇక్కడి స్థూపంలో బుద్ధుని దంతం ఉంటుందని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఈ ప్రాంతం జగ్గయ్యపేట రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉన్న ధనంబోడు కొండపై ఉంది. కొండపైకి కాలినడకన వెళ్లాల్సిందే. గతంలో నిధి నిక్షేపాలున్నాయన్న అపోహతో గుర్తుతెలియని వ్యక్తులు ఇక్కడ తవ్వకాలు జరిపి ప్రధాన స్థూపం చుట్టూ ఉన్న కట్టడాలను ధ్వంసం చేశారు. ఇప్పటికీ వాటి అవశేషాలు అక్కడ దర్శనమిస్తాయి. రాష్ట్ర విభజన అనంతరం నాటి ప్రభుత్వం ధనంబోడును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ప్రతిపాదించింది. అయితే ఇప్పటికీ అక్కడ ఎటువంటి అభివృద్ధి జరగలేదు. మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడం.. పర్యాటక అభివృద్ధిలో భాగంగా దీనిపై దృష్టి సారించింది. చింతపల్లి తరువాత అమరావతి రాజధానిగా 1761 నుంచి 1816 వరకు పరిపాలించిన వాసిరెడ్డి వెంకటాద్రినాయుడనే జమిందారు తన తండ్రి జగ్గన్న పేరు మీద జగ్గయ్యపేటను నిర్మించాడు. అంతకు పూర్వం జగ్గయ్యపేటను బేతవోలుగా పిలిచేవారని అక్కడి ప్రజలు చెప్పుకుంటారు. ప్రస్తుతం బౌద్ధ స్థూపమున్న కొండను పూర్వం వెలిగిరిగా పిలిచివారని చరిత్ర చెబుతోంది. జగ్గయ్యపేటకు తూర్పున 2 కిలోమీటర్ల దూరంలో పర్వతంపై ఈ బౌద్ధక్షేత్ర నిర్మాణం జరిగింది. స్థానికులు ఈ పర్వతాన్ని ధనంబోడు, ధనందిబ్బ, ధనపుకొండ అని పిలుస్తారు. 31.5 అడుగుల చుట్టుకొలత 5 అడుగుల ఎత్తు ఉన్న ఈ మహాస్థూపాన్ని పాలరాతితో నిర్మించారు.

ఆకర్షణీయంగా కొండపల్లి

కొండపల్లి చేనేత కొయ్యబొమ్మలకు ప్రసిద్ధి. దీనిని పర్యాటక ప్రాంతంగా మార్చడంతో పాటు కొండపల్లి బొమ్మలకు పూర్వ వైభవం తీసుకువచ్చే విధంగా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. దీనిలో భాగంగా కొండపల్లిని హస్తకళకు కేంద్రంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం పర్యాటక శాఖకు ప్రతిపాదనలు చేసింది. కొండపల్లి గ్రామంలో హస్తకళ అనుభవ కేంద్రాన్ని స్థాపించేందుకు పర్యాటక శాఖ ప్రణాళిక రూపొందించింది. రాష్ట్ర పర్యాటక శాఖ కొండపల్లి హెరిటేజ్ ఆర్టిసన్ స్ట్రీట్ పేరుతో అభివృద్ధి చేస్తోంది. ఇందులో హస్తకళ ప్రదర్శనలు, వర్క్‌షాపులు, ఆధునిక సాంకేతికతతో కూడిన ఇంటరాక్టివ్ అనుభవాలు అందుబాటులో ఉంటాయి. దీని ద్వారా మొబైల్ యాప్ సహాయంతో సందర్శకులకు సమాచారం తెలుసుకోవచ్చని పర్యాటక అధికారులు చెబుతున్నారు. పర్యాటకులకు అర్థమయ్యేవిధంగా, సౌకర్యంగా ఉండేందుకు లైవ్ డెమోలు, కొండపల్లి విక్రయ కేంద్రాలు వంటివి ఏర్పాటుచేస్తామని వెల్లడించారు.


గుప్త నిధుల కోసం తవ్వకాలు జరపడంతో పడి ఉన్న స్థూపాలు


ప్రదర్శనలో పుస్తకాలు చూస్తున్న విద్యార్థులు, పాఠకులు

పుస్తక పఠనంతో విజ్ఞానం

» జిల్లా ఉపగ్రంథాలయాధికారి నగేష్

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పుస్తకపఠనం వల్ల విజ్ఞానాన్ని పొందవచ్చని కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ నగేష్ అన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనకు అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో నగేష్ మాట్లాడుతూ, గ్రంథాలయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 28 నుంచి ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భారతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్, లాల్‌బహదూర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.


లైబ్రరీలో క్యారమ్స్, చెస్ ఆడుతున్న చిన్నారులు

టాయ్ లైబ్రరీతో చిన్నారుల్లో మేధాశక్తి పెంపు

» సర్వోత్తమ గ్రంథాలయంలో ప్రారంభం

బెంజిసర్కిల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల్లో మేధాశక్తి పెంపొందేందుకు టాయ్ లైబ్రరీ ఎంతగానో దోహదపడుతుందని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అనుమోలు శ్రీముఖి అన్నారు. బెంజిసర్కిల్‌లోని సర్వోత్తమ గ్రంథాలయంలో బుధవారం సాయంత్రం టాయ్ లైబ్రరీని ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావి శారద అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో డాక్టర్ శ్రీముఖి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బొమ్మలతో పిల్లలు ఆడుకుంటే వారికి తెలియకుండానే పఠనాసక్తి అలవడుతుందని తెలిపారు. వేసవి సెలవులను టాయ్ లైబ్రరీ ద్వారా సక్రమంగా వినియోగించుకునే విధంగా తల్లిదండ్రులు కృషిచేయాలన్నారు. జూన్ 10 వరకు ప్రతిరోజు సాయంత్రం 4నుంచి 6గంల వరకు ఈ లైబ్రరీ అందుబాటులో ఉంటుందని రావి శారద తెలిపారు. ఈసందర్భంగా బుక్‌హంట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.


టాయ్ లైబ్రరీని ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీముఖి

నేటి నుంచి మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలన

మచిలీపట్నం టౌన్ : టీచర్ల బదిలీల నిమిత్తం ఉమ్మడి కృష్ణాజిల్లాల పరిధిలో పనిచేస్తున్న టీచర్లు తమ మెడికల్ సర్టిఫికెట్లను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో 24, 25, 26 తేదీల్లో సమర్పించాలని డీఈవో పీవీజే రామారావు తెలిపారు. 24న ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో ఉండి ప్రస్తుత ఎన్టీఆర్ జిల్లాలో కొనసాగుతున్న 20 మండలాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మెడికల్ సర్టిఫికెట్లను సమర్పించాలన్నారు. 25న కృష్ణాజిల్లా పరిధిలోని 25 మండలాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, 26న ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలో ఉండి ప్రస్తుతం ఏలూరు జిల్లాలో కొనసాగుతున్న ఎనిమిది మండలాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ మెడికల్ సర్టిఫికెట్లను సమర్పించాలని డీఈవో తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీ నియంత్రణ చట్టం 2005 ప్రకారం ప్రిఫరెన్షియల్ కేటగిరి, స్పెషల్ పాయింట్లు పొందేందుకు మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సర్టిఫికెట్లను పరిశీలిస్తారన్నారు. డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో అనారోగ్యంగా ఉండే ఉపాధ్యాయులు తమ సర్టిఫికెట్లను సమర్పించాలన్నారు.

సిపెట్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

బెంజిసర్కిల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సిపెట్)లో పదో తరగతి విద్యార్హతతో మూడేళ్ల వ్యవధిగల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ(డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ(డీపీఎంటీ) కోర్సుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సిపెట్ డైరెక్టర్ అండ్ హెడ్ సీహెచ్ శేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా బీఎస్సీ విద్యార్హతతో రెండేళ్ల వ్యవధిగల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్(పీజీడీ-పీపీటీ) కోర్సుకు ఆన్‌లైన్ విధానంలో https://cipet25.onlineregistration.org/CIPET లింక్ ద్వారా మే 29లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కోర్సులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉందని, సిపెట్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)ను జూన్8న నిర్వహించి వచ్చిన ర్యాంక్ ఆధారంగా విజయవాడ కేంద్రంలో 150 సీట్లు భర్తీచేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కోర్సులు పూర్తిచేసిన వారికి ప్లాస్టిక్ రంగంలో గల బహుళజాతి సంస్థ(ఎంఎన్‌సీ), దాని అనుబంధ సంస్థల్లో జూనియర్ ఇంజనీర్(ప్రొడక్షన్), మౌల్డ్ డిజైనర్ అండ్ మేకర్ జూనియర్ ఇంజనీర్ (మెంటినెన్స్), క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలు వస్తాయని ఆయన వివరించారు. ప్రారంభ వేతనం రూ. 20వేల నుంచి 25వేలు ఉంటుందని, అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9398050255 నెంబరులో సంప్రదించాలని సీహెచ్ శేఖర్ కోరారు.

పది ఫలితాల్లో విశ్వభారతి రికార్డులు


ప్రేమ్‌కుమార్


కె.వర్షిత

గుడివాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో విశ్వభారతి ఇంగ్లీషు మీడియం విద్యార్థి కోరుకొండ ప్రేమ్‌కుమార్ 597, కె.వర్షిత 596 మార్కులతో డివిజన్‌స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారని పాఠశాల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 917మంది పరీక్ష రాయగా, అందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై రికార్డు సాధించారన్నారు. 20మందికి 590కిపైగా, 162మంది 580పైగా, 376మంది 570పైగా, 546మంది 560కిపైగా మార్కులు సాధించారన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను చైర్మన్ అభినందించారు.

టెన్త్‌లో ప్రైవేటుకు దీటుగా సత్తా చాటారు

బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యూకేషన్ ఆంధ్రప్రదేశ్ బుధవారం విడుదల చేసిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు దుమ్ము లేపారు. పలువురు విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రాణించి ఉత్తమ ఫలితాలు సాధించారు.

సత్తా చాటిన కవలలు..

కంచికచర్ల రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : టెన్త్ ఫలితాల్లో కంచికచర్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నందికట్ల కుందన వెంకట నాగశ్రీసాయి, కందికట్ల కుందన వెంకట నాగశ్రీలు కవలు, అన్నా చెల్లెళ్లు. కుందన్ వెంకటనాగశ్రీసాయి 587, కుందన్ వెంకట నాగశ్రీ 584 మార్కులతో మండల ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించారు. తండ్రి ప్లాస్టిక్ సామగ్రి విక్రయిస్తుంటాడు. తల్లి అంగన్వాడీ టీచర్.

ఉంగుటూరు మండలంలో ఇందుపల్లి జడ్పీహైస్కూల్‌కి చెందిన కవలలు దుబ్బాకుల దుర్గాయశ్వంత్ 591, దుబ్బాకుల వీరవెంకటనాగేంద్ర 589లతో మండలంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు.


వెంకట నాగశ్రీ సాయి


వెంకట నాగశ్రీ


దుర్గాయశ్వంత్


వీరవెంకటనాగేంద్ర

- గొల్లపూడి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని అహ్మది సుల్తాన 590తో పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది.
- మైలవరం జిల్లాపరిషత్ బాలికల హైస్కూల్ విద్యార్థిని పి.నందిని 593 మార్కులు సాధించి మండలస్థాయిలో ప్రథమస్థానం సాధించింది.
- విజయవాడరూరల్ నున్న గ్రామ జడ్పీహైస్కూల్ విద్యార్థి పల్లపోతుల రాజేష్ 591 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచాడు.
- సత్యనారాయణపురం ఏకేటీపీఎం పాఠశాల విద్యార్థి కె.ప్రణీత్ 592 మార్కులు సాధించాడు.
- గవర్నర్‌పేట కస్తూరిబాయిపేట జవహర్ నవోదయ విద్యార్థిని కొల్లా స్వాతి 598 మార్కులు సాధించింది.


అహ్మది సుల్తాన


పి.నందిని


కె.ప్రణీత్


రాజేష్

95 శాతం వసతి గృహ విద్యార్థుల ఉత్తీర్ణత


కె.లిఖిత

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి ఫలితాల్లో కృష్ణా జిల్లా పరిధిలోని సాంఘిక సంక్షేమశాఖ నిర్వహిస్తున్న 21 హాస్టళ్లలో 134 మంది విద్యార్థులు హాజరు కాగా 127 మంది ఉత్తీర్ణులయ్యారు. 16 హాస్టళ్లలోని విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించారని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి షేక్ షాహిద్‌బాబు తెలిపారు. 14మంది 500కు పైబడి మార్కులు సాధించారు. కోడూరు బాలికల హాస్టల్‌లో బొమ్మిడి తేజ 572, కొక్కిలిగడ్డ భావన 570, డోకిపర్రు బాలికల హాస్టల్ విద్యార్థిని ఎస్ బేగం 566, మచిలీపట్నం వలందపాలెంలోని బాలికల హాస్టల్ విద్యార్థిని కె.లిఖిత 588 మార్కులు సాధించినట్టు తెలిపారు.

సెలవుల్లోనూ.. చదువుల బాధలు!

(5వ పేజీ తరువాయి)

దృష్టి సారించి వారిని తరగతులకు వచ్చేలా యాజమాన్యాలు పథకాలు రచిస్తున్నాయి. ఇందుకోసం విద్యార్థుల తల్లిదండ్రులను సంప్రదించి ఫీజుల రాయితీ, ఎవరికో వచ్చిన ర్యాంకులను కాలేజీ ఖాతాలో చూపి మభ్యపెడుతున్నాయి. అనేక మంది విద్యార్థులకు మానసిక ఒత్తిడితో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా వారు పట్టించుకోకపోవడంతో ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయి. తల్లిదండ్రులు కూడా సహకారాన్ని అందిస్తుండటంతో విద్యార్థులది ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి.

వేసవి టూర్లు, సరదాలు మాయం

వేసవి సెలవులు వచ్చాయి అనగానే విద్యార్థులు అమ్మమ్మ వాళ్ల ఇంటికో, కుటుంబంతో వేసవి విడిదికో వెళ్తారనే ఆలోచన సెలవులకు ముందే వారి మనసులో నాటుకుపోయేది. కానీ ఇది ఒకప్పటి మాట. వేసవి సెలవులు అనేవి చరిత్రగా చెప్పుకునే పరిస్థితికి నేటి తరం విద్యార్థులు వచ్చారంటే అతిశయోక్తి కాదు. కొన్ని కార్పొరేట్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలను పట్టించుకోకుండా ఫలితాలు వెలువడిన కొన్ని రోజులకే కోచింగ్ పేరుతో క్లాసులు పెట్టి విద్యార్థులను మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయి. విద్యార్థులు మానసిక ఉత్సాహంగా ఉంటేనే వారిలో సృజనాత్మకత పెరుగుతుంది. కానీ దీనికి భిన్నంగా నేటి విద్యావ్యవస్థ తయారైంది. దీనికి విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వత్తాసు పలకడంతో కార్పొరేట్ విద్యా సంస్థల ఆగడాలకు హద్దు లేకుండా పోతోంది. ఉమ్మడి కృష్ణాజిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

తల్లిదండ్రుల ఆలోచన దృక్పథం మారాలి

భాష, వేషధారణ, విహార వినోదాల పేరుతో పాశ్చాత్య పోకడలను అనుసరిస్తున్న నేటి తరం తల్లిదండ్రులు పిల్లలకు చదువు, కెరీర్‌కు సంబంధించిన విషయంలో ఎలాంటి స్వేచ్ఛనిస్తున్నారో ఆలోచించడం లేదు. పాశ్చాత్య దేశాలలో పిల్లలకు కనీస వయస్సు వస్తే వారి సొంత ఆలోచనలకు విలువనిస్తారు. కానీ మన దేశంలో ముప్పై ఏళ్లు వచ్చినా తల్లిదండ్రులు చెప్పినట్టే నడుచుకోవాలి. తల్లిదండ్రులు పిల్లల విషయంలో ఇతరులతో పోలికలు మానుకుని వారికి నచ్చిన రంగంలో ప్రోత్సహిస్తే అనుకున్న విజయాలు సాధించడానికి దోహదపడేవారవుతారని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై నేటి తరం తల్లిదండ్రులు కచ్చితంగా ఆలోచించాల్సి అవసరం ఎంతైనా ఉంది.


గో-వృషభ కల్యాణం నిర్వహిస్తున్న కళ్యాణ కర్తలు

ఘనంగా గో-వృషభ కల్యాణం

అవనిగడ్డ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ శివారు బందలాయిచెరువు గ్రామంలో లోక క్షేమం, పశు సంపద వృద్ధి కోసం గో-వృషభ కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సింహాద్రి నారయ్య వంశీయులచే గో-వృషభ కల్యాణం చేశారు. సింహాద్రి రామచంద్రరావు - వెంకటేశ్వరమ్మ, సింహాద్రి మనోజ్ - సంధ్య దంపతులు వృషభం తరపున, కమ్మిలి రవి, లక్ష్మీ దంపతులు గోమాత తరపున తల్లిదండ్రులుగా వ్యవహరించి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణ తంతును జరిపించారు. కార్యక్రమంలో అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, కుమారుడు సింహాద్రి వికాస్ ఎలు పాల్గొని పూజాదికాలు నిర్వహించారు.


పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా గో-వృషభరాజములు

పదిలం

(5వ పేజీ తరువాయి)

బాలికలు 8,728 మంది ఉత్తీర్ణతను సాధించారు. జిల్లాలో 85.32 ఉత్తీర్ణత శాతం నమోదైంది. 2023-24వ సంవత్సరంలో 90.05 శాతం ఉత్తీర్ణతతో 11వ స్థానంలో ఉన్న కృష్ణా ఈ సారి పదో స్థానం నిలిచింది.

మేనేజ్‌మెంట్ల వారీగా..

బీసీ సంక్షేమ పాఠశాలలు అత్యధికంగా ఉత్తీర్ణతను సాధించాయి. ఈ పాఠశాలల్లో విద్యార్థులు 97.27 శాతంతో ఉత్తీర్ణతను సాధించారు. బీసీ సంక్షేమ పాఠశాలల్లో 110 మంది విద్యార్థులకు గాను 107 మంది ఉత్తీర్ణులయ్యారు. కస్తూర్బాగాంధీ పాఠశాలలు 96.43శాతం ఉత్తీర్ణతతో ద్వితీయస్థానంలో నిలిచాయి. కేజీబీవీ పాఠశాల్లో 112 మంది విద్యార్థులకుగాను 108 మంది ఉత్తీర్ణులై 93.82శాతం ఉత్తీర్ణతను సాధించారు. సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ పాఠశాలల్లో మొత్తం 566 మంది పరీక్షలు రాశారు. వారిలో 144 మంది బాలురు, 422 మంది బాలికలు ఉండగా 127 మంది బాలికలు, 404 మంది బాలురు ఉత్తీర్ణులయ్యారు. 93.82 శాతం ఉత్తీర్ణతో ఈ పాఠశాలలు మూడో స్థానంలో నిలిచాయి. ప్రైవేట్ పాఠశాలలు 92.75శాతం ఉత్తీర్ణతను సాధించాయి. మొత్తం 14,787 విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి పరీక్షలకు హాజరయ్యారు. 8,644 బాలురకు గాను 7,916 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 7,299 మందికి గాను 6871 మంది ఉత్తీర్ణులయ్యారు. ఏపీ మోడల్ స్కూళ్ల నుంచి 59 మంది బాలురు, 79 మంది బాలికలు పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 54 మంది బాలురు, 72 మంది బాలికలు ఉత్తీర్ణులై 91.30 శాతం సాధించారు. ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల నుంచి 324 మంది బాలురు, 513 మంది బాలికలు పరీక్షలు రాస్తే అందులో 267 మంది బాలురు, 428 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు. ఈ విద్యాసంస్థల్లో 83.03 శాతం నమోదైంది. గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు 82.55 శాతం ఉత్తీర్ణతను సాధించాయి. గిరిజన గురుకులాల్లో 48 మంది బాలురు, 187 మంది బాలికలతో కలుపుకుని మొత్తం 235 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వారిలో ఏడుగురు బాలురు, 157 మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు. 82.55 శాతంతో ఈ విద్యాసంస్థలు ఏడో స్థానంలో నిలిచాయి. మున్సిపల్ పాఠశాలల నుంచి 1,196 బాలురు, 1,236 మంది బాలికలు పరీక్షలు రాయగా, 914 మంది బాలురు, 1,050 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించి 80.76 శాతంతో ఎనిమిదో స్థానంలో నిలిచారు. 80 శాతం ఉత్తీర్ణతో ఆంధ్రప్రదేశ్ రెసిడెన్సియల్ విద్యాసంస్థలు తొమ్మిదో స్థానంలో నిలిచాయి. ఈ పాఠశాలల నుంచి 30 మంది విద్యార్థుల్లో 24 మంది ఉత్తీర్ణులయ్యారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 71.36 శాతంతో పదో స్థానంలో నిలిచాయి. మొత్తం 6,832 మంది విద్యార్థుల్లో బాలికలు 3,625, బాలురు 3,207 మంది పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 2,744 మంది బాలికలు, 2131 మంది బాలురు ఉత్తీర్ణులయ్యారు. గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలు 70.45 శాతం ఉత్తీర్ణతతో 11వ స్థానంలో నిలిచాయి. ప్రభుత్వ పాఠశాలలు 12వ స్థానంలో నిలిచాయి. 162 మంది బాలురకుగాను 78 మంది, 26 బాలికలకు గాను 14 మంది ఉత్తీర్ణులయ్యారు. 48.94 శాతం ఉత్తీర్ణతను నమోదు చేసుకున్నాయి.

పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడని.. విద్యార్థి ఆత్మహత్య!


అనీల్ కుమార్

బంటుమిల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడని ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. బంటుమిల్లి మండలంలోని పెదతుమ్మిడి పంచాయతీ అర్థవాని గూడెంకు చెందిన గోవాడ రామకృష్ణ మినీవ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె ప్రయివేట్ స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతుంది. కుమారుడు గోవాడ అనీల్ కుమార్ పెదతుమ్మిడి జడ్పీ హైస్కూల్లో గతేడాది 10వ తరగతి పరీక్షలు రాయగా ఫెయిల్ అయ్యాడు. తిరిగి ఈ ఏడాది మార్చిలో పరీక్ష రాశాడు. ఫలితాల్లో మళ్లీ ఫెయిల్ కావడంతో మనస్థాపానికి గురై బుధవారం ఉదయం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. రెక్కల కష్టంతో చదివిస్తూ పిల్లల భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులకు అనీల్ కుమార్ మృతి కడుపుకోతను మిగిల్చింది.

కశ్మీర్‌లో ఉగ్ర దాడి బాధాకరం



గన్నవరంలో కొవ్వొత్తుల ర్యాలీ.. ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

గన్నవరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లోయలో ఉగ్రవాదుల దాడి యావత్తు దేశాన్ని తీవ్రంగా కలచివేసిందని బీజేపీ నాయకురాలు కానూరి శేషుమాధవి అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు నీలం అశోక్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ బుధవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన 21మంది అమాయకుల ఆత్మశాంతి చేకూరాలని కోరారు. మాజీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నీలం అశోక్, మేడూరి శేష బాబు, రామకోటి, వెంకటకృష్ణ, అనిల్ పాల్గొన్నారు. **ఉయ్యూరు** : కశ్మీర్ లోయలో ఉగ్రవాదుల దుశ్చర్యను వ్యతిరేకిస్తూ దేశ ప్రజ లంతా ఒక్కతాటిపై నిలిచి ఉగ్రవాదాన్ని తుదముట్టించే ప్రభుత్వ చర్యలకు అండగా నిలవాలని పలువురు అభిప్రాయపడ్డారు. కశ్మీర్‌లో మంగళవారం ఉగ్రవాదులు 30 మంది పర్యాటకులను కిరాతకంగా కాల్చిచంపడాన్ని నిరసిస్తూ ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రధాన సెంటర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కోడె సాంబశివరావు, తిరుమలరావు, రాంబాబు, నెహ్రూ, శ్రీనివాస్, రాజు, ప్రభుత్వవైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మృతి చెందిన తండ్రికి తలకొరివి పెట్టిన చిన్నారి


తండ్రికి దహన సంస్కారాలు నిర్వహిస్తున్న చిన్నారి

గుడివాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ధైర్యసాహసాలతో విద్యుత్ ప్రమాదం నుంచి బాలుడ్ని రక్షించి ఆ కుటుంబంలో వెలుగులు నింపాడు.. అంతలోనే అదే విద్యుత్‌కు తాను బలయ్యాడు.. తన కుటుంబాన్ని చీకటి చేసుకున్నాడు.. గుడివాడ మండలం మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీలో బాలుడిని రక్షించబోయి విద్యుత్ షాక్ గురై తాపీ కార్మికుడు తేజ(27) ప్రాణాలు కోల్పోయిన ఘటన మంగళవారం జరిగింది. కూలీ పనుల నిమిత్తం జగ్గయ్యపేట నుంచి వచ్చి గుడివాడ టిడ్కో కాలనీలో కుటుంబంతో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. బాలుడిని రక్షించేందుకు తేజ తన ప్రాణాన్నే ప్రాణాన్ని పణంగా పెట్టాడు. బుధవారం తండ్రి పార్థివ దేహానికి అభం శుభం తెలియని చిన్నారి కొడుకు దహన సంస్కారాలు నిర్వహించడం చూపరులకు కంటతడి పెట్టించింది.

తేజ కుటుంబానికి న్యాయం చేయాలి

పరోపకారానికి పోయి ప్రాణాలు పోగొట్టుకున్న తేజ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నిండుప్రాణం బలైందని వైవీ మురళీకృష్ణ అన్నారు.

ఆ నాలుగు సంస్థలకు కట్టబెట్టేందుకే..!

(5వ పేజీ తరువాయి)

చాలా పెద్దది. రైల్వే పనులను కూడా చేపట్టిన సంస్థ. ఈ సంస్థ టర్నోవర్ కూడా ఎక్కువే. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి బ్రాంచ్ ఆఫీసుతో జీఎస్టీ రిజిస్ట్రేషన్ కూడా కలిగి ఉంది. ఈ సంస్థను తప్పిస్తే ఆ నాలుగు సంస్థలకు పోటీ అనేది లేకుండా టెండర్లను కట్టబెట్టేయవచ్చు అన్నది జిల్లా యంత్రాంగం ప్లాన్‌గా ఉన్నట్లు సమాచారం. ఈ సంస్థ ఎన్టీఆర్ జిల్లాలో జీఎస్టీ రిజిస్ట్రేషన్ కలిగి ఉండటంతో... మళ్లీ టెండర్లలో పాల్గొనాలంటే మార్చి 31వ తేదీ లోపు కృష్ణాజిల్లాలో స్థానికంగా జీఎస్టీని రిజిస్ట్రేషన్ చేసుకోవటం కుదరదు కాబట్టి.. ఈ పెద్ద సంస్థను టెండర్లలోనే పాల్గొనకుండా చేయొచ్చు అనేది వ్యూహంగా ఉందని తెల్సోంది.

గుడివాడలో కొవ్వొత్తుల ర్యాలీ


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నేతలు

గుడివాడ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు 28మందిని అతి దారుణంగా కాల్చి చంపడం దారుణమని జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ అన్నారు. బుధవారం స్థానిక జనసేన నియోజకవర్గ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడులను ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తున్నారన్నారు. మొన్న పుల్వామా, నేడు పహల్గాంలో ఉగ్రవాదులు రెచ్చిపోయి సైనికులను అమాయకులైన ప్రజలను అతి దారుణంగా హత్య చేశారన్నారు. ఉగ్రదాడిని జనసేన తీవ్రంగా ఖండిస్తోందన్నారు. రాత్రి స్థానిక పార్టీ కార్యాలయం నుంచి నెహ్రూచౌక్ సెంటర్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. **గుడ్లవల్లేరు** : పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు వదిలిన అమరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ బుధవారం రాత్రి గుడ్లవల్లేరులో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. తెలుగు బీజేపీ జిల్లాపార్టీ ఉపాధ్యక్షుడు అట్లూరి దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ఉగ్రదాడిలో అసువులు బాసిన వారికి నివాళులర్పించారు. అనంతరం జనసేన పిలుపు మేరకు కూటమి నాయకులు, కార్యకర్తలు అక్కడి నుండి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120,129, 140
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236
నెక్ కోడిగుడ్డు ధర	(100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 420

ఫెడరేషన్ కప్ ఏరోబిక్స్ జాతీయ పోటీలకు వీపీ సిద్ధార్థ విద్యార్థులు

మొగల్రాజపురం:సౌత్‌గోవా మడ్గావ్‌లో ఈ నెల 25 నుంచి 27 వరకు జరిగే ఏరోబిక్స్ జాతీయ చాంపియన్‌షిప్ ఫెడరేషన్ కప్ పోటీలకు వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు వెళుతున్నట్లు ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొంటున్న కె.శ్రీసరయు (8బి), ఎం. హిమేష్ (7ఎ), వి.మౌనిక(6డి)లను బుధవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పతకాలు సాధించి తిరిగి రావాలని ఆకాంక్షను వ్యక్తం చేస్తూ వీడ్కోలు పలికినట్లు తెలిపారు.

టెన్త్‌లో మెరిసిన రత్నాలు

అత్యుత్తమ ఫలితాలు సాధించి సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

మొగల్రాజపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మొగల్రాజపురం బోయపాటి శివరామకృష్ణయ్య మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. బుధవారం ఫలితాలు విడులైన తరువాత ప్రిన్సిపాల్ విలేకరుల సమావేశం నిర్వహించి ఫలితాల వివరాలు తెలిపారు. ఈ ఏడాది 118 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 104 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 88.2 శాతం ఉత్తీర్ణత శాతం ఉందన్నారు. ఎస్కే ఆయేషా 573 మార్కులతో పాఠశాల మొదటి స్థానం, కె. లలిత 572 మార్కులతో రెండో స్థానం, ఎస్. ప్రదీప్తి 569 మార్కులతో మూడో స్థానంలో నిలిచారని చెప్పారు. 500మార్కుల పైబడి 23 మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. అనంతరం ఎస్కే ఆయోషాతో పాటు అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. స్కూల్ టాపర్ అయిన ఎస్‌కే. ఆయేషా ఎయిర్ ఫోర్స్‌లో చేరాలనుకుంటున్నట్లు మనసులో మాట చెప్పింది. రెండో ర్యాంక్ సాధించిన లలిత తండ్రి ఏడాది క్రితం మరణించారు. తల్లి క్రషీ పాయింట్‌లో పనిచేస్తూ కుమార్తెను చదివిస్తోంది. నూజివీడు ఐఐఐటీలో సీటు సాధించడం తన ముందు ఉన్న లక్ష్యం అని మనసులో మాట చెప్పింది.



ఆయేషాను సత్కరిస్తున్న బీఎస్ఆర్‌కే పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు



ఎస్‌కే. ఆయేషా (573)



కె. లలిత (572)

పటమట: టెన్త్ పరీక్ష ఫలితాల్లో పటమట జీడీఈటీ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ (గోవిందరాజుల) విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని పాఠశాల హెచ్.ఎం మురాల శ్రీనివాసరావు తెలిపారు. జి.నేహప్రియ 590, పి.అంజలి 588, ఎం.మనోజ్‌కుమార్ 580 మార్కులు సాధించినట్లు తెలిపారు. స్కూల్ టాపర్ అయిన నేహప్రియ తండ్రి వెల్డింగ్ వర్కర్. భవిష్యత్‌లో సివిల్స్‌కు ప్రిపేర్ అవుతాయని నేహప్రియ మనసులో మాట చెప్పింది. రెండో ర్యాంక్ సాధించిన అంజలి తండ్రి పండ్ల వ్యాపారి. భవిష్యత్‌లో సాఫ్ట్‌వేర్ అవ్వాలనే లక్ష్యంగా చదువు కొనసాగిస్తానంది. మూడో ర్యాంకర్ మనోజ్‌కుమార్ తండ్రి సీటు కవర్ వర్క్ చేసుకుంటాడు. భవిష్యత్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు అవుతానన్నాడు. మొత్తం స్కూల్ నుంచి 242 మందిలో 230 మంది ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. 500 మార్కులకు పైగా 79 మంది విద్యార్థులకు వచ్చాయని, తెలుగులో ముగ్గురు, మ్యాథ్స్‌లో ఒకరు, సైన్స్‌లో నలుగు, సోషల్‌లో ఆరుగురు విద్యార్థులు నూటికి నూరు మార్కులు సాధించినట్లు చెప్పారు. ● పటమటలంక కొమ్మా సీతారామయ్య జడ్పీ ఉన్నత పాఠశాలలో (బాలికల) ఎం.నాగతేజశ్విని 570 మార్కులతో ప్రథమ స్థానం, పి.మధులిక హాసిని 564 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు హెచ్.ఎం మురళీకృష్ణా రెడ్డి తెలిపారు.



బి.నేహప్రియ 590



పి.అంజలి 588



ఎం.మనోజ్‌కుమార్ 580

పది ఫలితాల్లో 'మున్సిపల్' ప్రతిభ

కార్పొరేషన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మున్సిపల్ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం 2544 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 2016 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ పాఠశాలలు 79.24శాతం ఉత్తీర్ణతను సాధించాయి. నగరంలో మొత్తం 29 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో వీఎంఆర్ఆర్ ఎంసీహెచ్ స్కూలు, ఎండీ అలీపురం ఎంసీహెచ్ స్కూలు 100శాతం ఉత్తీర్ణతను తన ఖాతాలో వేసుకున్నాయి. వీఎంఆర్ఆర్ ఎంసీహెచ్ పాఠశాల నుంచి 44 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా అంతా ఉత్తీర్ణులయ్యారు. అదేవిధంగా ఎండీ అలీపురం ఎంసీహెచ్ఎస్ నుంచి 16 మందికి అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఏకేటీపీ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలకు చెందిన కె.ప్రణీత్‌కుమార్ 592 మార్కులతో టాపర్‌గా నిలిచాడు. తెలుగు, గణితం, సైన్స్‌లో 100కి 100 మార్కులు సాధించాడు. జీడీఈటీ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బి.నేహప్రియ 590, పి.అంజలి 588, ఎంమనోజ్‌కుమార్ 580 మార్కులు సాధించారు. వారిని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ కరపత్రాల ప్రచారం

ధర్నాచౌక్‌లో నేడు ధర్నా

భారతీనగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి జరగనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ నగర నాయకులు వీబీ రాజు కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ గురువారం జరగనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా గురునానక్ రోడ్డు లో భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ కరపత్రాల ప్రచారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు, కార్మికులు అప్పాల స్వామి, సింహాచలం, అప్పల నాయుడు, పాల్గొన్నారు.

రేగుల అనురాధ పాఠశాల అప్‌గ్రేడ్‌కు కృషి చేస్తా

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



పాఠశాల ఉపాధ్యాయులు, కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, పెద్దలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రేగుల అనురాధ నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల అప్ గ్రేడ్‌కు కృషి చేస్తానని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హామీ ఇచ్చారు. తూర్పు పరిధి ఏపీఐబీసీ కాలనీలోని రేగుల అనురాధ నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేగుల అనురాధ నగరపాలక సంస్థ పాఠశాలను పదో తరగతి వరకు పెంచడం వల్ల స్థానికంగా ఉండే అపార్టుమెంట్ వాసులకు, సమీప కాలనీల్లోని, ఆటోనగర్ పరిసర ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ విషయంపై విద్యాశాఖ మంత్రి లోకేష్, విద్యాశాఖ కమిషనర్ శశిధర్‌తో స్వయంగా మాట్లాడి ఈ సమస్యకు పరిష్కారం జరిగేలా చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, స్కూల్ హెచ్ఎం.సుజాత, టీడీపీ నేత గొల్లపూడి నాగేశ్వరరావు, కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

లయోలాలో ప్రపంచ పుస్తక దినోత్సవం

భారతీనగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో ఐక్యూఏసీ డైరెక్టర్ ఫాదర్ డాక్టర్ బి.జోజిరెడ్డి ఆధ్వర్యంలో బుధ వారం ప్రపంచ పుస్తక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంతో పాటు ఆంగ్ల రచయిత షేక్స్పియర్ జయంతి ఆంగ్లభాషా దినోత్సవం కావడంతో షేక్స్పియర్ రచనలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.



పిప్పిటెల్లిని సన్మానిస్తున్న ఫాదర్ డాక్టర్ జోజిరెడ్డి తదితరులు

ముఖ్య అతిథిగా ఇటలీలోని ఫ్యూచర్లీ కంపెనీ సీఈవో ఎలిసా పిప్పిటెల్లి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ నేటి ప్రపంచంలో ఆంగ్ల భాష ప్రాముఖ్యతను వివరించారు. విద్యా, వృత్తి పరమైన విజయానికి బలమైన కమ్యూనికేషన్‌గా ఆంగ్ల భాష ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ ఓ.మహేష్, విభాగాధిపతులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆటోనగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ సెక్షన్ పరిధిలోని 11కేవీ వంద అడుగుల రోడ్డు ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు కనకదుర్గ కాలనీ, పంటకాలువ రోడ్డు, హైస్కూల్ రోడ్డు, రైతుబాజర్ రోడ్డు, వంద అడుగుల రోడ్డు, మారుతీకాలనీ, పోలీస్‌స్టేషన్ రోడ్డుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని ఆటోనగర్ ఏఈ ఏడుకొండలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

రవీంద్ర భారతి విద్యార్థుల విజయభేరి



ఎన్.శనన్య 597

విజయవాడ: పదో తరగతి పరీక్ష ఫలితాలలో విజయవాడ రవీంద్ర భారతి విద్యాసంస్థలు 2024-25 విద్యా సంవత్సరం విజయభేరీ మోగించింది. పాఠశాల విద్యార్థిని ఎన్.శనన్య 597/600 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానం, రాష్ట్రంలో మూడో ర్యాంక్ సాధించింది. అదే విధంగా 590 పైన 13 మంది, 580 పైన 66 మంది విద్యార్థులు , 550పైన 280 విద్యార్థులు విజయం సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల ఛైర్మన్ శ్రీ వీరమాచనేని వంశీకృష్ణ, పాఠశాల అకడమిక్ డైరెక్టర్ వీరమాచనేని శాంతి అభినందించారు.

ఉగ్రదాడుల పట్ల ఐఏఎల్ ఖండన

విజయవాడ లీగల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడుల పట్ల ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) తీవ్రంగా ఖండిస్తున్నట్లు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభం శుభం తెలియని పర్యాటకుల మీద, విదేశీయుల మీద మారణకాండ జరపడం అంటే దేశ రక్షణ వ్యవస్థ ఎంత నిర్లక్ష్యంగా వుందో అర్థం అవుతోందని పేర్కొన్నారు. ఉగ్రవాదుల వెనుక ఎంతటి కుట్రలు వున్నా వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నకిలీ యాప్‌తో రూ.1.50 లక్షల టోకరా

అజిత్‌సింగ్‌నగర్: వాట్సప్ గ్రూప్‌ల్లో వచ్చిన నకిలీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న ఓ వ్యక్తి ఖాతా నుంచి నగదు కాజేసిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. కృష్ణాహోటల్ సెంటర్‌కు చెందిన పి. చినబాబు వాట్సప్ గ్రూప్‌లో వచ్చిన పీఎం కిసాన్ యోజన పేరుతో ఉన్న యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అనంతరం అప్లికేషన్ పూర్తి చేసే క్రమంలో ఫోన్‌కు ఓటీపీ రాగా నెంబరును నమోదు చేశాడు. అనంతరం తన ఖాతా నుంచి రూ. 1.50 లక్ష విత్‌డ్రా అయినట్లుగా మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యారు చేశాడు.

దుర్గగుడిలో అన్నప్రసాద వితరణకు విరాళాలు

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో అన్నవితరణకు నగరానికి చెందిన దాత ఎల్.నారాయణ బుధవారం రూ.1,01,116లు విరాళం అందించారు. ఒంగోలుకు చెందిన డి.శివకృష్ణ అన్న వితరణకు లక్ష రూపాయలు విరాళం అందించారు. దాతలకు, కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. లడ్డూ ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందించారు. .

నలందలో జేఈఈ మెయిన్స్ టాపర్లకు సత్కారం



ఇషిత.బి



వై. అనిరుధ్



వెంకట సత్య శంకర వాసుదేవరావు



సత్యజిత్. జి



డీవీఎస్ కార్తీక్

గవర్నర్‌పేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన నలంద విద్యానికేతన్ విద్యార్థులను బుధవారం క్రౌన్ ది టాలెంట్ పేరుతో సెకండరీ క్యాంపస్‌లో ఘనంగా సత్కరించి పురస్కారాలు అందజేశారు. నలంద విద్యానికేతన్‌లో సెకండరీ నుంచి సీనియర్ సెకండరీ వరకు చదివన ఇషిత. బి 98.49 శాతం సాధించి గుర్తింపు పొందారని ప్రిన్సిపాల్ మాదల పద్మజ తెలిపారు. నలంద ఫౌండేషన్ విద్య నుంచి సెకండరీ విద్య వరకు చదివిన విద్యార్థులు సత్యజిత్.జి (99.83) శాతం, కె. వెంకట సత్య శంకర వాసుదేవ (98.96) శాతం, డీవీఎస్ కార్తీక్ (97.88) శాతం, వై. అనిరుధ్ (94.89) శాతం సాధించి ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీఐసీ-కెఎల్ స్టార్టప్ ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వల్లభనేని రమన్‌కాంత్ విజేతందరినీ ప్రత్యేకంగా అభినందించారు.

నలంద విద్యానికేతన్‌లో మైక్రోలెవెల్ లెసన్ ప్లానింగ్, సెల్ఫ్ లెర్నింగ్ మెథడాలజీ ద్వారా విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించడాన్ని ప్రశంసించారు. నలంద విద్యాసంస్థల ఛైర్మన్ ఏ. విజయబాబు విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ వారి భవిష్యత్తు విజయాలు బాగుండాలని ఆకాంక్షించారు.

కృష్ణలంక జాతీయ రహదారిపై కారు బీభత్సం

- డివైడర్‌పైకి దూసుకెళ్లి కరెంట్ స్తంభాన్ని ఢీకొన్న కారు
- మద్యం మత్తులో డ్రైవర్



వన్‌టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కారు డ్రైవర్ మద్యం సేవించి కృష్ణలంక జాతీయ రహదారిపై డివైడర్ మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బీభత్సం సృష్టించాడు. స్థానికులు, ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాఘవయ్య పార్క్ నుంచి వారధి వైపు వెళుతున్న ఓ కారు డ్రైవర్ మద్యం సేవించి అతి వేగంగా ప్రయాణించి డివైడర్‌పైకి దూసుకెళ్లి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. సమాచారం తెలుసుకున్న కృష్ణలంక ట్రాఫిక్ ఎస్ఐ తన సిబ్బందితో ఘటనా ప్రాంతానికి వెళ్లి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పరీక్షించగా మద్యం సేవించినట్లు గుర్తించి అతనితోపాటు కారును కూడా స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అతని పై కేసు నమోదు చేశారు. ట్రాఫిక్ స్తంభించిపోవటంతో ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ర్యాలీ

సత్యనారాయణపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): హిందూ జేఏసీ ఆధ్వర్యంలో సత్యనారాయణపురం బీఆర్‌టీఎస్ రోడ్డ ఆదిశంకరాచార్య సర్కిల్ వద్ద బుధవారం కాగడాలతో నిరసన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శైవక్షేత్రపీఠాధిపతి శివస్వామి మాట్లాడుతూ కాశ్మీర్ పహల్గావ్‌లో ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది హిందువులపైన జరిగిన దాడి కాదని భారతీయుడి పైన జరిగిన దాడి అన్నారు. ర్యాలీ బీఆర్‌టీఎస్ రోడ్డు నుంచి శారదాకాలేజి జంక్షన్ వరకూ సాగింది. వేముల హజరత్తయ్యగుప్తా, వీహెచ్‌పీ నాయకులు శివప్రసాద్, రాఘవరాజు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్..

వన్‌టౌన్ : ఉగ్రవాదుల దాడి పిరికి పందల చర్య అని పలు రాజకీయ పార్టీల నాయకులున్నారు. బుధవారం సాయంత్రం కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లోని గాంధీ విగ్రహం వద్ద సిటీ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ప్రదర్శన నిర్వహించారు. నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, గురునాథం, అన్సారీ, జోసఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులకు సమాధానం చెప్పి తీరుతాం

● ఎమ్మెల్యే సుజనా చౌదరి

విద్యాధరపురం: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం లో 28 మందిని దారుణంగా పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులకు సరైన సమాధానం చెప్పి తీరుతామని ఎమ్మెల్యే సుజనా చౌదరి బుధవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. ఉగ్రవాదులు ఇలాంటి దాడులతో భారతదేశ సుస్థిరతను, ఐక్యతను దెబ్బతీయలేరన్నారు. దేశ రక్షణకు నిరంతరం పాటుపడే ప్రధాన మంత్రి మోదీ నాయకత్వంలో ఉగ్రవాదులకు కచ్చితంగా సమాధానం చెప్పి తీరుతామన్నారు. ఈ దా డిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కశ్మీర్ నరమేధం కారకుల్ని కఠినంగా శిక్షించాలి

● ఏబీవీపీ ఆధ్వర్యంలో ర్యాలీ

గవర్నర్‌పేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాం టూరిస్ట్ స్పాట్‌లో జరిగిన ఉగ్రవాదుల నరమేధంపై సమగ్ర విచార ణ జరపాలని, ఇందుకు కారణమైన ఉగ్ర సంస్థల నేతల్ని కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి యాగంటి వెంకట గోపీ డి మాండ్ చేశారు. పహల్గాం సంఘటనను నిరసిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలోని మొగల్‌రాజ్‌పురం వీబీ సిద్ధార్థ కళాశాల నుంచి ఎంజీ రోడ్డులోని స్టేడియం వరకు నిరసన ర్యాలీ జరిగింది. ఈసందర్భంగా వెంకట గోపీ మాట్లాడుతూ ఇలాంటి సం ఘటనలు జరగడం దురదృష్టకరమని, ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. దేశం బలంగా ఉందని, చెడగొట్టేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. భారతీయులది ఒక ప్రాణం తీస్తే ఉగ్రవాదుల 10 ప్రాణాలు తీయడానికి దేశం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికైనా కు హనా మేధావులు పద్ధతి మార్చుకోవాలని, విదేశాలకు వత్తాసు పలకడం ఆపాలన్నారు. కులమతాలకు అతీతంగా దేశం కోసం ప్రజలం తా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ సంఘటనకు స్పందించని వారంతా ఉగ్రవాదులతో సమానమేనన్నారు. ఏబీవీపీ రాష్ట్ర కార్య సమితి సభ్యులు దుర్గారావు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



పహల్గామ్ ఉగ్రదాడిని ఖండించిన 'ఐలూ'

విజయవాడ లీగల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జమ్ము కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన దారుణమైన పిరికి పందల ఉగ్రదాడిని అఖిల భార త న్యాయవాదుల సంఘం (ఏఐఎల్‌యూ) బుధవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఐలూ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటన విడుదల చే శారు. దాడిలో అనేక మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారన్నారు. నిరాయుధులైన పౌ రులపై జరిగిన ఈ దారుణమైన హింసాత్మక చర్య మానవత్వానికి అవమానకరం, ప్రాథమిక మానవ హక్కుల ఉల్లంఘనని తెలిపారు. మృతుల కుటుంబాలకు సంతాపాన్ని తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. శాంతి, న్యాయ విలువలను కాపాడటానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నట్టు సుంకర తెలిపారు.

ఉరేసుకొని విద్యార్థిని ఆత్మహత్య

పెనమలూరు : ఇంజనీరింగ్‌లో ఒక సబ్జెక్టు ఫెయిలయ్యాననే మనస్తాపంతో హాస్టల్‌లో ఉరేసుకొని విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్ మియాపూర్‌కు చెందిన యార్లగడ్డ శ్రీనివాసరావు కుమార్తె ఖ్యాతిశ్రీ (22) కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో 3వ సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటోంది. ఇటీవల విడుదలైన సెమిస్టర్ ఫలితాల్లో ఒక సబ్జెక్టులో ఫెయిలైంది. దీంతో కొన్ని రోజులుగా డల్‌గా ఉంటోంది. మంగళవారం తన కుమార్తెతో మాట్లాడదామని తల్లి శివనాగమల్లీశ్వరి ఫోన్ చేయగా సమాధానం లేదు. అనుమానంతో తల్లి హాస్టల్ వార్డెన్‌కు ఫోన్ చేసి చూడమని చెప్పగా వార్డెన్ వెళ్లి చూడగా ఉరేసుకున్నట్టు గమనించి పోలీసులకు ఫోన్ చేశారు. వార్డెన్, స్టూడెంట్స్ ఆమెను కిందికి దించి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. హైదరాబాద్ నుంచి వచ్చిన తల్లిదండ్రులు మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు.



పార్కును సందర్శిస్తున్న ఏడీసీ ఎండీ లక్ష్మీ పార్థసారథి

అమరావతిలో బయోడైవర్సిటీ పార్కులు!

ఢిల్లీలోని బయోడైవర్శిటీ పార్కులు సందర్శించిన ఏడీసీఎల్ సీఎండీ

ఆంధ్రజ్యోతి, విజయవాడ: అమరావతిలోనూ ఢిల్లీ తరహాలో బయోడైవర్సిటీ పార్కులను ఏర్పాటు చేయాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్) భావిస్తోంది. ఢిల్లీలోని యమునా బయోడైవర్సిటీ పార్కును బుధవారం అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) సీఎండీ లక్ష్మీపార్థసారథి సందర్శించారు. ఢిల్లీలో యమునా, ఆరావళి బయో డైవర్సిటీ పార్కులను స్థాపించిన ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ సీఆర్ బాబుతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అక్కడ అభివృద్ధి చేసిన ఉద్యానవనాలను సందర్శించారు. సహజసిద్ధంగా అక్కడ ఉత్పత్తి చేస్తున్న మొక్కలను పరిశీలించారు. రాజధానిలో అమరావతి హరిత ప్రాజెక్టుల అభివృద్ధిలో సహాయం అందించడానికి ఆరావళి బయో డైవర్సిటీ వారు అంగీకరించారు. ఈ సందర్భంగా సీఎండీ లక్ష్మీ పార్థసారథి అక్కడ తీపి నారింజ మొక్కను నాటారు. బయోడైవర్సిటీ పార్కుల అభివృద్ధిలో ప్రొఫెసర్ బాబు బృందం చేపట్టిన విధానాలను ఏడీసీ ప్రతినిధులను వివరించారు. ఈ పర్యటనలో ఏడీసీ హార్టికల్చర్ విభాగాధిపతి వీఎస్ ధర్మజ కూడా ఉన్నారు.

సంపద దృష్టికి అడుగులు పడినట్టే..!

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి

మైలవరం రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తడి, పొడిచెత్తను వేరు చేయగలిగితే చెత్త నుంచి సంపద సృష్టికి అడుగులు పడినట్టేనని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. బుధవారం మైలవరంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రా న్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ కోరిక మేరకు చెత్త నుంచి సంపద తయారీ కేం ద్రాన్ని సందర్శించానన్నారు. గ్రామపంచాయతీలో చెత్త సేకరణ ఎలా జరుగుతుందని పరిశీలించడంతోపాటు సేకరించిన చెత్తను ఎలా ప్రాసెస్ చేస్తున్నారు, తడిచెత్తను ఎలా కంపోస్టుగా మారుస్తున్నారు, పొడిచెత్త నుంచి వచ్చే ప్లాస్టిక్, క్లాత్ ఎలా రీసైకిల్ చేస్తున్నారో పరిశీలించానన్నారు. వెయింగ్ చెకింగ్‌లో, చెత్తను ప్రతిరోజు పీఆర్ వన్ యాప్‌లో అప్లోడ్ చేయడంలో ఖచ్చితత్వం పాటించాలని అధికారులకు తెలిపారు. సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర - స్వ చ్ఛాంధ్రలో భాగంగా 3వ శనివారం ప్రజలను మమేకం చేస్తున్నారన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో రూ.800 కోట్లు స్వచ్ఛాంధ్రకు కేటాయించడం చంద్రబాబుకి స్వచ్ఛతపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గత ప్రభుత్వం పట్టణాల్లో వదిలివెళ్లిన 85 లక్షల టన్నుల చెత్తను ఎలా క్లియ ర్ చేస్తున్నామో, గ్రామాల్లో పేరుకుపోయిన చె త్తను త్వరలోనే డ్రోన్ల ద్వారా గుర్తించి క్లియర్ చేసేందుకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఆదేశించారన్నారు. వచ్చే 5 నెలల్లో గ్రామాల్లో చెత్తకు స్వాగతం పలికే పరిస్థితిని మార్చటానికి కృషిచేస్తామన్నారు. డీఎల్పీవో రాఘవన్, పంచాయ తీ కార్యదర్శి ఎండీ రఫీ, టీడీపీ నేతలు విజయబాబు, లంకా లితీష్, ఆసుపత్రి అభివృద్ధి కమి టీ చైర్మన్ చారుగొండ్ల ప్రసాద్, మల్లెల రాధాకృష్ణ, దూరు బాలకృష్ణ, వెంకట్రావు పాల్గొన్నారు.



కాలిన కంకులను చూపిస్తున్న రైతు తిరుపతిరావు

15 ఎకరాల్లో మొక్కజొన్న బుగ్గిపాలు

● రూ.3 లక్షల వరకు పంట నష్టం

● భోరుమన్న అన్నదాతలు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఎండ వేడిమికి ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో మంటలు అంటుకొని కొటికలపూడి గ్రామంలో సు మారు 15 ఎకరాల మొక్కజొ న్నపంట అగ్నికి ఆహుతైంది. సుమారు రూ.3లక్షల నష్టం ఏర్పడింది. గ్రామానికి చెంది న రైతులు బండి తిరుపతిరావు, బోళ్ల మాణిక్యాలరావు, నంబూరి అంజనేయులు, నంబూరికి చెందిన మొక్కజొన్న పంట కాలిపోయింది. కాలిన కంకులు చూపిస్తూ రైతులు బోరుమన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు. కంచికచర్ల అగ్నిమాపకశా ఖ అధికారులు మంటలను అదుపుచేశారు. విద్యుత్ షార్ట్ స ర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందని రైతులు చెబుతుండగా ఇబ్రహీంపట్నం విద్యుత్ శాఖ ఏఈ వెంకన్న మాత్రం షార్ట్ సర్క్యూ ట్ కాదని లైన్స్ ట్రాన్స్‌ఫార్మర్స్ అన్నీ బాగున్నాయన్నారు.

సామాన్యులకు 'మరుగు' లేదా!

» ప్రజలకు శౌచాలయం లేకుండా సమాచార కమిషనరేట్ నిర్వహణపై హైకోర్టు విస్మయం

» పరిశీలించి పరిష్కరించాలని సీఎస్‌కు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలయంలో సామాన్య ప్రజల కోసం మరుగుదొడ్డి లేకపోవడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. మరుగుదొడ్డి లేకుండా కార్యాలయం నిర్వహించడంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఈ వ్యవహారాన్ని వ్యక్తిగతంగా పరిశీలించి పరిష్కారం కనుగొనాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను ఆదేశించింది. సమస్య పరిష్కారం కాకుంటే ఆన్‌లైన్ ద్వారా సీఎస్ హాజరుకు ఆదేశిస్తామని హెచ్చరించింది. అద్దె భవనంలో కార్యాలయం కొనసాగుతున్న నేపథ్యంలో మరుగుదొడ్డి ఏర్పాటు వీలుకాకుంటే తక్షణం కార్యాలయాన్ని మరో భవనానికి మార్చాలని సూచించింది. విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలయంలో కనీస మౌలికవసతులు కల్పించడంతో పాటు కార్యాలయాన్ని సందర్శించే సాధారణ ప్రజానీకం కోసం మరుగుదొడ్లు ఏర్పాటు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ సమాచార కమిషన్‌ను ఆదేశించాలని కోరుతూ న్యాయవాది బి.క్రాంతికుమార్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది అభినవ్ కృష్ణ వాదనలు వినిపిస్తూ.... కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులకు తప్ప సామాన్య ప్రజలకు మరుగుదొడ్లు లేవన్నారు. మరుగుదొడ్డి ఏర్పాటు విషయంలో భవన యజమానితో వివాదం కొనసాగుతోందన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి స్పందిస్తూ.. భవన యాజమానితో వివాదం వాస్తవమేనన్నారు. పూర్తి వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. ధర్మాసనం స్పందిస్తూ... మరుగుదొడ్డి ఏర్పాటుకు అనుమతులు లేకుంటే యజమాని ఏమి చేయగలరని ప్రశ్నించింది.

వేసవి సెలవుల్లో ఆ మండలాల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తాం

» హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం.. పిల్ పరిష్కారం

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కరవు ప్రభావిత మండలాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలు, జూనియర్ కళాశాలల్లో ఈ వేసవి సెలవుల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం హైకోర్టుకు నివేదించింది. కేంద్ర ప్రభుత్వ నిధుల విడుదలతో సంబంధం లేకుండా పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు విద్యాశాఖ తరఫు ప్రభుత్వ న్యాయవాది గుర్రం రామచంద్రరావు కోర్టుకు తెలిపారు. ఈ వివరాలు నమోదు చేసిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం పిల్‌ను పరిష్కరించింది. వేసవి సెలవుల్లో రాష్ట్రంలోని కరువు ప్రభావిత మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కాకినాడకు చెందిన హెల్ప్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ కీతినీడి అఖిల్ శ్రీ గురు తేజ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు.

రాజకీయ వ్యవస్థ ప్రజలను దోచుకోవడానికి కాదు!

» పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం ఉండాలి: పీవీ రమేశ్

విజయవాడ (గాంధీనగర్), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాజకీయ వ్యవస్థ ప్రజలకు సేవ చేయడానికి మాత్రమే గాని వారిని దోచుకునేందుకు, ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించేందుకు కాదని సీనియర్ ఐఏఎస్ అధికారి పీవీ.రమేశ్ తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజల భాగ్యస్వామ్యం కీలకమని స్పష్టంచేశారు. జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో "ఎన్నికల సంస్కరణల"పై విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాజకీయాలు కుల, మత, ప్రాంత, భాష ప్రాతిపదికన జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం ఉండాలని సూచించారు.

ఎయిడ్స్ కట్టడిపై రాష్ట్ర కౌన్సిల్ ఏర్పాటు

» చైర్మన్‌గా సీఎస్, 18 మంది సభ్యులు

» ప్రతిపాదనలకు సీఎం చంద్రబాబు ఆమోదం

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎయిడ్స్ వ్యాధిని కట్టడి చేయడంతో పాటు వ్యాధి నివారణకు ప్రభుత్వం నడుంబిగించింది. సంస్థాగతంగా యంత్రాంగాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించింది. దీని కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా, 18 మంది సభ్యులతో కూడిన 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌన్సిల్'ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఆరోగ్యశాఖ పంపించిన ప్రతిపాదనలను సీఎం చంద్రబాబు బుధవారం ఆమోదించారు. ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలు పర్యవేక్షించడం, విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంతో పాటు ఫలితాలను అంచనా వేయడం ద్వారా ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కొత్తగా ఏర్పాటైన ఉన్నత స్థాయి మండలి ఏపీఎస్ఏసీ కృషి చేస్తుంది. వనరుల సమీకరణ, శాఖల మధ్య సమన్వయం, ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల పటిష్ఠ అమలు బాధ్యతను ఈ మండలికి ప్రభుత్వం అప్పగించింది. విశేషాధికారాలతో ఏర్పాటు కానున్న ఈ మండలి రాష్ట్రంలో ఎయిడ్స్ నియంత్రణ చర్యలు పటిష్ఠమైన అమలుకు అవసరమైన నాయకత్వాన్ని అందిస్తుంది. ఎయిడ్స్‌పై పోరాటానికి వివిధ ప్రభుత్వ శాఖలకు అందుబాటులో ఉన్న ఆర్థిక వనరులు, మౌలిక సదుపాయాల్ని సమన్వయంతో వినియోగించే వీలు కల్పిస్తుంది.

సీహెచ్‌వోలు తక్షణం ఆందోళనలు విరమించాలి

» ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తమ వేతనాలు పెంచాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌వోలు) చేపట్టిన ఆందోళనను తక్షణమే విరమించుకోవాలని ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ కోరారు. దేశంలోనే అత్యధికంగా ఏపీలోనే వారికి వేతనాలు ఇస్తున్నామన్నారు. సర్వీసు నిబంధనల్ని ఉల్లంఘించి గ్రామాల్లో వైద్య సేవలకు విఘాతం కల్పించవద్దని అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ నియమ నిబంధనలు, ఆర్థిక వనరుల లభ్యతను దృష్టిలో పెట్టుకుని సీహెచ్‌వోల డిమాండ్ల పరిశీలనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో సీహెచ్‌వోలకు నెలకు రూ. 25 వేలు వేతనంతో పాటు పనితీరు ఆధారంగా గరిష్ఠంగా మరో రూ. 15 వేలు ప్రోత్సాహకంగా ప్రభుత్వం చెల్లిస్తోందని చెప్పారు. ఈ విధంగా వారికి నెలకు కనిష్ఠంగా రూ. 30,000, గరిష్ఠంగా రూ. 40 వేలు వరకూ చెల్లిస్తున్నామని తెలిపారు.

విద్యాహక్కు చట్టం అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానం

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టంలో భాగంగా ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం అడ్మిషన్లు కల్పించే ప్రక్రియ ప్రారంభించినట్టు సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 28 నుంచి మే 15 వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

20న అంగన్వాడీల సమ్మె

- వేతనాల పెంపు, బాలసంజీవని యాప్‌లో మార్పులకు డిమాండ్
- సెంటర్ల నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలనీ విజ్ఞప్తి

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలకు వేతనాల పెంపు, మినీలను మెయిన్ అంగన్వాడీలుగా మార్చే జీవో వెంటనే ఇవ్వాలని, బాల సంజీవని యాప్‌లో మార్పులు చేయాలని, అంగన్వాడీ సెంటర్ల నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలనే డిమాండ్లతో మే 20న రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున సమ్మె చేయనున్నట్లు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బేబిరాణి, సుబ్బరావమ్మ తెలిపారు. విజయవాడలో నిర్వహించిన యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్లు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాల సంజీవని యాప్‌లో 7 నెలల నుంచి 3 సంవత్సరాల లోపు వయసున్న పిల్లలకు ఫొటో క్యాప్చర్ తీసేయాలని, ప్రస్కూల్ పిల్లలకు ఫొటో ఆధారంగా రేషన్ ఇవ్వాలనే నిబంధనలు తొలగించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్టు తెలిపారు. అంగన్వాడీ వర్కర్లకు, మినీ వర్కర్లకు ఫేస్ యాప్ ఇన్, ఔట్ లొకేషన్ తీసివేయాలని, లబ్ధిదారులకు అందిస్తున్న సరుకులన్నీ ఒకేసారి వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సెంటర్ నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలని, వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరకు అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించామన్నారు. కార్మిక కోడ్స్, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు మే 20న దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మె చేయాలని నిర్ణయించాయని, ఆ సమ్మెలో అంగన్వాడీలు పాల్గొని జయప్రదం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.


ప్రధాని సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

ఐదు లక్షల మందితో 2న ప్రధాని సభ

- అందుకు తగ్గట్లుగా అమరావతిలో పకడ్బందీ ఏర్పాట్లు
- పోలీస్ అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నారాయణ

గుంటూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభం సందర్భంగా వచ్చే నెల 2న జరిగే ప్రధాని నరేంద్ర మోదీ సభకు 5 లక్షల మంది హాజరుకానున్నారని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. అమరావతిలో జరిగే ఆ సభకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రధాని రోడ్ షో, సభ ఏర్పాట్లను మంత్రి బుధవారం పరిశీలించారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ సతీష్ కుమార్‌తో కలిసి రెండుగంటలపాటు రాజధానిలోని పలు ప్రాంతాల్లో మంత్రి విస్తృతంగా పర్యటించారు. ప్రధాని పాల్గొనే సభా ప్రాంగణానికి చేరుకునేందుకు అవసరమైన రోడ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మే 2న మధ్యాహ్నం 3 గంటలకు ప్రధాని మోదీ గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి అమరావతికి వచ్చి 1.1 కిలోమీటర్ల మేర రోడ్ షోలో పాల్గొంటారని, అనంతరం వేదిక వద్దకు చేరుకుంటారని వెల్లడించారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సభలో ఉంటారని చెప్పారు. ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 5 లక్షల మంది ప్రజలు వస్తారని అంచనా వేస్తున్నామని, దానికి తగినట్లుగా శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల రాకపోకలకు మొత్తం 8 రోడ్లను, 11 పార్కింగ్ ప్రదేశాలను గుర్తించామని తెలిపారు. ప్రజలు సభ వద్దకు చేరుకునేందుకు వీలుగా ఈ-11, ఈ-13, ఈ-15 రోడ్లతో పాటు సీడ్ యాక్సెస్ రోడ్డు నుంచి రాకపోకలు జరుగుతాయని తెలిపారు. ఈ రోడ్లకు తక్షణం మరమ్మతులు చేసి అభివృద్ధి చేయాలని సీఆర్డీఏను ఆదేశించామన్నారు. మంగళగిరి నుంచి రెండు రోడ్లు, తాడేపల్లి నుంచి ఒకటి, వెస్ట్ బైపాస్ నుంచి ఒకటి, ప్రకాశం బ్యారేజి నుంచి రెండు, తాడికొండ నుంచి ఒకటి, హరిశ్చంద్రాపురం నుంచి ఒక రోడ్డు ద్వారా సభా వేదిక వద్దకు చేరుకోవచ్చని తెలిపారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ జామ్‌కు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

మద్యం నియంత్రణ, డీఅడిక్షన్ సెంటర్లపై విస్తృత ప్రచారం కల్పించాలి

- ఇప్పటివరకు ఏవైనా కార్యక్రమాలు చేపట్టారా?
- పూర్తి వివరాలతో కౌంటర్ వేయండి: హైకోర్టు

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్యం నియంత్రణ, డీఅడిక్షన్ సెంటర్ల పనితీరుపై విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరముందని హైకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. మద్యం డీఅడిక్షన్ సెంటర్లపై ప్రజల్లో అవగాహన లేదని పేర్కొంది. మద్యం సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాలు, డీఅడిక్షన్ సెంటర్లపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏ చర్యలు తీసుకుంటున్నారు? ఎలాంటి ప్రచార కార్యక్రమాలు చేపట్టారు? ప్రచార కార్యక్రమాల కోసం బడ్జెట్ ఏమైనా కేటాయించారా? పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎక్సైజ్, ఆరోగ్య శాఖల ముఖ్య కార్యదర్శులు, ఎక్సైజ్ శాఖ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. నెలలో ఒక వ్యక్తికి విక్రయించే గరిష్ఠ మద్యం బాటిళ్ల సంఖ్యను నిర్ణయించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలన్న పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చింది. ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, అలాంటి ఉత్తర్వులు జారీ చేయలేమని పేర్కొంది. డీఅడిక్షన్ సెంటర్ల పనితీరు, రోగులకు అందుతున్న చికిత్సను నిరంతరం పర్యవేక్షించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ విశాఖకు చెందిన డాక్టర్ ఎస్.షిరిన్ రెహ్మాన్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. నెలలో ఒక వ్యక్తికి విక్రయించే గరిష్ఠ మద్యం బాటిళ్ల సంఖ్యను నిర్ణయించేలా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 21 ఏళ్ల లోపువారికి మద్యం విక్రయించకుండా నిలువరించేందుకు ఆధార్ లింక్ చేసి మద్యం విక్రయించేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. ఈ పిల్ బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పిటిషనర్ తరపున న్యాయవాది వి.రఘు వాదనలు వినిపించారు. రాష్ట్రంలో డీఅడిక్షన్ సెంటర్ల నిర్వహణ సరిగా ఉండటం లేదని, అందులో ఎంతమంది చికిత్స పొందారనే వివరాలు ఏపీ అధికారుల వద్ద లేవని అన్నారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. రాష్ట్ర ప్రభుత్వాలకు మద్యం విక్రయాల ద్వారా అత్యధిక రెవెన్యూ వస్తుందని, ఈ నేపథ్యంలో అమ్మకాలను నియంత్రించే చర్యలు ప్రభుత్వాలు తీసుకోవని తెలిపింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

చిత్రజ్యోతి
SINCE 1965

కంటెంట్ అదిరిపోయింది


హరీశ్ శంకర్

మలయాళంలో ఇటీవలె విడుదలై సూపర్‌హిట్ సాధించిన చిత్రం 'జింఖానా'. 'ప్రేమలు' ఫేమ్ నస్లెన్ హీరోగా ఖలీద్ రెహ్మాన్ తెరకెక్కించారు. తెలుగులో శ్రీలక్ష్మీ నరహింస మూవీమేకర్స్ విడుదల చేస్తోంది. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శకుడు హరీష్ శంకర్ మాట్లాడుతూ "ఈ సినిమా కంటెంట్ అదిరిపోయింది. సినిమా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. "ప్రేమలు' సినిమాకు తెలుగు ప్రేక్షకులు ఇచ్చిన సపోర్ట్ మర్చిపోలేను. ఈ సినిమానూ ఆదరిస్తారనే నమ్మకం ఉంది" అని చెప్పారు. "క్రీడా నేపథ్యంలో సాగే ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది" అని దర్శకుడు ఖలీల్ రెహ్మాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్శకులు అనుదీప్ కేవీ, సాగర్.కే. చంద్ర, సుజీత్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అందరినీ అలరిస్తుంది



నాగమహేశ్, రూపాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో రమేశ్ అనెగౌని తెరకెక్కించనున్న సినిమా 'కర్మణి'. మంజుల చవన్, రమేశ్ గౌడ్ అనెగౌని నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమాను ప్రారంభించారు. సీనియర్ నటుడు నాగమహేశ్ క్లాప్ కొట్టగా, నిర్మాత మంజుల చవన్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు రమేశ్ మాట్లాడుతూ "ఇది విభిన్నమైన కథతో తెరకెక్కుతున్న చిత్రం. అందరినీ అలరిస్తుంది" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: వి.నాగిరెడ్డి, కెమెరామెన్: జగదీష్ కొమరి, సంగీతం: జాన్ భూషన్

ఆ హీరో.. ఈ హీరోయిన్... వద్దే వద్దు!




కశ్మీర్‌లోని పహల్గామ్‌లో టూరిస్టులపై కొంతమంది తీవ్రవాదులు అమానుషంగా దాడి జరిపిన నేపథ్యంలో ప్రస్తుతం రెండు చిత్రాలపై సోషల్ మీడియాలో తీవ్రమైన చర్చ జరుగుతోంది. అందులో ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'ఫౌజీ' చిత్రం ఒకటైతే, మరొకటి వాణీ కపూర్ నటిస్తున్న హిందీ చిత్రం 'అబిర్ గులాల్'. ఫౌజీ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న ఇమాన్వీ, 'అబిర్ గులాల్'లో హీరోగా నటిస్తున్న ఫవాద్ ఖాన్... ఇద్దరూ పాకిస్థాన్ వారు కావడమే ఈ చర్చకు కారణం. వీరిద్దరినీ సినిమాల నుంచి తొలగించాలనీ, భారతీయ చలన చిత్ర పరిశ్రమలో ఏ ఒక్క పాకిస్థానీ నటుడికి కానీ నటికి కానీ అవకాశం ఇవ్వకూడదని వాదిస్తున్నారు. దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పాకిస్థాన్‌కు చెందిన నటీనటులను భారతీయ సినిమాల్లో ప్రోత్సహించడం సరికాదని నెటిజన్లు అంటున్నారు. ఇమాన్వీ కరాచీలో పుట్టారు. ఆమె తండ్రి ఇక్బాల్ ఒకప్పుడు పాకిస్థాన్ మిలటరీలో ఉన్నత అధికారిగా పని చేసిన విషయాన్ని నెటిజన్లు ప్రస్తావిస్తూ ఇమాన్వీని 'ఫౌజీ' చిత్రం నుంచి తొలగించాల్సిందే అని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఇమాన్వీ తన కుటుంబంతో కలసి ప్రస్తుతం అమెరికాలో ఉంటోందనీ, కళాకారులను వారి జాతీయత ఆధారంగా విమర్శించడం తగదని సోషల్ మీడియాలోనే మరో వర్గం వాదిస్తోంది. ఇక ఫవాద్ ఖాన్ నటించిన 'అబిర్ గులాల్' చిత్రం షూటింగ్ దాదాపుగా పూర్తయింది. మే 9న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. క్రాస్ బోర్డర్ లవ్‌స్టోరీగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి ఎస్ బాగ్చీ దర్శకుడు. 'పాకిస్థానీ నటుడు మనకు అవసరమా' అంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఈ సినిమాను మహారాష్ట్రలో విడుదల చేయకుండా అడ్డుకుంటామని మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన ఇప్పటికే హెచ్చరించింది. ఇటువంటి ఉద్రికత్తల నేపథ్యంలో ఈ పాకిస్థానీ హీరోహీరోయిన్ల వ్యవహారం ఏమవుతుందో చూడాలి.

మానవత్వానికే మాయని మచ్చ

పహల్గాం ఉగ్ర దాడిపై చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల కాల్పుల ఘటనను ఖండిస్తూ పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.



అమాయక ప్రజలు, పర్యాటకులను బలిగొన్న భయంకరమైన, హృదయ విదారకమైన దాడి ఇది. ఘటన జరిగిన తీరు గురించి తెలుసుకుంటుంటే మనసు వికలమైంది. క్షమించరాని క్రూరమైన చర్య ఇది. బరువెక్కిన హృదయంతో మరణించిన వారి కుటుంబాలకు నా సానుభూతి తెలియజేస్తున్నాను. వారికి జరిగిన నష్టం పూడ్చలేనిది.

- చిరంజీవి



ఉగ్రదాడి హేయం... అణచడమే మన ధ్యేయం. వికృత చర్యలపై విక్రమిద్దాం... కశ్మీరం మనదే సదా... పోరాడుదాం పద... అసువులు బాసిన అమాయక పౌరులందరికీ నా అశ్రునివాళి!

- నందమూరి బాలకృష్ణ



పహల్గాం దాడి ఘటన తీవ్రంగా కలచివేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఒక్కటిగా నిలబడదాం. ఇలాంటి దాడుల ద్వారా దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేయలేరు. మన సాయుధ దళాలపై నాకు పూర్తి నమ్మకం ఉంది. కలసికట్టుగా ఈ కష్టకాలాన్ని అధిగమిద్దాం. జనసేన పార్టీ మూడు రోజుల పాటు సంతాప దినాలను పాటిస్తుంది. మా పార్టీ జెండాను అవనతం చేస్తున్నాం.

- పవన్ కల్యాణ్



పహల్గాం ఘటన గురించి నాలో చెలరేగిన బాధను, కోపాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నాను. మనమంతా ఒక్కటిగా నిలిచి ఇలాంటి హేయమైన చర్యలకు వ్యతిరేకంగా పోరాడుదాం.

- షారూఖ్‌ఖాన్

భూతల స్వర్గం కశ్మీర్, తీవ్రవాద చర్యలతో నరకంగా మారుతోంది. వారికి అమాయక ప్రజలు లక్ష్యంగా మారుతున్నారు. అమాయకుల ప్రాణాలు హరించడం హేయమైన చర్య.

- సల్మాన్‌ఖాన్

ఇది క్షమార్హం కాని నేరం. ఈ ఉగ్రచర్యపై అందరూ మౌనం వీడాలి. వారిపై ప్రతీకారం తీర్చుకోవాలి. తగిన విధంగా బుద్ధి చెప్పాలి.

- సంజయ్‌దత్



ఇది చీకటి రోజు. పహల్గాం దాడి ఘటనతో చాలా బాధపడ్డాను. క్రూరత్వానికి వ్యతిరేకంగా కలసి నిలబడే శక్తి మనకు లభిస్తుందని ఆశిస్తున్నాను. బాధిత కుటుంబాలకు ఈ విషాదం నుంచి బయటపడే శక్తి లభించాలి.

- మహేశ్‌బాబు



పహల్గాం ఉగ్రదాడి తీవ్రంగా బాధించింది. ఇలాంటి ఘటనలకు మన సమాజంలో స్థానం లేదు. బాధిత కుటుంబాలను చూస్తుంటే హృదయం బరువెక్కుతోంది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా.

- ఎన్టీఆర్

బిజినెస్

విజయవాడ ● గురువారం 24 ఏప్రిల్ 2025

రివర్స్‌గేర్‌లో టెస్లా

మార్చి త్రైమాసికంలో 71% క్షీణించిన సంస్థ లాభం

ట్రంప్ సర్కారుకు సేవలను తగ్గించుకోనున్న మస్క్



న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సన్నిహితుడు ఎలాన్ మస్క్‌కు చెందిన విద్యుత్ కార్ల కంపెనీ టెస్లా పనితీరు బాగా క్షీణించింది. జనవరి-మార్చి త్రైమాసికంలో కంపెనీ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 71 శాతం పతనమై 40.9 కోట్ల డాలర్లకు పడిపోయింది. ఆదాయం 9 శాతం క్షీణించి 1,930 కోట్ల డాలర్లకు తగ్గింది. అంతేకాదు, గడిచిన మూడు నెలల్లో కంపెనీ వాహన విక్రయాలు సైతం 13 శాతం తగ్గాయి. సంస్థ పేలవ పనితీరు నేపథ్యంలో ట్రంప్ సర్కారుకు తన సేవలను గణనీయంగా తగ్గించుకోవడంతో పాటు టెస్లా కార్యకలాపాలపై దృష్టి పెంచాలని మస్క్ గట్టి నిర్ణయం తీసుకున్నారు. వచ్చే నెల నుంచి ట్రంప్ సర్కారు కోసం కేవలం ఒకటి లేదా రెండ్రోజులు మాత్రమే కేటాయిస్తానని టెస్లా ఇన్వెస్టర్లతో అన్నారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టాక ప్రభుత్వ వ్యయాల్ని, ఉద్యోగుల్ని తగ్గించే బాధ్యతల్ని మస్క్‌కు అప్పగించారు. ఇందుకోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్) పేరుతో ఏర్పాటు చేసిన శాఖకు ప్రస్తుతం మస్క్ సారథ్యం వహిస్తున్నారు. అయితే, సర్కారు కోసం మస్క్ పని చేయడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఇది టెస్లా కార్ల అమ్మకాలతోపాటు పనితీరుపైనా తీవ్ర ప్రభావం చూపింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు టెస్లా షేర్లు 41 శాతం క్షీణించాయి.

మార్కెట్‌లోకి గోద్రెజ్ కొత్త హోం లాకర్లు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్ హోమ్ లాకర్స్ మార్కెట్‌లో ఏడు కొత్త ఉత్పత్తులను విడుదల చేసింది. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా అనేక భద్రతా ఫీచర్లతో ఈ లాకర్లను తీర్చిదిద్దినట్టు కంపెనీ సెక్యూరిటీ సొల్యూషన్స్ బిజినెస్ హెడ్ పుష్కర్ గోఖలే చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాలు తమకు అత్యంత కీలకమన్నారు. దేశవ్యాప్తంగా ఈ తరహా ఉత్పత్తుల మార్కెట్‌లో తమకు 76 శాతం వాటా ఉంటే, తెలుగు రాష్ట్రాల్లో మాత్రం 85 శాతం ఉందన్నారు. గత ఆర్థిక సంవత్సరం స్మార్ట్ సెక్యూరిటీస్ ఉత్పత్తుల ద్వారా తమ కంపెనీ చేసిన రూ.1,100 కోట్ల టర్నోవర్‌లో రూ.130 కోట్లు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిందన్నారు. బ్యాంకులు, జువెలరీ సంస్థలు తమ ఉత్పత్తుల ప్రధాన వినియోగదారులని గోఖలే చెప్పారు.

అణు ఇంధన రంగంలోకి మేఘా

ఎన్‌పీసీఐఎల్ నుంచి రూ.12,800 కోట్ల ఆర్డర్

MEGHA ENGINEERING & INFRASTRUCTURES LIMITED

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్థానిక మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) మరో ఘనత సాధించింది. కంపెనీ అణు ఇంధన రియాక్టర్ల రంగంలోకి ప్రవేశిస్తోంది. న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐఎల్) కర్ణాటకలోని కైగా వద్ద నిర్మించే అణు విద్యుత్ ప్రాజెక్టు ఐదు, ఆరు యూనిట్లకు ఒక్కోటి 700 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉండే రెండు అణు రియాక్టర్లు సరఫరా చేయనుంది.

రూ.12,800 కోట్ల ఆర్డర్: ఈ ఆర్డర్ విలువ రూ.12,800 కోట్లని ఎంఈఐఎల్ తెలిపింది. ఎన్‌పీసీఐఎల్ చరిత్రలో ఇంత భారీ ఆర్డర్ జారీ చేయడం ఇదే మొదటిసారి. ఈ భారీ ఆర్డర్ కోసం బీహెచ్ఈఎల్, ఎల్ అండ్ టీ కంపెనీలు కూడా పోటీపడ్డాయి. అయితే నాణ్యత, ధరల ఆధారిత ఎంపిక (క్వాలిటీ కమ్ కాస్ట్ బేస్డ్ సెలక్షన్) పద్ధతిలో ఎన్‌పీసీఐఎల్ మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీని ఎంపిక చేసింది. ఈ ఆర్డర్ పత్రాలను ఎన్‌పీసీఐఎల్ అధికారులు ముంబైలోని తమ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) సీహెచ్ సుబ్బయ్యకు అందజేశారు. ఈపీసీ పద్ధతిలో నిర్ణీత సమయానికి ఈ ఆర్డర్ పూర్తి చేస్తామని ఎంఈఐఎల్ తెలిపింది.

యాక్సెంచర్ గూటికి టాలెంట్‌స్ప్రింట్

talent sprint Part of Accenture

బెంగళూరు: హైదరాబాద్‌కు చెందిన డీప్‌టెక్ ఎడ్యుకేషన్ కంపెనీ టాలెంట్‌స్ప్రింట్‌ను అంతర్జాతీయ ఐటీ దిగ్గజం యాక్సెంచర్ కొనుగోలు చేసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) పూర్తి అనుబంధ విభాగమైన ఎన్ఎస్ఈ అకాడమీ లిమిటెడ్ నుంచి ఈ సంస్థను టేకోవర్ చేసింది. ఈ డీల్ విలువ ఎంతనేది మాత్రం వెల్లడించలేదు. 2009లో ప్రారంభమైన టాలెంట్‌స్ప్రింట్.. హైదరాబాద్‌తో పాటు సన్నీవేల్, కాలిఫోర్నియాలోనూ కార్యాలయాలను కలిగిఉంది. ప్రస్తుతం టాలెంట్‌స్ప్రింట్ ఐఐటీ, ట్రిపుల్‌ఐటీ, ఐఐఎం వంటి ప్రముఖ విద్యాసంస్థలు, టెక్నాలజీ ప్రొవైడర్ల భాగస్వామ్యంలో వర్ధమాన, అనుభవజ్ఞులైన వృత్తినిపుణులకు కృత్రిమ మేధ (ఏఐ), డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, చిప్ డిజైన్, సెమీ కండక్టర్ టెక్నాలజీస్, డిజిటల్ పరివర్తనం వంటి ఆధునిక టెక్నాలజీ కోర్సులతో పాటు మేనేజ్‌మెంట్ విభాగంలో లీడర్‌షిప్ అండ్ సస్టెయినబిలిటీ ప్రోగ్రామ్స్‌ను కూడా ఆఫర్ చేస్తోంది. కాగా, ఈ కొనుగోలు ఒప్పందంలో భాగంగా టాలెంట్‌స్ప్రింట్‌కు చెందిన 210 మంది ఉద్యోగులు యాక్సెంచర్‌కు చెందిన లర్న్‌వాంటేజ్‌లో చేరనున్నారు. తమ క్లయింట్ల సిబ్బంది నైపుణ్యాలను పెంచేందుకు తోడ్పడే లర్న్‌వాంటేజ్ సామర్థ్యాన్ని ఈ డీల్ మరింత బలోపేతం చేయనుందని యాక్సెంచర్ పేర్కొంది.

లక్ష దిగువకు బంగారం

ఒక్క రోజే రూ.2,400 పతనం

రూ.94,000 వరకు తగ్గే అవకాశం



న్యూఢిల్లీ: పసిడి పరుగుకు బ్రేక్ పడింది. నిన్న మొన్నటి వరకు రేసు గుర్రంలా పరిగెత్తిన పుత్తడి ధర బుధవారం ఒక్కసారిగా బ్రేక్ తీసుకుంది. మంగళవారం ఢిల్లీ మార్కెట్‌లో రికార్డు స్థాయిలో రూ.1,02,100 పలికిన 10 గ్రాముల మేలిమి బంగారం ధర బుధవారం రూ.2,400 పతనమై రూ.99,200కు చేరింది. ఫ్యూచర్స్ మార్కెట్‌లోనూ ఇదే పరిస్థితి. జూన్‌లో డెలివరీ ఇచ్చే 10 గ్రాముల మేలిమి బంగారం ధర బుధవారం మల్టీ కమోడిటీస్ ఎక్స్ఛేంజిలో (ఎంసీఎక్స్) రూ.1,435 తగ్గి రూ.95,905 వద్ద ట్రేడైంది. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ పుత్తడి ధర దిగొస్తోంది. మంగళవారం రికార్డు స్థాయిలో 3,500.33 డాలర్లకు చేరిన ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి ధర బుధవారం 3,300-3,318 డాలర్ల మధ్య ట్రేడైంది. 'పసిడి ధర చాలా బలహీనంగా ఉంది. ఈ నెల 3 తర్వాత ధర ఇంత భారీగా తగ్గడం ఇదే మొదటిసారి. అయితే ఇది స్వల్ప కాలిక దిద్దుబాటు మాత్రమే' అని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ రీసెర్చి అనలిస్టు జతిన్ త్రివేది చెప్పారు. వచ్చే కొద్ది రోజుల్లో దేశీయ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.94,000 నుంచి రూ.98,000 మధ్య ట్రేడయ్యే అవకాశం ఉందని మార్కెట్ వర్గాల అంచనా.

అమ్మకాలు కష్టమే: బంగారం ధరలు లక్ష రూపాయలకు అటూఇటూగా కదలాడుతున్న నేపథ్యంలో అమ్మకాల పరిమాణం 9-11 శాతం పడిపోయే అవకాశం ఉందని రేటింగ్ కంపెనీ క్రిసిల్ అంచనా వేసింది. ఈ ప్రభావం ఇప్పటికే పెళ్లిళ్ల సీజన్, ఈ నెల 30న వచ్చే అక్షయ తృతీయ అమ్మకాలపై కనిపిస్తోంది. ప్రధాన నగరాల్లో ఏ నగల షాపు చూసినా బోసిపోయి కనిపిస్తోంది. వచ్చే కొద్ది మంది కూడా కొద్దిపాటి కొనుగోళ్లతోనే సరిపెడుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది పెళ్లిళ్ల సీజన్ అమ్మకాలు 40 శాతం కూడా లేవని వ్యాపారులు చెబుతున్నారు.

విలువపరంగా ఓకే: గత ఆర్థిక సంవత్సరం దేశీయ మార్కెట్లో పసిడి ధర 25 శాతం పెరిగింది. ఈ ఏడాది ఇప్పటి వరకు చూసినా 20 శాతం పెరిగింది. ఇవే ధరలు కొనసాగితే ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) అమ్మకాల పరిమాణం 9-11 శాతం తగ్గినా, అమ్మకాల విలువ మాత్రం గత ఏడాదితో పోలిస్తే 13 నుంచి 15 శాతం పెరిగి రూ.5 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉందని క్రిసిల్ చెబుతోంది.

తగ్గిన ట్రంప్ జోరే కారణం: తాజా పరిణామాల నేపథ్యంలో వాణిజ్య యుద్ధం విషయంలో ట్రంప్ తెగే వరకూ లాగకపోవచ్చనే అంచనాలు పసిడి ధరలపై ప్రభావం చూపాయి. పెట్టుబడుల రక్షణ కోసం నిన్న మొన్నటి వరకు పసిడిని కొనుగోలు చేసిన మదుపరులు బుధవారం ఒక్కసారిగా అమ్మకాలకు దిగారు. అలాగే వడ్డీరేట్లు తగ్గించకపోతే ఫెడ్ ఛైర్మన్ జెరోం పోవెల్‌ను ఆ పదవి నుంచి పీకి పారేస్తామని కొద్ది రోజుల క్రితం ప్రకటించిన ట్రంప్ మంగళవారం ఒక్కసారిగా దీనిపై వెనక్కి తగ్గి అలాంటి ఆలోచనే లేదనడం కూడా మార్కెట్‌కు ఊరట కలిగించింది.

ఇంటెల్‌లో 20 శాతం ఉద్యోగాల కోత!?

న్యూఢిల్లీ: అమెరికా చిప్ తయారీ దిగ్గజం ఇంటెల్ వ్యాపార పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా భారీగా ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమవుతోందని సమాచారం. తద్వారా కంపెనీ సిబ్బందిని 20 శాతం వరకు తగ్గించుకోవాలనుకుంటున్నట్లు బ్లూంబర్గ్ కథనం పేర్కొంది. ఇందుకు సంబంధించి ఈ వారంలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఎన్‌విడియా నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్న ఇంటెల్ ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. వ్యాపారాన్ని తిరిగి గాడిలో పెట్టే బాధ్యతలను కొత్త సారథి లిప్-బు టాన్ చేతుల్లో పెట్టింది. ఈ మార్చిలో కంపెనీ పగ్గాలు చేపట్టిన టాన్.. ఉన్నతాధికార విభాగాన్ని క్రమబద్ధీకరించడంతోపాటు సంస్థలో ఇంజనీర్ల ప్రాధాన్యాన్ని పెంచేందుకు శ్రీకారం చుట్టారు. వ్యయాలను తగ్గించుకునేందుకు ఉద్యోగాల కోతలపైనా దృష్టి సారించినట్లు తెలిసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24న తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	420
వరంగల్	407	గోదావరి	405
చిత్తూరు	450	విశాఖపట్నం	425
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	112
వరంగల్	120	గుంటూరు	112
కరీంనగర్	120	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	85
కర్నూలు	120	నెల్లూరు	90
విశాఖపట్నం	111	అనంతపురం	90
గోదావరి	112		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,350 ▼	90,150 ▼	1,11,000 ▲
విజయవాడ	99,500 ▲	96,000 ▼	99,800 ▲
విశాఖపట్నం	98,295 ▼	90,140 ▼	98,000 ▲
రాజమండ్రి	98,350 ▼	90,150 ▼	99,000 ▼
ప్రొద్దుటూరు	97,800 ▼	89,980 ▼	99,200 ▲
ముంబై	96,080	88,010	96,610 ▲

మళ్లీ 80,000 పైకి సెన్సెక్స్

మరో 520 పాయింట్లు పెరిగిన సూచీ

ముంబై: ఈక్విటీ సూచీలు వరుసగా ఏడో రోజూ లాభపడ్డాయి. బుధవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 520.90 పాయింట్ల వృద్ధితో 80,116.49 వద్దకు చేరింది. సూచీ మళ్లీ 80,000 ఎగువకు చేరడం ఈ ఏడాదిలో ఇదే తొలిసారి. అంతేకాదు, 2024 డిసెంబరు 18 తర్వాత సూచీకిదే గరిష్ఠ ముగింపు స్థాయి. కాగా, నిఫ్టీ 161.70 పాయింట్లు పెరిగి 24,328.95 వద్ద ముగిసింది. ఐటీ, వాహన రంగ షేర్లలో మదుపరులు జోరుగా కొనుగోళ్లు జరపడం ఇందుకు దోహదపడింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) మన మార్కెట్లో మరిన్ని పెట్టుబడులు పెట్టడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత మెరుగుపరిచాయి. కాగా గడిచిన 7 సెషన్లలో సెన్సెక్స్ 6,269.34 పాయింట్లు, నిఫ్టీ 1,929.80 పాయింట్లు పుంజుకున్నాయి. దీంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ మరో రూ.3.1 లక్షల కోట్ల వృద్ధితో రూ.430.47 లక్షల కోట్లకు (5.04 లక్షల కోట్ల డాలర్లు) చేరింది. ఏడు రోజుల్లో మార్కెట్ సంపద రూ.36.65 లక్షల కోట్లు పెరిగింది.

ఏథర్ ఎనర్జీ ఐపీఓ ధర శ్రేణి రూ.304-321: ఏథర్ ఎనర్జీ ఐపీఓ ధర శ్రేణిని రూ.304-321గా నిర్ణయించింది. కంపెనీ పబ్లిక్ ఇష్యూ ఈనెల 28 ప్రారంభమై 30న ముగియనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో పబ్లిక్ ఇష్యూకు రాబోతున్న ప్రధాన కంపెనీ ఇదే.

భారత్-అమెరికా మధ్య వాణిజ్య చర్చలు షురూ

న్యూఢిల్లీ: ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై భారత్- అమెరికా అధికారుల మధ్య చర్చలు వాషింగ్టన్‌లో బుధవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు సాగనున్న ఈ చర్చలు ఇరు దేశాల మధ్య వాణిజ్యంలో ఉన్న సమస్యలను పరిష్కరించుకోవడంతోపాటు వీలైనంత త్వరగా ఒప్పందం కుదుర్చుకోవడానికి బాటలు వేయనున్నాయి. భారత్‌తో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ద్వారా తమ వస్తువులకు కొత్త మార్కెట్లకు ప్రవేశం లభించడంతోపాటు ఇరు దేశాల్లోని కార్మికులు, రైతులు, పారిశ్రామికవేత్తలకు మరిన్ని అవకాశాలు లభించనున్నాయని అమెరికా పేర్కొంది. భారత మార్కెట్లోకి మరింత సులువుగా ప్రవేశం, సుంకాలు, ఇతర అవరోధాలను తగ్గించుకోవడంతోపాటు దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం అదనపు హామీలను అమెరికా కోరుకుంటోంది.

స్పోర్ట్స్

విజేత హంపి

'ఫిడే' మహిళల గ్రాండ్ ప్రీ చెస్



పుణె: భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి ఫిడే మహిళల గ్రాండ్ ప్రీ చెస్ టోర్నమెంట్ పుణె అంచె చాంపియన్‌గా నిలిచింది. బుధవారం జరిగిన ఆఖరి రౌండ్‌లో బల్గేరియా జీఎం నుర్గ్యుల్ సలిమోవాపై హంపి విజయం సాధించింది. తెల్ల పావులతో ఆడిన తెలుగు గ్రాండ్‌మాస్టర్ హంపి 84 సుదీర్ఘ ఎత్తుల తర్వాత సలిమోవాను ఓడించింది. ప్రపంచ ర్యాపిడ్ చాంపియన్ హంపి మొత్తం తొమ్మిది రౌండ్ల ద్వారా ఏడు పాయింట్లు సాధించింది. హంపితోపాటు టైటిల్ రేసులో నిలిచిన చైనా గ్రాండ్‌మాస్టర్ ఝు జినెర్ కూడా చివరి గేమ్‌లో గెలుపొందింది. ఏడు పాయింట్లతో హంపితో సమంగా జినెర్ నిలిచింది. కానీ మెరుగైన టై బ్రేకర్ స్కోరు ఆధారంగా భారత గ్రాండ్‌మాస్టర్ టైటిల్ దక్కించుకుంది. మరో తెలుగు గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక మంగోలియా జీఎం ముంగుంతూల్‌తో పాయింట్ పంచుకుంది. 4.5 పాయింట్లతో హారిక నాలుగో స్థానంలో నిలిచింది. రష్యన్ జీఎం అలీనాతో చివరి రౌండ్‌ను డ్రా చేసుకున్న దివ్య దేశ్‌ముఖ్ (5.5) మూడో స్థానం సాధించింది. జీఎం వైశాలి (4) ఆరో స్థానంలో నిలిచింది.

నేటి మ్యాచ్ — వేదిక బెంగళూరు

బెంగళూరు x రాజస్థాన్ — రా.7.30 నుంచి

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	8	6	2	0	12	1.104
ఢిల్లీ	8	6	2	0	12	0.657
ముంబై	9	5	4	0	10	0.673
బెంగళూరు	8	5	3	0	10	0.472
పంజాబ్	8	5	3	0	10	0.177
లఖ్‌నవూ	9	5	4	0	10	-0.054
కోల్‌కతా	8	3	5	0	6	0.212
రాజస్థాన్	8	2	6	0	4	-0.633
హైదరాబాద్	8	2	6	0	4	-1.361
చెన్నై	8	2	6	0	4	-1.392

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

పాకిస్థాన్‌తో ఆటలు వద్దే వద్దు

అథ్లెట్ల డిమాండ్

పహల్గాం ఉగ్ర దాడికి ఖండన

న్యూఢిల్లీ: పహల్గాంలో ఉగ్ర దాడిని దేశ క్రీడారంగం తీవ్రంగా ఖండించింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. ఉగ్ర దాడి నేపథ్యంలో పాకిస్థాన్‌తో క్రీడా సంబంధాలను తక్షణమే తెంచుకోవాలని కొందరు అథ్లెట్లు డిమాండ్ చేశారు. పహల్గాంలోని పర్యాటక ప్రదేశంపై మంగళవారం టెర్రరిస్టులు దాడి చేసి ఎంతోమందిని పొట్టనబెట్టుకున్న సంగతి తెలిసిందే. పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత లష్కర్-ఎ-తాయిబా అనుబంధ సంస్థ 'ద రెసిస్టెన్స్ ఫోర్స్' తామే ఈ చర్యకు పాల్పడినట్టు ప్రకటించుకుంది.

ఆ ఘటన షాక్‌కు గురిచేసింది. మృతుల కుటుంబాలకు సానుభూతి. ఆ కుటుంబాలు ఎంత వేదనకు లోనవుతున్నాయో.. **-సచిన్ టెండూల్కర్**

మృతుల ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నా. ఈ హేయ ఘటనలో బాధితులకు న్యాయం జరగాలి. **-విరాట్ కోహ్లీ, బుమ్రా, సూర్యకుమార్**

మతం పేరిట మారణహోమం సృష్టించి అమాయకులను బలిగొనడం దారుణం. ఇది క్షమార్హం కాదు. **-మహ్మద్ సిరాజ్**

మృతుల కుటుంబాలకోసం ప్రార్థిస్తున్నా. ఈ ఘటనకు భారత్ తప్పకుండా ప్రతి దాడి చేస్తుంది. **-బీజేపీ మాజీ ఎంపీ, భారత జట్టు కోచ్ గంభీర్**

అమాయక భారతీయులను హత్య చేయడమే పాకిస్థాన్ జాతీయ క్రీడలా ఉంది. ఆ దేశంతో అన్ని క్రీడా సంబంధాలను నిలిపి వేయాలి. **-మాజీ క్రికెటర్ శ్రీవత్స గోస్వామి**

ఈ ఘటనతో నా హృదయం గాయపడింది. మృతుల కుటుంబాల బాధ వర్ణించలేనిది. **-సింధు**

జమ్మూకశ్మీర్ ఉదంతంతో నా గుండె బద్దలైంది. **-నీరజ్ చోప్రా**

పిరికి పందల చర్య. ఇందుకు కారణమైన వారిని వదలకూడదు. **-రవిశాస్త్రి**

జింబాబ్వే థ్రిల్లింగ్ విక్టరీ

బంగ్లాతో తొలి టెస్ట్



ముజరబాని (6/72)

సిల్హట్: బంగ్లాదేశ్‌తో తొలి టెస్ట్‌లో జింబాబ్వే 3 వికెట్ల తేడాతో ఉత్కంఠ విజయం సాధించింది. బంగ్లా నిర్దేశించిన 174 పరుగుల లక్ష్యాన్ని.. మరో రోజు ఆట మిగిలుండగానే జింబాబ్వే 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తమ టెస్ట్ చరిత్రలో నాలుగో ఇన్నింగ్స్‌లో అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన జింబాబ్వే.. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. ఓపెనర్లు బ్రియాన్ బెన్నెట్ (54), బెన్ కర్రాన్ (44) రాణించారు. మెహిదీహసన్ మిరాజ్ 5 వికెట్లు పడగొట్టాడు. అంతకుముందు ఆటకు నాలుగో రోజైన బుధవారం ఓవర్‌నైట్ స్కోరు 194/4తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన బంగ్లా 255 పరుగులకు ఆలౌటైంది. నజ్ముల్ షంటో (60) నిన్నటి స్కోరు వద్దే అవుట్ కాగా.. జాకర్ అలీ (58) అర్ధ శతకం సాధించాడు. ముజరబాని ఆరు వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లా 191.. జింబాబ్వే 273 పరుగులు చేశాయి. కాగా, 2021 తర్వాత విదేశాల్లో జింబాబ్వేకిదే తొలి టెస్ట్ విక్టరీ.

లంక వన్డే కెప్టెన్ ఆటపట్టు

● మహిళల ముక్కోణపు సిరీస్

కొలంబో: భారత్, దక్షిణాఫ్రికాలతో స్వదేశంలో జరిగే మహిళల ముక్కోణపు టోర్నీ కోసం ఆతిథ్య శ్రీలంక 17 మంది సభ్యుల బలమైన జట్టును ఎంపిక చేసింది. చమరి ఆటపట్టు జట్టుకు సారథ్యం వహించనుంది. ఈ ముక్కోణపు సిరీస్ ఈ నెల 27 నుంచి కొలంబోలో జరగనుంది.

ముక్కోణపు సిరీస్ షెడ్యూల్

- **ఏప్రిల్ 27:** శ్రీలంక-భారత్
- **ఏప్రిల్ 29:** భారత్-దక్షిణాఫ్రికా
- **మే 2:** శ్రీలంక-దక్షిణాఫ్రికా
- **మే 4:** శ్రీలంక-భారత్
- **మే 7:** భారత్-దక్షిణాఫ్రికా
- **మే 9 :** శ్రీలంక-దక్షిణాఫ్రికా
- **మే 11:** ఫైనల్

సెమీఫైనల్లో ఆరుగురు భారత బాక్సర్లు

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా అండర్-15, అండర్-17 చాంపియన్‌షిప్స్‌లో జోరు కనబరుస్తూ ఆరుగురు భారత బాక్సర్లు సెమీఫైనల్‌కు దూసుకెళ్లారు. బుధవారం జరిగిన 46 కిలోల అండర్-15 క్వార్టర్‌ఫైనల్లో రుద్రాక్ష్ సింగ్ 3-0తో ఐదర్ ముసేవ్ (కజకిస్థాన్)ను చిత్తు చేశాడు. ఈ విభాగం ఇతర క్వార్టర్‌ఫైనల్స్‌లో సంస్కార్ (36కి.)-అల్మత్‌బౌలీపై, 37 కి.లలో హర్షిల్-మహ్మదలీపై, 40 కి.లలో బల్హారా-నూర్‌సలేమ్‌పై, 49కి.లలో సంచిత్-యూ చెన్‌పై నెగ్గారు. మహిళల 43 కిలోల అండర్-15 విభాగంలో మిల్కీ 5-0తో కజక్ బాక్సర్ యెల్డానాను ఓడించి సెమీస్ చేరింది.

తీరు మారని రైజర్స్

- ఆరో ఓటమితో ప్లేఆఫ్స్ ఆశలు సంక్లిష్టం
- క్లాసెన్ పోరాటం వృథా ● బౌల్ట్‌కు 4 వికెట్లు
- 7 వికెట్లతో ముంబై విజయం ● అదరగొట్టిన రోహిత్



రోహిత్ శర్మ (70)

హైదరాబాద్: పేలవ ప్రదర్శనను కొనసాగిస్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆరో ఓటమితో నాకౌట్ అవకాశాలను మరింత సంక్లిష్టం చేసుకోగా.. క్రమంగా జోరు పెంచిన ముంబై ఇండియన్స్ ఏకంగా మూడో స్థానానికి ఎగబాకింది. రోహిత్ శర్మ (46 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లతో 70) వరుసగా రెండో అర్ధ శతకం నమోదు చేయగా.. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ట్రెంట్ బౌల్ట్ (4/26) బంతితో విజృంభించడంతో.. ముంబై ఇండియన్స్ వరుసగా నాలుగో విజయాన్ని నమోదు చేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 7 వికెట్ల తేడాతో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను చిత్తు చేసింది. తొలుత హైదరాబాద్ 20 ఓవర్లలో 143/8 స్కోరు చేసింది. క్లాసెన్ (44 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 71), అభినవ్ మనోహర్ (37 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్సర్లతో 43) పోరాటం వృథా అయింది. దీపక్ చాహర్ 2 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో ముంబై 15.4 ఓవర్లలో 3 వికెట్లకు 146 పరుగులు చేసి గెలిచింది. సూర్యకుమార్ యాదవ్ (40 నాటౌట్) రాణించాడు. ఉనాద్కట్, ఇషాన్ మలింగ చెరో వికెట్ పడగొట్టారు.

కష్టపడకుండానే..: ఫామ్‌లోకి వచ్చిన ఓపెనర్ రోహిత్ మరోసారి చెలరేగడంతో.. ముంబై అలవోకగా గెలిచింది. ఛేదనలో ఓపెనర్ రికెల్టన్ (11)ను స్వల్ప స్కోరుకే ఉనాద్కట్ పెవిలియన్ చేర్చడంతో.. సన్‌రైజర్స్ ఏదైనా అద్భుతం చేస్తుందా? అనిపించింది. కానీ, వన్‌డౌన్‌లో వచ్చిన విల్ జాక్స్ (22)తో కలసి రెండో వికెట్‌కు 64 పరుగులు జోడించిన రోహిత్.. మూడో వికెట్‌కు సూర్యకుమార్‌తో కలసి 53 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. దీంతో ముంబై 26 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకొంది. పవర్‌ప్లేలో ముంబై 56/1తో నిలిచింది. అయితే, 10వ ఓవర్‌లో అన్సారీ బౌలింగ్‌లో జాక్స్ క్యాచవుట్ అయ్యాడు. హర్షల్ వేసిన 14వ ఓవర్‌లో రోహిత్ మూడు బౌండ్రీలతో 15 పరుగులు రాబట్టడంతో.. లక్ష్యం 36 బంతుల్లో 23 పరుగులకు దిగివచ్చింది. రోహిత్‌ను మలింగ క్యాచౌట్ చేసినా.. సూర్య 6,4,4తో మ్యాచ్‌ను ముగించాడు.

టాపార్డర్ విలవిల..: సొంతగడ్డపై సన్‌రైజర్స్ మరోసారి విధ్వంసం సృష్టిస్తుందనుకొంటే.. తుస్సుమంది. టాపార్డర్ వైఫల్యంతో 13/4తో పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే, క్లాసెన్, మనోహర్ ఆరో వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యంతో గౌరవప్రద స్కోరు అందించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్.. ముంబై పేసర్లు చాహర్, బౌల్ట్ దెబ్బకు విలవిల్లాడింది. రెండో ఓవర్‌లో ఓపెనర్ హెడ్ (0)ను డకౌట్ చేసిన బౌల్ట్.. తన తర్వాతి ఓవర్‌లో అభిషేక్ శర్మ (8)ను పెవిలియన్ చేర్చాడు. వన్‌డౌన్‌లో వచ్చిన ఇషాన్ కిషన్ (1) చాహర్ బౌలింగ్‌లో అవుట్‌గా వెనుదిరిగిన తీరు అందరినీ ఆశ్చర్యపర్చింది. ఎవరూ అప్పీలు కూడా చేయకపోయినా.. అతడు వికెట్లను వదిలేసి వెళ్లడంతో వైడ్ ఇవ్వాల్సిన అంపైర్ అవుట్‌గా ప్రకటించాడు. బ్యాట్‌ను బంతి తాకలేదని రీప్లేలో నిర్ధారణ అయింది. నితీశ్ కుమార్ (2)ను కూడా చాహర్ అవుట్ చేయడంతో.. పవర్‌ప్లేలో రెండు బౌండ్రీలు మాత్రమే బాదిన హైదరాబాద్ 24/4తో నిలిచింది. కానీ, అనికేత్‌ను అవుట్ చేసి హార్దిక్ దెబ్బకొట్టాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన మనోహర్.. క్లాసెన్‌కు సహకారం అందించడంతో హైదరాబాద్ క్రమంగా కోలుకొంది. బుమ్రా బౌలింగ్‌లో సిక్స్‌తో వావ్ అనిపించిన మనోహర్.. డెత్ ఓవర్లలో జోరు పెంచాడు. మరోవైపు క్లాసెన్ ఈ సీజన్‌లో తొలి ఫిఫ్టీ పూర్తి చేసుకొన్నాడు. 19వ ఓవర్‌లో బుమ్రా బౌలింగ్‌లో సిక్స్ బాదిన క్లాసెన్.. ఆ తర్వాతి బంతికి క్యాచవుటయ్యాడు. మనోహర్, కమిన్స్ (1)ను అవుట్ చేసిన బౌల్ట్.. హైదరాబాద్ స్కోరును 150 మార్క్ చేరకుండా అడ్డుకొన్నాడు.



స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: హెడ్ (సి) నమన్ (బి) బౌల్ట్ 0, అభిషేక్ (సి) విఘ్నేష్ (బి) బౌల్ట్ 8, ఇషాన్ (సి) రికెల్టన్ (బి) చాహర్ 1, నితీశ్ (సి) శాంట్నర్ (బి) చాహర్ 2, క్లాసెన్ (సి) తిలక్ (బి) బుమ్రా 71, అనికేత్ (సి) రికెల్టన్ (బి) హార్దిక్ 12, అభినవ్ మనోహర్ (హిట్ వికెట్) బౌల్ట్ 43, కమిన్స్ (బి) బౌల్ట్ 1, హర్షల్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 143/8; వికెట్ల పతనం:** 1-2, 2-9, 3-13, 4-13, 5-35, 6-134, 7-142, 8-143; **బౌలింగ్:** చాహర్ 4-0-12-2, బౌల్ట్ 4-0-26-4, బుమ్రా 4-0-39-1, శాంట్నర్ 4-0-19-0, హార్దిక్ 3-0-31-1, విఘ్నేష్ 1-0-15-0.

ముంబై: రికెల్టన్ (సి అండ్ బి) ఉనాద్కట్ 11, రోహిత్ (సి) అభిషేక్ (బి) మలింగ 70, జాక్స్ (సి) మనోహర్ (బి) అన్సారి 22, సూర్యకుమార్ (నాటౌట్) 40, తిలక్ వర్మ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు 1, మొత్తం: 15.4 ఓవర్లలో 146/3, వికెట్లపతనం:** 1-13, 2-77, 3-130, **బౌలింగ్:** కమిన్స్ 3-0-31-0, ఉనాద్కట్ 3-0-25-1, హర్షల్ పటేల్ 3-0-21-0, మలింగ 3-0-33-1, జీషన్ అన్సారి 3.4-0-36-1.

ఉగ్ర చర్యలను ఖండించిన బీసీసీఐ

పహల్గాంలో ముష్కరుల దాడిలో మరణించిన మృతులకు సంతాపంగా ముంబై, హైదరాబాద్ జట్లు నల్ల ఆర్మ్ బ్యాండ్‌లు ధరించి బరిలోకి దిగాయి. మ్యాచ్ ఆరంభానికి ముందు ఇరుజట్లూ మృతుల ఆత్మకు శాంతి కలగాలని నిమిషంపాటు మౌనం పాటించాయి. తీవ్ర విషాదం నెలకొన్న నేపథ్యంలో చీర్ లీడర్స్ డ్యాన్సులతోపాటు బాణసంచా కాల్చడాన్ని కూడా రద్దు చేసినట్టు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. తీవ్రవాదుల పిరికిపంద చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ప్రకటించాడు. మరణించిన వారి కుటుంబాలకు బోర్డు తరఫున శ్రద్ధాంజలి ఘటించాడు.



విమానాశ్రయంలోనే ఉన్నతస్థాయి భేటీ!

» పహల్గాం దాడిపై ప్రధాని మోదీ సమీక్ష

శ్రీనగర్/న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో సౌదీ అరేబియా పర్యటనను కుదించుకొని హుటాహుటిన ఢిల్లీ చేరుకున్న ప్రధాని మోదీ.. విమానాశ్రయంలోనే ఉన్నతాధికారులతో సమీక్ష జరిపారు. బుధవారం ఉదయం జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ) అజిత్ దోభాల్, విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్, విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీతో ఎయిర్‌పోర్టులోనే ప్రధాని ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. పహల్గాం ఉగ్రదాడి ఘటనకు సంబంధించిన వివరాలను మోదీకి తెలియజేశారు. మంగళవారం రాత్రే శ్రీనగర్‌కు చేరుకున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా సైతం వర్చువల్‌గా ఈ సమావేశంలో పాల్గొన్నట్లు తెలిసింది. బుధవారం ఆయన పహల్గాంలోని బైసారన్‌లో దాడి జరిగిన ప్రదేశానికి వెళ్లారు. అక్కడ సైనికాధికారులు, జమ్మూకశ్మీరు డీజీపీ నళిన్ ప్రభాత్.. ఘటన జరిగిన తీరును అమిత్ షాకు వివరించారు. ఉగ్రవాదులు ఏ మార్గంలో వచ్చి ఉంటారనే విషయాన్ని కూడా తెలిపారు. అనంతరం ఆయన అనంతనాగ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. అమిత్ షాను చూసి బాధితులు రోదించారు. ఉగ్రదాడిని వివరిస్తూ విలపించారు. వారిని ఓదార్చిన ఆయన, దాడి బాధ్యులను వదిలే ప్రసక్తే లేదని చెప్పారు. కాగా, ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన 26 మంది మృతదేహాలను శ్రీనగర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలకు తరలించి, పోస్ట్‌మార్టం చేశారు. అనంతరం పోలీస్ కంట్రోల్ రూమ్‌కు తరలించారు. అక్కడ అమిత్ షా మృతులకు పుష్పాంజలి ఘటించారు. ఆయన వెంట జమ్మూకశ్మీరు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, సీఎం ఒమర్ అబ్దుల్లా కూడా ఉన్నారు. జమ్మూకశ్మీరు ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. అలాగే తీవ్రంగా గాయపడిన వారికి రూ.2 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.లక్ష పరిహారం ఇవ్వనున్నట్లు తెలిపింది. మరోవైపు జమ్మూకశ్మీరు మొత్తం భద్రతా బలగాలను మోహరించారు. కాగా, పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో బాధితుల కుటుంబ సభ్యులు శ్రీనగర్‌కు చేరుకుంటున్నారు. ఈ క్రమంలో విమాన టికెట్ల ధరలు పెంచొద్దని కేంద్ర పౌర విమానయాన శాఖ విమానయాన సంస్థలను ఆదేశించింది. అలాగే శ్రీనగర్ మార్గంలో అదనపు విమానాలను నడపాలని కూడా సూచించింది. మంగళవారం అర్ధరాత్రి సౌదీ అరేబియా నుంచి హుటాహుటిన తిరుగు ప్రయాణమైన ప్రధాని మోదీ విమానం పాక్ గగనతలం గుండా ప్రయాణించలేదని అధికారులు తెలిపారు. ఉగ్రదాడి నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ఆయన విమానం అరేబియా సముద్రం పైనుంచి ప్రయాణించి, గుజరాత్ గగనతలం మీదుగా ఢిల్లీ చేరుకున్నట్లు వెల్లడించారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగా ఖండించారు. దాడికి గట్టిగా బదులిస్తామని, ఎవ్వరినీ వదిలే ప్రసక్తే లేదని ఉగ్రవాదులను హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. బుధవారం ఆయన ఎన్ఎస్ఏ అజిత్ దోభాల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేదీ, నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేశ్ త్రిపాఠీతో సమావేశమయ్యారు.

ఢిల్లీలో భద్రత కట్టుదిట్టం

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ వెలుపల ఢిల్లీ పోలీసు సిబ్బందితో పాటు పారామిలటరీ బలగాలు మోహరించాయి. అక్కడ శాంతి భద్రతలకు ఎటువంటి ఆటంకం కలగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టామని ఓ సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పర్యటన నేపథ్యంలో ఢిల్లీలో ఇప్పటికే భద్రతను పటిష్ఠం చేశారు.

మరో ఉగ్రదాడి జరిగే అనుమానం!

హైదరాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): దేశంలో మరో ఉగ్రదాడి జరగొచ్చని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. మరింత అప్రమత్తంగా ఉండాలని కేంద్రం నుంచి రాష్ట్రాలకు సందేశాలు అందాయి. ముఖ్యంగా రద్దీ ప్రాంతాలు, విమానాశ్రయాలు, రైల్వేస్టేషన్లు, షాపింగ్ మాల్స్, పర్యాటక ప్రదేశాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఈనెల 25, 26 తేదీల్లో భారత్ సమ్మిట్ పేరిట సదస్సు జరగనున్న క్రమంలో భద్రతా ఏర్పాట్లను ఉన్నతాధికారులు మరోసారి సమీక్షించారు. ఈ సదస్సులో 100దేశాల నుంచి సుమారు 450మంది అతిథులు పాల్గొంటున్నారు.

సింధు జలాలు బంద్

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా.. అక్కడి పరిస్థితి గురించి భేటీలో వివరించారు. ఈ దాడికి పాల్పడినవారిని, అందుకు ప్రేరేపించినవారిని తీవ్రంగా శిక్షించేంతవరకూ విశ్రమించకూడదని సమావేశం నిర్ణయించింది. పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని త్రివిధ దళాలకు సూచించింది. కాగా.. పహల్గాం ఉగ్రదాడిపై గురువారం అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కూడా ఈ భేటీలో నిర్ణయించారు. సీసీఎస్ సమావేశం ముగిసిన అనంతరం.. అందులో తీసుకున్న కీలక నిర్ణయాల గురించి విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాకు వెల్లడించారు. అవేంటంటే..

● ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో 1960లో కుదుర్చుకున్న సింధు జలాల ఒప్పందం అమలు నిలిపివేత. ఈ నిర్ణయంతో.. సింధు, దాని ఉపనదులైన జీలమ్, చీనాబ్, రావి, బియాస్, సట్లెజ్ నుంచి పాకిస్థాన్‌కు నీటి సరఫరాను ఆపేస్తారు. సీమాంతర ఉగ్రవాదానికి మద్దతును పాక్ విశ్వసనీయంగా, కచ్చితంగా నిలిపివేసేదాకా ఈ ఒప్పందం అమలు కాదని భారత్ ప్రకటించింది.

● వాఘా-అట్టారీ వద్ద ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్ట్ తక్షణ మూసివేత. సరైన పత్రాలతో ఆ దారి గుండా ఇప్పటికే భారత్‌లోకి ప్రవేశించినవారు మే1లోపు అదే మార్గంలో వెళ్లిపోవాలని ఆదేశించింది.

● సార్క్ వీసా మినహాయింపు పథకం కింద పాక్ జాతీయులకు భారత్‌లోకి ప్రవేశం నిషిద్ధం. ఇప్పటికే అలా వచ్చినవారి వీసాలు రద్దయిపోతాయి. ఈ మినహాయింపు కింద భారత్‌లో ఉన్న పాక్ జాతీయులందరూ 48 గంటల్లోగా దేశం విడిచి వెళ్లిపోవాల్సి ఉంటుంది. న్యాయమూర్తులు, చట్టసభల సభ్యులు, సీనియర్ అధికారులు, వాణిజ్య ప్రముఖులు, పాత్రికేయులు, క్రీడా ప్రముఖులు.. ఇలా 24 కేటగిరీలకు చెందిన ప్రముఖులు సార్క్ దేశాల మధ్య వీసా రహిత ప్రయాణం చేసేందుకు వీలుగా 1992లో ఈ పథకాన్ని ప్రారంభించారు. దీని కింద.. ఆయా కేటగిరీలకు చెందిన ప్రముఖులకు వారి వారి దేశాలు ఏడాది వ్యాలిడిటీ ఉన్న ప్రత్యేక వీసా స్టికర్ ఇస్తాయి. ఆ స్టికర్ ఉంటే సార్క్ దేశాలకు వారు సంప్రదాయ వీసా లేకుండానే ఎన్నిసార్లయినా రావొచ్చు, పోవచ్చు.

● పాకిస్థానీ హైకమిషన్‌లో ఉన్న రక్షణ, సైనిక, నౌకా దళ, వైమానిక దళ సలహాదారులందరినీ అవాంఛిత వ్యక్తులుగా (పర్సొనా నాన్ గ్రేటా) ప్రకటించింది. వారం రోజుల్లోగా వారంతా తమ దేశానికి తిరిగి వెళ్లిపోవాలని ఆదేశించింది. అలాగే.. ఇస్లామాబాద్‌లో ఉన్న భారత హైకమిషన్‌లోని రక్షణ, సైనిక, నౌకా దళ, వైమానిక దళ సలహాదారులందరినీ భారత్ ఉపసంహరించుకుంది. ఆ పోస్టులన్నీ రద్దు చేసింది.

● రెండు దేశాల్లోని హైకమిషన్లలో సిబ్బంది సంఖ్యను 55 నుంచి 30కి తగ్గించింది. మే 1 నుంచి ఈ నిర్ణయం అమలు కానుంది.



పహల్గాం ఉగ్రదాడి మృతులకు అమిత్ షా నివాళి

ఉగ్రవాదంతో మానవాళికి తీవ్ర ముప్పు

» సంయుక్త ప్రకటనలో ఖండించిన మోదీ, సౌదీ యువరాజు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: ఉగ్రవాదం, హింసాత్మక తీవ్రవాదం మానవాళికి తీవ్ర ముప్పుగా పరిణమించాయని ప్రధాని మోదీ, సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ పేర్కొన్నారు. కారణం ఏదైనప్పటికీ ఉగ్రవాద చర్య సమర్థనీయం కాదని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. ఇతర దేశాలపై ఉగ్రవాద చర్యలకు పాల్పడటానికి క్షిపణులు, డ్రోన్లు సహా ఆయుధాలు అందకుండా నివారించాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం సౌదీ అరేబియాకు వెళ్లిన మోదీ బుధవారం స్వదేశానికి తిరిగి రావాల్సి ఉండగా, జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో తన పర్యటనను కుదించుకొని మంగళవారం రాత్రే స్వదేశానికి తిరిగివచ్చారు. అంతకుముందు మంగళవారం రాత్రి జెద్దాలో సౌదీ యువరాజుతో మోదీ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో పహల్గాం ఉగ్రదాడిని మోదీ, మొహమ్మద్ బిన్ సల్మాన్ తీవ్రంగా ఖండించినట్టు ఒక సంయుక్త ప్రకటన విడుదలైంది.

'సింధూ'పై పట్టు మనకే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23 : "ఒకే సమయంలో, ఒకేచోట నెత్తురు, నీళ్లు ప్రవహించవు" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సింధూ జలాల ఒప్పందాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. పాక్ కారణంగా సరిహద్దుల్లో తలెత్తిన ఉద్రిక్తతలను దృష్టిలో ఉంచుకుని 2016లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు సింధూ జలాల ఒప్పందాన్ని రద్దుచేసుకుని ఆ మాటలను ఆయన నిజం చేసి చూపించారు. సింధూనది నుంచి నీటి పంపిణీకి సంబంధించి భారత్-పాకిస్థాన్ మధ్య కుదిరిన ఒప్పందం ఇది. ఈ ఒప్పందం నుంచి అధిక లబ్ధి పొందుతున్న దేశం పాకిస్థాన్. నదీ ప్రవాహానికి దిగువన ఉన్నా, సింధూ జలాల్లో 80శాతం ఆ దేశమే వాడుకుంటోంది. పాక్ దుశ్చర్యలతో సరిహద్దుల్లో ఎన్ని ఉద్రిక్తతలు తలెత్తినా...దాదాపు ఆరు దశాబ్దాలుగా నిరాటంకంగా ఈ ఒప్పందం కొనసాగడానికి భారత్ సహకరిస్తోంది. నీటి ప్రవాహానికి ఎగువన ఉన్నా, ఏ దశలోనూ పాక్‌కు వెళ్లే జలాల ప్రవాహాలను అడ్డుకోలేదు. ఈ విషయంలో ప్రపంచంలోనే శాంతియుత పంపకాలు జరిగిన అతి పెద్ద ఒడంబడిక ఇది.

పంపకాలు ఇలా..: ప్రపంచ బ్యాంక్ చొరవతో 1960లో సింధూజలాల ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం, సింధూ పరీవాహకం పరిధిలోని ఆరు నదులను ఇరుదేశాల మధ్య విభజించారు. సింధు, జీలం, చీనాబ్ నదులపై (పడమట) పాక్‌కు, బియాస్, రావి, సట్లెజ్ నదులపై (తూర్పు) భారత్‌కు హక్కును కల్పించారు. పంపకాల తీరు చూస్తే, సింధూజలాలు అత్యధికంగా పాక్‌లోనే ప్రవహిస్తున్నట్టు కనిపిస్తుంది. సాధారణంగా భారత్ తాగు,సాగు అవసరాలకు తూర్పు వైపు ప్రవహించే నదులపైనే ఆధారపడుతుంది. పడమట వైపు ప్రవహించేనదుల నీటితో పెద్దగా మనకు పని ఉండదు. అందువల్ల సింధూజలాలు అత్యధికంగా పాక్‌కు దక్కుతున్నాయి. అదేసమయంలో భారత్ నదీ ప్రవాహానికి ఎగువన ఉంది. భౌగోళికంగా వ్యూహాత్మక అనుకూలత ఇది. కోరుకుంటే, పాకిస్థాన్‌కు జలాల ప్రవాహాన్ని అడ్డుకోగలదు. ప్రపంచ బ్యాంక్ చొరవతో తొమ్మిదేళ్లపాటు చర్చలు జరిగి, చివరకు 1960లో ఇరుదేశాల మధ్య సింధూ జలాల ఒప్పందం ఖరారైంది.


విశిష్టతలు...

రెండు దేశాల మధ్య శాంతియుత నీటి పంపకాలకు వాహికగా నిలిచిన ఈ ఒప్పందానికి అనేక విశిష్టతలు ఉన్నాయి. అవి..

● సరిహద్దుల్లో జలాల పంపిణీకి కుదుర్చుకున్న ఆసియాలోని ఏకైక ఒప్పందమిది.

● 1965, 1971ల్లో రెండు యుద్ధాలు జరిగాయి. కానీ, సింధూ జలాల కమిషన్ జల వివాదాల పరిష్కారానికి ఆ సమయంలోనూ పనిచేసింది.

● భారత పార్లమెంటుపై 2001లో ఉగ్రదాడి జరిగింది. 2019లో పుల్వామాలో మన జవాన్లను పాక్ ముష్కరులు పొట్టనబెట్టుకున్నారు. అయినా, ఒప్పందం నుంచి భారత్ బయటకు రాలేదు. కనీసం ఒప్పందాన్ని సమీక్షించాలంటూ అంతర్జాతీయ ఒప్పందాలను పర్యవేక్షించే వియన్నా కన్వెన్షన్‌ను ఆశ్రయించలేదు.



తలపై గురిపెట్టి, కలిమా చదవమన్నారు

» పక్కనున్న వాళ్లతో పదం కలిపి బతికిపోయాను

» అసోం వర్సిటీ ప్రొఫెసర్ దెబాశీష్ భట్టాచార్య



జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన సమయంలో.. అసోం యూనివర్సిటీలో బెంగాలీ బోధించే ప్రొఫెసర్ దేబాశీష్ భట్టాచార్య కూడా తన కుటుంబ సభ్యులతో అక్కడే ఉన్నారు. ఆయన ఎన్‌డీటీవీతో మాట్లాడుతూ మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకున్న ఘటన వివరాలను వెల్లడించారు. "బైసరన్ అందాలను వీక్షిస్తున్నాం. పర్యాటకులు గుంపులు గుంపులుగా ఉన్నారు. తొలుత తుపాకీ పేలిన శబ్దాలు వస్తే.. అటవీశాఖ అధికారుల చర్య అనుకున్నాం. కాసేపటికి ఓ సాయుధుడు ముసుగు ధరించి మాకు కొంత దూరంలో ఉన్న జంటతో మాట్లాడాడు. అప్పటికీ.. అతణ్ని అటవీశాఖ అధికారిగానే భావించాం. కానీ, అతను హఠాత్తుగా అక్కడున్న యువకుడిని కాల్చి చంపాడు. దాంతో.. మేము ఉన్న చోట గుంపు అంతా ఓ చెట్టు వద్ద నేలపై పడుకున్నాం. దుండగుడు మా వద్దకు వచ్చాడు. కలిమా(ఇస్లామిక్ వాక్యం) చదవమన్నాడు. నా చుట్టూ ఉన్నవారు కలిమా చదివారు. నేను కూడా వారితో పదం కలిపాను. నా వద్దకు వచ్చి తలకు తుపాకీ గురిపెట్టాడు. అప్పటికే కలిమాను వినడం వల్ల.. 'లా ఇలాహ..' అంటూ ఉచ్చరించాను. అంతే.. ముష్కరుడు నన్ను వదిలి వెళ్లిపోయాడు" అని భట్టాచార్య వివరించారు.

కలిమా పఠించకపోవడంతో కాల్పులు

» దాడిలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఎల్ఐసీ మేనేజర్ హతం

» ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని బంధువుల డిమాండ్

ఇండోర్, ఏప్రిల్ 23: పహల్గామ్ ఉగ్రదాడిలో మరిన్ని విషాదకరమైన విషయాలు వెలుగుచూస్తున్నాయి. పర్యాటకులే లక్ష్యంగా దాడులకు తెగబడిన ఉగ్రవాదులు మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక ఎల్ఐసీ మేనేజర్ సుశీల్ నతన్యాల్ (58)ను ఇస్లామిక్ ధర్మోక్తి (కల్మా)ను పఠించమని అడిగారు. తాను పఠించలేనని చెప్పడంతో తలపై కాల్చిచంపారు. తన తండ్రిని ఆ పరిస్థితుల్లో చూసి భయపడి ఆయన వైపు పరుగుతీసిన సుశీల్ కూతురు ఆకాంక్ష (35) కాలుపై కాల్చారు. ప్రస్తుతం ఆమె జమ్మూకశ్మీర్‌లోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. క్రైస్తవ మతానికి చెందిన సుశీల్ నతన్యాల్ ఈస్టర్ సందర్భంగా తన భార్య, కూతురు, కుమారుడితో కలిసి పహల్గామ్‌కు వెళ్లారని వారి బంధువు సంజయ్ కుమావత్ తెలిపారు. అమాయకులైన పర్యాటకులపై దాడి హేయమైన చర్య అని, ఇంతకంటే ఘోరం మరొకటి ఉండదని వారి బంధువులు అన్నారు. దాడులకు పాల్పడిన వారిని వదలకూడదని, వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి మధ్యప్రదేశ్ ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రభుత్వం తరఫున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ఇండోర్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సింగ్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఈ సంఘటనపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారని, జమ్మూకశ్మీర్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారని ఆయన తెలిపారు.

సరిహద్దుల్లో పాక్ హై అలెర్ట్!

భారత్ ప్రతీకారదాడులపై భయం



ఎంపీ అరుణ్ గోవిల్ నేతృత్వంలో మీరట్‌లో బీజేపీ శ్రేణుల నిరసన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ అప్రమత్తమైందా? పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు జరిపిన ఘాతుకానికి.. భారత్ బదులు తీర్చుకోనుందని ఆందోళన చెందుతోందా? బాలాకోట్ తరహా ఏరియల్ స్ట్రైక్స్ జరిపే సూచనలుండడంతో.. సరిహద్దుల్లోని రాడార్ వ్యవస్థలను అప్రమత్తం చేసి, నిఘాను ముమ్మరం చేసిందా? ఈ ప్రశ్నలకు ఫ్లైట్‌ట్రాకింగ్ వెబ్‌సైట్ 'ఫ్లైట్‌రాడార్24' అవుననే సమాధానం చెబుతోంది. దక్షిణ పాకిస్థాన్‌లోని కరాచీ ఎయిర్‌బేస్ నుంచి ఆ దేశ వాయుసేనకు చెందిన రెండు విమానాలను ఉత్తరాన– రావల్పిండి, లాహోర్ సమీపంలో.. భారత సరిహద్దులకు దగ్గర్లో ఉన్న వైమానిక స్థావరాలకు తరలించినట్లు వివరిస్తోంది. ఫ్లైట్‌ట్రాకింగ్ సమాచారం మేరకు సీ-130ఈ(పీఏఎఫ్ 198) రవాణా విమానం, పీఏఎఫ్ 101 నిఘా, వీఐపీలను తరలించే విమానాలను భారత సరిహద్దుల్లో మోహరించినట్లు తెలుస్తోంది. అదే విధంగా మిలటరీ వనరులను సైతం సరిహద్దులకు తరలిస్తున్నట్లు సమాచారం. వీటిల్లో పీఏఎఫ్-101 విమానంలో అధునాతన ఎయిర్‌బోర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్(ఏఈడబ్ల్యూ అండ్ సీ) ఉంటుంది. అంటే.. భారత్ ఏదైనా ఏరియల్ స్ట్రైక్స్‌కు సిద్ధమైతే.. ఈ వ్యవస్థలోని రాడార్లు వెనువెంటనే అప్రమత్తం చేస్తాయి. పాక్‌వైపు దూసుకువచ్చే క్షిపణులు, యుద్ధ విమానాలను గుర్తిస్తుంది. అదేవిధంగా రావల్పిండిలోని నూర్‌ఖాన్ బేస్‌లో రాడార్లను కూడా పాకిస్థాన్ వాయుసేన అప్రమత్తం చేసినట్లు సమాచారం. సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ ఎయిర్‌స్ట్రైక్ వంటి ఉదంతాల నేపథ్యంలో.. పాకిస్థాన్ అప్రమత్తమైనట్లు తెలుస్తోంది.

వాళ్లు పాకిస్థానీలే!

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఈ ముగ్గురి వివరాలను తెలియజేసిన వారికి రూ.20 లక్షల చొప్పున రివార్డు ఇస్తామని ప్రకటించారు. ఉగ్రదాడి నుంచి ప్రాణాలతో బయటపడిన వారు చెప్పిన గుర్తులు ఆధారంగా ఈ ఊహాచిత్రాలు గీయించారు. ఇక, లష్కరే తాయిబా కమాండర్ సైఫుల్లా కసూరీ అలియాస్ ఖలీద్ ఈ దాడికి సూత్రధారి అని దర్యాప్తు సంస్థలు పేర్కొంటున్నాయి. కాగా, ఉగ్రవాదులు కశ్మీరులోకి ఎలా ప్రవేశించారు ? ఎంతకాలంగా కశ్మీరులో ఉన్నారు ? తదితర అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

● బాడీ కెమెరాల్లో దాడి రికార్డు !

దాడికి పాల్పడిన ఉగ్రవాదులు బాడీ కెమెరాలు ఉపయోగించి దాడి మొత్తాన్ని రికార్డు చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. శరీరానికి లేదా తుపాకీలకు అమర్చిన కెమెరాల సాయంతో ఉగ్రవాదులు తాము చేసే దాడులను రికార్డు చేయడం ఇటీవల కాలంలో అధికమైందని జమ్మూకశ్మీర్ పోలీసు శాఖకు చెందిన ఓ అధికారి తెలిపారు. ఆయా వీడియోలను ఉగ్రవాదులు తర్వాత ప్రచారం కోసం వాడుకుంటున్నారని చెప్పారు.

మృతులంతా పురుషులే

భారత నేవీలో లెఫ్టినెంట్‌గా ఉన్న ఓ హరియాణా వాసి, అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న కోల్‌కతా వాసి, విశాఖపట్నంకు చెందిన రిటైర్డు బ్యాంకు ఉద్యోగి, కర్ణాటకకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి, తదితరులు పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి జాబితాలో ఉన్నారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన 26 మంది జాబితాను దర్యాప్తు సంస్థలు విడుదల చేశాయి. మృతుల్లో మహారాష్ట్రకు చెందిన వారు ఆరుగురు, గుజరాత్ వారు ముగ్గురు, కర్ణాటక వారు ముగ్గురు, పశ్చిమ బెంగాల్ వ్యక్తులు ఇద్దరు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్, ఒడిసా, మధ్యప్రదేశ్, పంజాబ్, బిహార్, ఉత్తరప్రదేశ్, కేరళ రాష్ట్రాలకు చెందిన వారు ఒక్కొక్కరు ఉన్నారు. వీరు కాక నేపాల్‌కు చెందిన ఓ వ్యక్తి, పహల్గాం స్థానికుడు కూడా మృతుల్లో ఉన్నారు. మృతులంతా పురుషులే కావడం గమనార్హం.

మృతుల జాబితా

	పేరు	ప్రాంతం
1	సుశీల్ నథ్యాల్	ఇండోర్
2	సయ్యద్ అదిల్ షా	పహల్గాం
3	హేమంత్ సుభాష్ జోషి	ముంబై
4	వినయ్ నర్వాల్	హరియాణా
5	అతుల్ శ్రీకాంత్ మోని	మహారాష్ట్ర
6	నీరజ్ ఉధావని	ఉత్తరాఖండ్
7	బితన్ అధికారి	కోల్‌కతా
8	సుదీప్ నెపుణె	నేపాల్
9	శుభమ్ ద్వివేది	కాన్పూర్
10	ప్రశాంత్ కుమార్ సత్పథి	ఒడిసా
11	మనీశ్ రంజన్	బిహార్
12	ఎన్ రామచంద్ర	కేరళ
13	సంజయ్ లక్ష్మణ్ లలీ	థాణే
14	దినేశ్ అగర్వాల్	ఛత్తీస్‌గఢ్
15	సమీర్ గుహర్	కోల్‌కతా
16	దిలీప్ దసాలి	ముంబై
17	జే చంద్రమౌళి	విశాఖపట్నం
18	మధుసూదన్(నెల్లూరు వాసి)	బెంగళూరు
19	సంతోష్ జగ్దా	పుణె
20	మంజునాథ్ రావు	కర్ణాటక
21	కస్తూబ గాన్బోతే	పుణె
22	భరత్ భూషణ్	బెంగళూరు
23	సుమిత్ పర్మార్	గుజరాత్
24	యతీశ్ పర్మార్	గుజరాత్
25	తేజాలైంగ్	అరుణాచల్ ప్రదేశ్
26	శైలేశ్‌భాయి	గుజరాత్

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం: సీఎం

» సంతాపం తెలిపిన డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్

అమరావతి, నెల్లూరు, అరసవల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కశ్మీర్, పహల్గాంలో ఉగ్రదాడిని వివిధ రాజకీయ పార్టీల నేతలు తీవ్రంగా ఖండించారు. సీఎం చంద్రబాబు బుధవారం ఎక్స్‌లో స్పందిస్తూ... 'ఉగ్రదాడిలో 28 మంది మృతి చెందడం, వారిలో రాష్ట్రానికి చెందిన జేఎస్ చంద్రమౌళి, మధుసూదన్ ఉండడం నన్ను కలచివేసింది. ఈ విషాద సమయంలో వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది' అని హామీ ఇచ్చారు. మంత్రి లోకేశ్ స్పందిస్తూ... ఉగ్రదాడిలో మృతి చెందిన తెలుగువారి కుటుంబాలకు సంతాపం తెలిపారు. మంత్రి నారాయణ స్పందిస్తూ... 'కశ్మీర్‌లో ఉగ్రదాడి దారుణ సంఘటన తీవ్రంగా కలచివేసింది. నెల్లూరు జిల్లా కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదనరావు మృతి చాలా బాధ కలిగించింది. వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది. ఉగ్రదాడి మృతులకు నివాళులు అర్పిస్తున్నా' అని అన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ బుధవారం ఓ ప్రకటన చేస్తూ... 'ఉగ్రదాడి అత్యంత హేయమైన చర్య. అమాయక పర్యాటకులపై జరిగిన ఈ అమానుష దాడిని ఖండించడానికి మాటలు చాలవు. ఈ ఘోర దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నా ప్రగాఢ సంతాపం. దోషులను అత్యంత కఠినంగా శిక్షించాలి' అని కోరారు. కశ్మీర్‌లో అమాయక ప్రజలపై చేసిన ఉగ్రదాడి ఒక పిరికిపంద చర్య అని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఘన నివాళులర్పించారు. 'శ్రీనగర్ నుంచి మొత్తం 4,500 మందిని వారి వారి ఇళ్లకు క్షేమంగా చేర్చేందుకు 35 విమానాలను ఏర్పాటు చేశాం' అని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

ఉగ్రదాడిపై జనసేన ఆవేదన

పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని జనసేన పార్టీ తీవ్రంగా ఖండించింది. పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఈ దుశ్చర్యను ఖండించి, మృతులకు సంతాపం తెలియజేశారు. జనసేన పార్టీ పక్షాన మృతులకు సంతాపం తెలియచేస్తూ మూడు రోజుల పాటు సంతాప కార్యక్రమాలు నిర్వహించాలని అధినేత సూచించారు. బుధవారం సాయంత్రం రాష్ట్రంలోని ప్రధాన కూడళ్లలో కొవ్వొత్తులు వెలగించాలని, శుక్రవారం సాయంత్రం రాష్ట్ర వ్యాప్తంగా మానవహారాలు నిర్వహించి ఉగ్రవాద దాడిని ఖండించాలంటూ ఓ ప్రకటన చేశారు. ఘటనలో మృతి చెందిన తెలుగువారి కుటుంబాలకు సానుభూతిని ప్రకటించారు. వారి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా ఇస్తుందని హామీ ఇచ్చారు. కాగా, కశ్మీర్‌లో చిక్కుకున్న రాష్ట్ర వాసుల కోసం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశామని ఎంపీ అప్పలనాయుడు తెలిపారు. ఒక నోడల్ అధికారిని నియమించినట్లు చెప్పారు. సహాయం కోసం 9818395787, 011 23387089 నంబర్లలో సంప్రదించాలని ఎంపీ సూచించారు.



ఉగ్రదాడిని ఖండిస్తూ అమరావతిలోని హైకోర్టు వద్ద న్యాయవాదులు నిరసన చేపట్టారు. బుధవారం భోజన విరామ సమయంలో హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో జాతీయ జెండా వద్దకు చేరుకొని ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



అత్యధిక మార్కులు సాధించిన టెన్త్ విద్యార్థులతో భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ

పది ఫలితాల్లో భాష్యం విజయభేరి

» 600కి 600 మార్కులు సాధించిన వై.నేహాంజని

గుంటూరు(విద్య), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఏపీ పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. బుధవారం గుంటూరు భాష్యం మెయిన్ క్యాంపస్‌లో ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థిని వై.నేహాంజని 600కి 600 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో అగ్రస్థానంలో నిలిచినట్టు చెప్పారు. కె.ప్రేమసత్య లిఖిత, కె.హర్షిత్, ఎ.లిఖిత 599, పి.వి.ఎస్.ఎస్.శ్రీహాసిని, ఎస్.షాలిని సంహిత, ఎం.ప్రియజోషిని 598 మార్కులు సాధించారని వెల్లడించారు. 590కిపైగా మార్కులు 206 మంది, 580కిపైగా మార్కులు 953 మంది, 570కిపైగా 1,889 మంది, 550కిపైగా 3,585 మంది, 500 మార్కులకుపైగా 6,635 మంది విద్యార్థులు సాధించారన్నారు. గణితంలో 1,088 మంది, సైన్స్‌లో 724 మంది 100కు 100 మార్కులు సాధించినట్టు తెలిపారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చైర్మన్ రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ అభినందనలు తెలిపారు.

కేశవరెడ్డి విద్యార్థుల విజయ విహారం

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఏపీ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించారని కేశవరెడ్డి విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ యన్.కేశవరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన్మయి గాయిత్రి 597, వర్షితబాయి, నాగ సత్యమణికంఠ, వెంకట అభినవ్ రెడ్డి 596 మార్కులు సాధించారని వివరించారు. ఏడుగురు విద్యార్థులు 595 మార్కులు, 8 మంది 594 మార్కులు సాధించారని పేర్కొన్నారు. ప్రతి ఐదుగురిలో ముగ్గురు 500కుపైగా మార్కులు సాధించారని, ప్రతి సబ్జెక్టులో సగానికిపైగా విద్యార్థులు 90%పైగా మార్కులు సాధించారని తెలిపారు. తెలుగు, హిందీ, ఆంగ్లంలలో సగటున 84%, గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రాలలో సగటున 86% మార్కులు సాధించినట్టు పేర్కొన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను, అందుకు తోడ్పడిన అధ్యాపకులను ఆయన అభినందించారు.



597 మార్కులు సాధించిన తన్మయి గాయిత్రిని అభినందిస్తున్న కేశవరెడ్డి విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ యన్.కేశవరెడ్డి

నారాయణ జైత్రయాత్ర



పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ, రమా నారాయణ తదితరులు

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఏపీ పదోతరగతి పరీక్ష ఫలితాలలో నారాయణ జైత్రయాత్ర కొనసాగిందని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ, రమా నారాయణ తెలిపారు. సాయి తన్వి 599 మార్కులతో ఆల్‌టైమ్ రికార్డు నెలకొల్పినట్టు పేర్కొన్నారు. 597 ఆపైన మార్కులు 15 మంది, 596 ఆపైన 39 మంది, 595 ఆపైన 85మంది, 590 ఆపైన 552 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. గణితంలో 1403 మంది, సైన్స్‌లో 1136 మంది, సోషల్ సబ్జెక్టులో 1088 మంది, తెలుగులో 1149 మంది విద్యార్థులు 100కు 100 మార్కులు సాధించారన్నారు. ఏపీలో 511 సగటు మార్కు, అలాగే 98% ఉత్తీర్ణత సాధించిన ఏకైక విద్యాసంస్థ నారాయణ మాత్రమేనని పేర్కొన్నారు. 88 బ్రాంచీలలో 100% ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

శ్రీచైతన్య విజయకేతనం

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఏపీ పదో తరగతి పరీక్ష ఫలితాలలో తమ విద్యార్థులు విజయభేరి మోగించారని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యధికంగా 599 మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశామన్నారు. 598 ఆపైన మార్కులు నలుగురు, 597ఆపైన 28 మంది, 596 ఆపైన 81 మంది, 595 ఆపైన 156 మంది, 590 ఆపైన 1091 మంది, 580 ఆపైన మార్కులను 3836 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. శ్రీచైతన్య స్కూల్ సగటు మార్కు 513, పాస్ పర్సంటేజీ 99% అని పేర్కొన్నారు. అత్యధిక బ్రాంచ్‌లు నూరుశాతం ఫలితాలు సాధించాయన్నారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి ఆమెతోపాటు సంస్థ మరో డైరెక్టర్ నాగేంద్ర అభినందనలు తెలిపారు.

కె.కె.ఆర్.గౌతమ్ విద్యాసంస్థల హవా

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని కె.కె.ఆర్.గౌతమ్ విద్యాసంస్థల యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. 600 మార్కులకుగాను ఎం.దీపేష్ రెడ్డి 596 మార్కులు, ఎస్.జోయల్ త్యాగి, కె.లాస్య నాగశ్రీ, బి.కార్తీక్ గణేష్ రెడ్డి, ఆర్.రుక్కయ్య 595, గీతాశ్రీవాత్సవ్, ఎం.ప్రణీత్ సాయి విష్ణు, ఎం.వి.శ్రీసాయి దాక్షాయణి, బి.సాయి హస్విత 594 మార్కులు సాధించారని పేర్కొంది. 46 మంది విద్యార్థులు 590 మార్కులకుపైగా, 208 మంది 580 మార్కులకుపైగా, 1,398 మంది 500 మార్కులకు పైగా సాధించారని తెలిపింది. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బందిని అభినందించింది.

విశ్వశాంతి విజయ పరంపర

విజయవాడ(బెంజిసర్కిల్), ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉయ్యూరు విశ్వశాంతి విద్యార్థులు విజయభేరి మోగించారని విశ్వశాంతి విద్యా సంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మాదల సుబ్రహ్మణేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 259 మందిలో 153 మంది విద్యార్థులు 500కుపైగా మార్కులు, 77 మంది 550పైగా మార్కులు సాధించారని పేర్కొన్నారు. 77శాతం విద్యార్థులు డిస్టెన్స్‌లో ఉత్తీర్ణులయ్యారని, తమ విద్యార్థి షేక్ బాజీబాబా 600కు 590 మార్కులు సాధించారని వివరించారు. అత్యధిక మార్కులు సాధించిన వారిని ఆయనతోపాటు అకడమిక్ డైరెక్టర్ సూర్యశేఖర్ తదితరులు అభినందించారు.

మహిళా సాధికారత కమిటీ చైర్‌పర్సన్‌గా పురందేశ్వరి

» సభ్యులుగా ఎంపీలు డీకే అరుణ, కడియం కావ్య

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత కమిటీ చైర్‌పర్సన్‌గా ఎంపీ పురందేశ్వరి నియమితులయ్యారు. ఈ కమిటీ వివరాలను లోక్‌సభ సెక్రటరీ జనరల్ బుధవారం వెల్లడించారు. సభ్యులుగా తెలంగాణ ఎంపీలు డీకే అరుణ, కడియం కావ్యకు అవకాశం దక్కింది. ఈ కమిటీలో మొత్తం 20మంది సభ్యులను నియమించాల్సి ఉండగా 18మంది పేర్లను ప్రకటించారు. మరో ఇద్దరిని నియమించాల్సి ఉందని పేర్కొన్నారు.

టెన్త్‌లో 81.14% ఉత్తీర్ణత

(మొదటి పేజీ తరువాయి)

నుంచి మొత్తం 6,14,459 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 4,98,585 మంది పాస్ అయ్యారు. బాలికలు 3,01,202 మంది పరీక్షలు రాస్తే 2,53,278 (84.09%) మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 3,13,257 మందికి గాను 2,45,307 (78.31%) మంది పాస్ అయ్యారు. 2024తో పోలిస్తే ఉత్తీర్ణత 5.55 శాతం తగ్గింది. రాష్ట్రవ్యాప్తంగా 1,680 బడులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. 19 పాఠశాలల్లో ఒక్కరు కూడా పాస్ కాలేదు. ఉత్తీర్ణతలో 93.9 శాతంతో పార్వతీపురం మన్యం జిల్లా వరుసగా మూడోసారి అగ్రస్థానంలో నిలిచింది. అల్లూరి సీతారామరాజు జిల్లా 47.64 శాతంతో అట్టడుగున ఉంది. ఏపీ గురుకుల పాఠశాలలు అత్యధికంగా 95.02% ఉత్తీర్ణత సాధించాయి.

హిందీలో 99.51% పాస్

- సబ్జెక్టుల వారీగా... హిందీలో అత్యధికంగా 99.51 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇంగ్లిష్‌లో 96.1% మంది, ప్రథమ భాషలో 95.94%, సోషల్ స్టడీస్‌లో 92.9%, సైన్స్‌లో 90.17%, గణితంలో అతి తక్కువగా 86.92% మంది పాసయ్యారు.
- మేనేజ్‌మెంట్ల వారీగా... ఏపీ గురుకులాలు, బీసీ సంక్షేమ పాఠశాలల్లో అత్యధికంగా 95% మంది పాసయ్యారు. ప్రైవేటు పాఠశాలల్లో 94.4%, సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో 89.5శాతం, మోడల్ స్కూళ్లలో 84%, కేజీబీవీల్లో 83% మంది ఉత్తీర్ణత సాధించారు. ఆశ్రమ్ పాఠశాలల్లో 61.6%, ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో 62.7% మంది పాసయ్యారు.

గత నాలుగేళ్ల ఉత్తీర్ణత శాతాలు ఇలా..

సంవత్సరం	బాలురు	బాలికలు	మొత్తం
2022	64.02	70.70	67.26
2023	69.27	75.38	72.26
2024	84.32	89.17	86.69
2025	78.31	84.09	81.14

నేహాంజనికి 600కి 600 మార్కులు

కాకినాడకు చెందిన యాళ్ల నేహాంజని 600 మార్కులు సాధించి రాష్ట్రంలోనే టాపర్‌గా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా మరో ఆరుగురికి 599 మార్కులు, 14మందికి 598 మార్కులు వచ్చాయి. పల్నాడు జిల్లాలోని జడ్పీ పాఠశాలలో చదివిన ఎ. పావని చంద్రిక 598 మార్కులు సాధించింది.

ఓపెన్ స్కూల్‌లో 37.93% ఉత్తీర్ణత

రెగ్యులర్ ఫలితాలతో పాటు ఓపెన్ స్కూల్ సొసైటీ నిర్వహించిన టెన్త్, ఇంటర్మీడియట్ ఫలితాలను మంత్రి లోకేశ్ విడుదల చేశారు. టెన్త్ పరీక్షలు 26,679 మంది రాయగా వారిలో 10,119 (37.93%) ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్మీడియట్ పరీక్షలు 63,668 మంది రాయగా వారిలో 33,819 (53.1%) మంది ఉత్తీర్ణత సాధించారు.

బీసీ గురుకులాల్లో టెన్త్ ఫలితాలు భేష్: మంత్రి సవిత

టెన్త్‌లో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఉత్తీర్ణత శాతం కంటే బీసీ గురుకుల విద్యార్థుల ఉత్తీర్ణత శాతం అధికంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 81.14 శాతం ఉత్తీర్ణత నమోదవగా, బీసీ సంక్షేమశాఖ గురుకులాలు 95 శాతం ఉత్తీర్ణతతో సత్తా చాటాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 102 బీసీ గురుకుల పాఠశాలలకు చెందిన 5788 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరయ్యారని, 29 పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయని తెలిపారు. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా బీసీ గురుకుల పాఠశాలలు ఫలితాలు సాధించాయన్నారు.

ఎస్సీ గురుకులాల్లో 90 శాతం ఉత్తీరత: మంత్రి డోలా

పదోతరగతి పరీక్ష ఫలితాల్లో ఎస్సీ గురుకులాలు, హాస్టళ్ల విద్యార్థులు 90 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 593 మార్కులు సాధించిన పెదపావని గురుకుల విద్యార్థిని కవితను మంత్రి అభినందించారు. రాష్ట్రంలోని అన్ని ఎస్సీ గురుకులాల్లో 57 మంది 575కి పైగా మార్కులు సాధించారని తెలిపారు. గత మూడేళ్ల కంటే ఈ ఏడాది మెరుగైన ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ విద్యాశాఖలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారని, పేదింటి బిడ్డలు ఉన్నత చదువులు చదివి సమాజంలో గొప్ప స్థాయికి ఎదగాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి తెలిపారు.

19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

టెన్త్ విద్యార్థులకు మే 19 నుంచి 28 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. అపరాధ రుసుము లేకుండా ఈ నెల 24 నుంచి 30 వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు ఈ నెల 24 నుంచి మే 1 వరకు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఒక్కో సబ్జెక్టుకు రీకౌంటింగ్‌కు రూ.500, రీవెరిఫికేషన్‌కు రూ.వెయ్యి చొప్పున చెల్లించాలి.



నేహాంజనికి స్వీటు తినిపిస్తున్న తల్లి గంగాభవాని

చదువుల తల్లి నేహాంజని

కాకినాడ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అన్ని సబ్జెక్టుల్లో నూటికి నూరు మార్కులతో మొత్తం 600 తెచ్చుకోవడం రాష్ట్ర చరిత్రలోనే అరుదైన రికార్డు. కాకినాడకు చెందిన యాళ్ల నేహాంజని ఎవరికీ సాధ్యం కాని రీతిలో ఈ అరుదైన ఫీట్ సాధించింది. నూరు శాతం స్ట్రైక్ రేట్‌తో పదో తరగతి ఫలితాల రికార్డులను తిరగరాసింది. కాకినాడ గొడారిగుంట లక్ష్మీ హాస్పిటల్ సమీపంలోని వసంత విహార్‌లో నివాసం ఉంటున్న యాళ్ల శ్రీనివాసరావు, గంగాభవానీ దంపతుల చిన్న కుమార్తె నేహాంజని. తండ్రి సివిల్ ఇంజనీర్ కాగా, తల్లి గృహిణి. ప్రస్తుతం శ్రీనివాసరావు ఉద్యోగ రీత్యా గుజరాత్‌లో ఉంటున్నారు. తండ్రి ఆశయాలకు తగ్గట్టుగానే ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో పెద్ద కుమార్తె 900కు పైగా మార్కులు సాధించగా.. బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో నేహాంజని స్టేట్ టాపర్‌గా నిలిచింది.

నా శ్రమకు ఫలితం దక్కింది

'రోజూ తెల్లవారుజామున 4.30గంటలకు నిద్రలేవడం, 2గంటలపాటు చదవడం, 7గంటలకు స్కూల్‌కు వెళ్లి రాత్రి 7గంటలకు ఇంటికి రావడం, డిన్నర్ అనంతరం మళ్లీ చదువుకోవడం ఇదీ నా దినచర్య. రోజుకు దాదాపు 17గంటలు పుస్తకాలతోనే కుస్తీ. బడిలో టీచర్లు చెప్పే పాఠాలు శ్రద్ధగా వినడం, సందేహాలను నివృత్తి చేసుకోవడం, ప్రణాళికాబద్ధంగా ఏకాగ్రతతో చదవడం, వాటిని గుర్తుపెట్టుకుని రాయడం వల్లే ఈ విజయం సాధ్యమైంది. ఉపాధ్యాయుల ప్రోత్సాహం, రివిజన్, ఎప్పుడైనా పరీక్షల్లో తప్పులు దొర్లితే అవి పునరావృతం కాకుండా జాగ్రత్తపడటం కూడా నూరు శాతం మార్కులు రావడానికి దోహదం చేశాయి. నా శ్రమకు ఫలితం దక్కింది. నేను సెల్‌ఫోన్ వాడటం చాలా అరుదు. టీవీ చూడటం కూడా అంతంతమాత్రమే. స్కూల్లో తోటి విద్యార్థులు, టీచర్లు అందరూ 598 మార్కులు వస్తే చాలనుకున్నారు. కానీ నేను మాత్రం 600 పైనే గురిపెట్టాను. పరీక్షలు రాసి వచ్చాక.. ప్రతిరోజూ ప్రశ్నపత్రం 'కీ'ని పరిశీలించేదాన్ని. అప్పుడే నూరు శాతం మార్కులు వస్తాయని ఊహించాను. ముంబై ఐఐటీలో చేరి, ఆ తర్వాత ఐఏఎస్ సాధించడమే నా లక్ష్యం.'

- నేహాంజని, టెన్త్ స్టేట్ టాపర్, కాకినాడ

తండ్రీకూతుళ్లు.. ఒకేసారి టెన్త్ పాసయ్యారు!



షబ్బీర్



సమీనా

రొంపిచెర్ల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా రొంపిచెర్లకు చెందిన తండ్రి, కుమార్తె టెన్త్ పరీక్షల్లో ఒకేసారి ఉత్తీర్ణులయ్యారు. స్థానిక పాలెం వీధికి చెందిన ఆర్టీసీ కండక్టర్ బాకా ఇస్మాయిల్ కుమారుడు షబ్బీర్ 1995-96లో 10వ తరగతి ఫెయిలయ్యారు. అనంతరం ఆయన తండ్రి ఇస్మాయిల్ కండక్టర్‌గా పనిచేస్తూ మృతిచెందారు. ఈలోపు షబ్బీర్ ప్రమాదవశాత్తు దివ్యాంగుడిగా మారారు. తండ్రి ఆర్టీసీలో పనిచేస్తూ మరణించడంతో పదో తరగతి పాసయితే తనకు ఏదో ఒక ఉద్యోగం వస్తుందనే ఉద్దేశంతో షబ్బీర్ ఈ ఏడాది నదుంలో ఓపెన్ స్కూల్‌లో పరీక్షలు రాశారు. ఆయన కుమార్తె సమీనా రొంపిచెర్ల బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివి పరీక్షలు రాసింది. బుధవారం వెలువడిన ఫలితాల్లో షబ్బీర్‌కు 319 మార్కులు రాగా, సమీనా 309 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు.

మార్కుల వరద

» కర్నూలు మునిసిపల్ పాఠశాల ఘనత

» 43 మందిలో 42 మందికి 500కుపైగా మార్కులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కర్నూలు నగరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్మారక మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ పాఠశాల వరుసగా నాలుగో ఏడాది కూడా వందశాతం ఉత్తీర్ణతతో పాటు అత్యధిక మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో అగ్రభాగాన నిలిచింది. ఈ పాఠశాల నుంచి ఈ ఏడాది 43 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవగా, వారిలో 42 మంది 500మార్కులకుపైగా సాధించడం గమనార్హం. మిగిలిన ఒక్క విద్యార్థికి మాత్రం 491 మార్కులు వచ్చాయి. గణితంలో 14 మంది, సైన్స్‌లో 9 మంది, సోషల్‌లో ఇద్దరు, హిందీలో ఒక్కరు నూటి కి నూరు మార్కులు సాధించారు. టీపీ సాయి లిఖిత అత్యధికంగా 595 మార్కులు, శృతి 591, చక్రధర్ 588, హరిణి 586, పార్థసారధి, మేఘన 584, లోషిత 583, కౌశిక్ కుమార్ 582, విష్ణుప్రియ 581, సంజయ్ కుమార్ 580 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను, అధ్యాపకులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అభినందించారు.

ఉషా వాన్స్ తెలుగువారికి గర్వకారణం: చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ సతీమణి ఉషా వాన్స్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళ కావడం ప్రతి తెలుగువారికీ గర్వకారణమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్‌లో పేర్కొన్నారు. తెలుగు సమాజం ప్రతిభను, ముఖ్యంగా తెలుగు మహిళల సత్తాను వాన్స్ చాటుతున్నారని ప్రశంసించారు. తెలుగు మూలాలను, సంప్రదాయలను తన పిల్లలకు అందిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని అన్నారు.

ఆ కిరాతకులను వదలం

» టీడీపీ నేత వీరయ్య హత్య కలచివేసింది

» మృతుడి స్వగ్రామంలో బాబు నివాళి

ఒంగోలు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో హత్యా రాజకీయాలతో రాష్ట్రం వణికిపోయిందని, తమ ప్రభుత్వంలో ఆ తరహా చర్యలను సహించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. ప్రకాశం జిల్లాకు చెందిన టీడీపీ నాయకుడు, నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరిని కిరాతకంగా హత్య చేసిన వారిని వదిలిపెట్టబోమని, హంతకులు భూమిలో దాక్కున్నా పట్టుకుని శిక్షించి తీరుతామని అన్నారు. మంగళవారం రాత్రి ఒంగోలులో జరిగిన వీరయ్య చౌదరి దారుణ హత్యోదంతంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వీరయ్య స్వగ్రామమైన అమ్మనబ్రోలుకు బుధవారం చంద్రబాబు వెళ్లి, ఆయన భౌతికకాయానికి నివాళులు అర్పించారు. మృతుడి భార్య, కుమారుడు, ఇతర కుటుంబసభ్యులను పరామర్శించి, ఓదార్చారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. హత్యకు సంబంధించిన విషయాలను పోలీస్ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్‌తో పాటు జిల్లాకు చెందిన ముఖ్య నాయకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ కోసం వీరయ్యచౌదరి అహర్నిశలు పనిచేశారన్నారు. గత ఎన్నికలలో సంతనూతలపాడు, చీరాల నియోజకవర్గాలలో టీడీపీ గెలుపునకు విశేష కృషిచేసిన వీరయ్య హత్యకు గురికావడం కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనను హత్య చేసిన తీరు చూస్తుంటే రాష్ట్రంలో ఇలాంటి క్రూరులు ఉన్నారా అని బాధ వేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వంలో ఇలాంటి హత్యా రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు బుధవారం మధ్యాహ్నం మూడున్నర గంటల ప్రాంతంలో హెలికాప్టర్‌లో ప్రకాశం జిల్లాకు వచ్చారు. చదలవాడ సమీపంలోని హెలిప్యాడ్ వద్ద దిగి అక్కడి నుంచి కాన్వాయ్‌లో అమ్మనబ్రోలు వెళ్లారు. ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ ప్రాథమికంగా హత్యకు సంబంధించిన అంశాలను బస్సులో సీఎంకు వివరించారు. మంత్రులు వంగలపూడి అనిత, ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ స్వామి, జిల్లా నాయకులను కూడా సీఎం వాకబు చేశారు.



వీరయ్యచౌదరి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రులు

మంగళవారం రాత్రి ఒంగోలులో హత్యకు గురైన వీరయ్యచౌదరి మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. బుధవారం 12 గంటల ప్రాంతంలో పోస్టుమార్టం నిర్వహించి ఆయన స్వగ్రామమైన అమ్మనబ్రోలు తరలించారు. మంత్రులు వంగలపూడి అనిత, ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యేలు బీఎన్ విజయకుమార్, దామచర్ల జనార్దన్, అశోక్‌రెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ తదితరులు ఆస్పత్రికి వచ్చారు. తొలుత ఎంపీ మాగుంట కార్యాలయంలో వారు భేటీ అయి వీరయ్య హత్య, తదనంతర పరిణామాలపై చర్చించారు. బుధవారం జరగాల్సిన డీఆర్సీ సమావేశాన్ని రద్దు చేసుకొని అమ్మనబ్రోలు వెళ్లి వీరయ్య అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అంత్యక్రియల్లో వేలాది మంది టీడీపీ శ్రేణులు, అభిమానులు పాల్గొని వీడ్కోలు పలికారు.

అన్ని కోణాల్లో విచారణ: హోం మంత్రి అనిత

వీరయ్యచౌదరి హత్య కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేశారు. ఆయనకు చెందిన బియ్యం, లిక్కర్, రియల్ ఎస్టేట్ వ్యవహారాలపై దృష్టిపెట్టారు. ఆ కోణంలో పలువురిని అదుపులోకి తీసుకున్నారు. వైసీపీకి చెందిన రౌడీషీటర్, రేషన్ బియ్యం మాఫియా డాన్‌గా పేరొందిన హతుడి బద్ధ వ్యతిరేకిని కూడా అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు బెంగళూరు, రామాయపట్నం తదితర ప్రాంతాల్లో వీరయ్యకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపార లావాదేవీల అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. వీరయ్య హత్యను టీడీపీ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకున్న విషయం తెలిసిందే. మంగళవారం అర్ధరాత్రికే హోంమంత్రి అనిత ఒంగోలు వచ్చి బుధవారం సాయంత్రం వరకు ఉండి దర్యాప్తును సమీక్షించారు. దీంతో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. వీరయ్య రాజకీయ నాయకుడు అయినప్పటికీ వ్యాపార రంగంలో కూడా బాగా రాణించారు. ఈ నేపథ్యంలో ఆయన స్వగ్రామమైన అమ్మనబ్రోలులో వ్యతిరేకులుగా ఉన్న వారిని కూడా వివిధ కోణాల్లో పోలీసులు విచారించారు. నాగులుప్పలపాడు మండలంలో రాజకీయంగా వీరయ్యకు వ్యతిరేకంగా ఉన్న, వైసీపీకి చెందిన ఒక రౌడీషీటర్‌పై పోలీసులకు అనుమానాలు వ్యక్తమయ్యాయి. మంగళవారం రాత్రి నుంచి అతని కోసం గాలించగా, బుధవారం మధ్యాహ్నం పోలీసులకు అందుబాటులోకి వచ్చినట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే అండదండలతో రేషన్ బియ్యం మాఫియా డాన్‌గా ఉన్నారు. విదేశీ మద్యం అక్రమంగా తెప్పించి వ్యాపారం చేయడంలోనూ కీలకపాత్ర పోషించారు.

పొన్నూరులో ముగ్గురు అదుపులోకి

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు వీరయ్య చౌదరి హత్యకేసులో ప్రకాశం జిల్లా పోలీసులు ముగ్గురు అనుమానితులను గుంటూరు జిల్లా పొన్నూరులో అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. వీరయ్య హంతకులను కఠినంగా శిక్షిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన కొద్ది సేపటికే వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు ప్రాంతానికి చెందిన గోపి, అమీర్, అశోక్ అనే ముగ్గురు యువకులను ఒంగోలు తరలించినట్లు తెలుస్తోంది. ఈ అనుమానితులు స్వయంగా హత్యలో పాల్గొన్నారా? లేక హత్య కేసు నిందితులకు సహకరించారా? అనే ఊహాగానాలు చెలరేగుతున్నాయి. వీరయ్య హత్య రేషన్ బియ్యం అక్రమ రవాణా మాఫియా నేపథ్యంలో జరిగిందనే అనుమానాలున్న నేపథ్యంలో పొన్నూరు రేషన్ మాఫియా పేరు మరోమారు చర్చనీయాంశమైంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పొన్నూరు పట్టణానికి చెందిన అంజి బర్లబాసు అనే రేషన్ బియ్యం వ్యాపారి హత్య అప్పట్లో సంచలనంగా మారింది. ఈ హత్య కేసులో వైసీపీకి చెందిన కీలక నాయకులు ఉన్నారని హతుడి కుటుంబసభ్యులు ఆరోపించారు. కాగా చేబ్రోలు అర్బన్ పోలీసులు కూడా మరో ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలుస్తోంది. అందులో ఓ వ్యక్తి బర్లబాసు హత్య కేసులో నిందితుడు కాగా, మరో వ్యక్తి చింటూ అని సమాచారం.

లోకేశ్‌ను పొగిడితే ఊరుకుంటారా?

» దువ్వాడపై సస్పెన్షన్ వేటు అందుకే

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాజకీయ ప్రత్యర్థులపై దాడులు చేస్తే.. పదవులిచ్చి ప్రోత్సాహకాలు! వారిలోని మంచిని పొగిడితే మాత్రం... సస్పెన్షన్ వేటు! ఇదీ.. జగన్ మార్కు రాజకీయం! ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను మంగళవారం రాత్రి హఠాత్తుగా వైసీపీ నుంచి సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. స్థానిక వైసీపీ మహిళా నేతతో సహ జీవనం, ఇన్‌స్టా రీల్స్, తిరుమల పర్యటనలో ఫొటోషూట్, కుటుంబ వివాదాలతో దువ్వాడ ఎప్పుడో రచ్చకెక్కారు. కానీ... జగన్ ఏమాత్రం పట్టించుకోలేదు. అలాంటిది... ఉన్నట్టుండి ఆయనను ఎందుకు సస్పెండ్ చేశారనేది చర్చనీయాంశంగా మారింది. మంత్రి లోకేశ్‌ను పొగడటమే దీనికి కారణమని తేలింది. ఒక ఇంటర్వ్యూలో దువ్వాడ శ్రీనివాస్, మాధురి పాల్గొన్నారు. 'బాలయ్య తర్వాత స్వీటెస్ట్ పర్సన్ ఎవరు' అని అడిగిన ప్రశ్నకు.. 'లోకేశ్' అని ఇద్దరూ ఏకకాలంలో చెప్పారు. లోకేశ్ తెలివైనవాడని, ముఖ్యమంత్రి పదవి ఇస్తే అభివృద్ధి చేస్తారని, యువకుడనీ కొనియాడారు! లోకేశ్‌ను అంతగా పొడిగితే జగన్ ఊరుకుంటారా? పార్టీ నుంచి సస్పెండ్ చేసేశారు.

ఐదేళ్లలో పేదలందరికీ పక్కా ఇళ్లు: అజయ్‌జైన్

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ నాణ్యమైన పక్కా గృహాలు నిర్మించి ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గృహనిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు. రాష్ట్రంలో పీఎంఏవై పథకం కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణ పురోగతిపై బుధవారం విజయవాడలోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్ టాప్ విద్యుత్ ఉపకరణాలను ఉచితంగానే అందించడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. సమీక్షలో మల్టీ స్టేక్ హోల్డర్ హ్యాబిటేట్ ఫర్ హ్యూమానిటీ ఇండియా డైరెక్టర్లు ఆనంద్ బొలిమేరా, జెబాకుమార్, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఎండీ శివప్రసాద్, హౌసింగ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హజ్‌యాత్ర విజయవంతానికి చర్యలు: మంత్రి ఫరూక్

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): హజ్ యాత్ర విజయవంతానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖమంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల అలసిపోయిన యాత్రికులకు అందించాల్సిన ప్రథమ చికిత్స, సీపీఆర్ పద్ధతులను గ్లోబల్ క్లినికల్ ఇన్‌స్ట్రక్టర్ డాక్టర్ సయ్యద్ జావేద్ అష్రఫ్ ఆన్‌లైన్‌లో వివరించినట్లు తెలిపారు.

ఆ అధికారులు అనుభవించకతప్పదు: ఆనంద్ సూర్య

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): 'జగన్‌రెడ్డి కోసం ప్రజావ్యతిరేక కార్యక్రమాలకు, తప్పుడు పనులకు పాల్పడిన అధికారులు నేడు అనుభవిస్తున్నారు. ప్రజల ధన, మాన ప్రాణాలతో ఆడుకోవడమే వైసీపీ, ఆ పార్టీ అధినేత జగన్‌రెడ్డి నైజం. 40 రోజులు ఓ మహిళను బంధించి చెప్పుకోలేని విధంగా హింసపెట్టిన నీచుడిని వైసీపీ వెనకేసుకురావడం ఏమిటి?' అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనంద సూర్య నిలదీశారు. తాను ఐపీఎస్ అధికారినని మరచి తాడేపల్లి ప్యాలెస్ పాలేరుగా పీఎస్ఆర్ పనిచేశారని మండిపడ్డారు.



కృష్ణవేణమ్మ పాదాలను తాకిన సముద్రుడు

కోడూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): హంసలదీవి పవిత్ర కృష్ణా సంగమ ప్రదేశం వద్ద ఉన్న కృష్ణవేణమ్మ పాదాలను సముద్రపు నీరు తాకాయి. బుధవారం ఐదు మీటర్ల మేరకు సముద్రం ముందుకు రావటంతో కృష్ణవేణమ్మ విగ్రహం చుట్టూ జలమయమైంది. పవిత్ర కృష్ణా సంగమ ప్రదేశం సాగరుని గర్భంలో కలిసిపోతుందేమో అంటూ భక్తులు ఆందోళన చెందుతున్నారు.

పీఎస్ఆర్‌కు రిమాండ్

- కేసును వాదించుకున్న పీఎస్ఆర్.. మే 7 వరకు రిమాండ్
- విచారణకు సహకరించలేదు: ప్రాసిక్యూషన్

విజయవాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు కటకటాలపాలయ్యారు. ముంబై నటి కాదంబరి జత్వాని కేసులో ఆయనకు న్యాయస్థానం రిమాండ్ విధించింది. ఈ కేసులో పీఎస్ఆర్‌ను సీఐడీ అధికారులు హైదరాబాద్‌లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆయనను విజయవాడ సీఐడీ ప్రాంతీయ కార్యాలయం నుంచి వైద్య పరీక్షల నిమిత్తం బుధవారం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మూడో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. ప్రాసిక్యూషన్, డిఫెన్స్ న్యాయవాదుల వాదనలను విన్నాక న్యాయాధికారి పి.తిరుమలరావు మే ఏడో తేదీ వరకు రిమాండ్ విధించారు. అనంతరం విజయవాడలోని జిల్లా జైలుకు తరలించారు.

వాదనలు చాంబర్‌లో... తీర్పు హాలులో...

పీఎస్ఆర్‌ను 24 గంటల్లోపు కోర్టులో హాజరుపరచాల్సి ఉన్నందున ఉదయం ఎనిమిది గంటలకే పోలీసులు కోర్టుకు తరలించారు. న్యాయాధికారి తిరుమలరావు ఇరువర్గాల న్యాయవాదులను చాంబర్‌కు పిలిపించుకున్నారు. తాము కోర్టు హాలులో వాదనలు వినిపిస్తామని, బెంచ్‌పైకి రావాలని న్యాయాధికారిని పీఎస్ఆర్ తరపు న్యాయవాదులు కోరారు. కోర్టు సమయం కాకుండా బెంచ్‌పైకి రాలేనని ఆయన బదులిచ్చారు. ఆ సమయం వరకు తాము వేచి ఉంటామని న్యాయవాదులు చెప్పారు. దానిప్రకారం చూస్తే నిందితుడ్ని కోర్టులో ప్రవేశపెట్టాల్సిన 24 గంటల సమయం దాటిపోతుందని న్యాయాధికారి వారికి స్పష్టం చేశారు. దీంతో న్యాయాధికారి చాంబర్‌లో వాదనలు ప్రారంభమయ్యాయి. ప్రాసిక్యూషన్ తరపున జేడీ రాజేంద్రప్రసాద్, హైకోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాయిరోహిత్ వాదనలు వినిపించారు. "కాదంబరి జత్వానిపై కేసు నమోదు చేయడం దగ్గర నుంచి ఆమె కుటుంబాన్ని అరెస్టు చేయడం వరకు మొత్తం ప్రక్రియను పీఎస్ఆర్ ఆంజనేయులు పర్యవేక్షించారు. ఇదే విషయాన్ని అప్పటి డీసీపీగా ఉన్న విశాల్‌గున్నీ తన వాంగ్మూలంలో తెలిపారు. విశాల్ గున్నీకి డీఐజీ పదోన్నతి ఇచ్చి విశాఖ రేంజ్‌కు బదిలీ చేయగా, జత్వాని కేసులో అరెస్టులు పూర్తయ్యే వరకు రిలీవ్ చేయబోమని పీఎస్ఆర్ ఆయనను బెదిరించారు. పీఎస్ఆర్‌కు సీఆర్పీసీ 47, 48 ప్రకారం అరెస్టుకు సంబంధించిన సమాచారాన్ని సీఐడీ అధికారులు అందజేశారు." అని తెలిపారు. పీఎస్ఆర్ తరపున నగేశ్‌రెడ్డి వాదనలు వినిపించారు. "జత్వాని కేసులో ఉన్న ఇతర నిందితులకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఏ నిందితుడ్నీ విచారణకు పిలవడం లేదని స్వయంగా ఏజీ కోర్టుకు వివరించారు. అటువంటి పరిస్థితుల్లో పీఎస్ఆర్ అరెస్టు సరికాదు. హైకోర్టు ఇచ్చిన బెయిల్ తీర్పులను అనుసరించి రిమాండ్‌ను తిరస్కరించా"లని అభ్యర్థించారు.

వాదనలు వినిపించిన పీఎస్ఆర్

కాదంబరి జత్వాని కేసులో నిందితుడిగా న్యాయాధికారి ముందు నిలబడిన పీఎస్ఆర్ తన వాదనలు తానే వినిపించుకున్నారు. ఆయన తరపున న్యాయవాదులు హాజరై వాదనలు వినిపించినప్పటికీ మధ్యమధ్యలో పీఎస్ఆర్ స్వయంగా వాదనలు వినిపించుకున్నారు. సుమారుగా 10-15 నిమిషాలపాటు ఆయన చెప్పదలచిన విషయాలను న్యాయాధికారికి వివరించారు. "నేను విచారణకు సహకరించడం లేదన్న వాదనల్లో వాస్తవం లేదు. జత్వాని ఇచ్చిన ఫిర్యాదుపై ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో నాపై క్రైం నంబరు 469/2024తో కేసు నమోదు చేశారు. దీనికి ముందు కుక్కల విద్యాసాగర్ ఇచ్చిన ఫిర్యాదుపై క్రైం నంబరు 90/2024తో ఒక కేసు నమోదు చేశారు. నన్ను 90/2024 కేసులోనే విచారణకు పిలిచారు. ఆ కేసులో నా పేరు నిందితుడిగా గానీ, సాక్షిగా గానీ లేదు. అందువల్లే ఆ కేసులో విచారణకు ఎందుకు హాజరుకావాలో చెబితే వస్తానని విచారణాధికారులకు తెలియజేశాను. జత్వాని కేసును నేను ఏస్థాయిలోనూ పర్యవేక్షించలేదు. కేసు నమోదు చేసి ఇన్ని నెలలు గడుస్తున్నా నేను ఎక్కడికీ పారిపోలేదు. కేసు నమోదు చేసిన తర్వాత నా ప్రమేయంతోనే జత్వానిపై కేసు నమోదు చేసినట్టు వాంగ్మూలం ఇవ్వాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నట్టు విశాల్‌గున్నీ ఫోన్ చేశారు. అలా చేయడం తప్పని, ఆవిధంగా వాంగ్మూలం ఇవ్వొద్దని విశాల్‌గున్నీకి చెప్పాను. శాఖాపరంగా జరిగిన విచారణను ఆధారం చేసుకుని నన్ను అరెస్టు చేయడం అసంబద్ధం." అని పీఎస్ఆర్ వాదించారు

"ప్రజల భద్రత కోసం పనిచేయాల్సిన పోలీసులు చట్టానికి విరుద్ధంగా ప్రవర్తిస్తే దాన్ని వ్యక్తిగత నేరంగా చూడలేం. న్యాయవ్యవస్థపై చేసిన దాడితో అది సమానం. వ్యవస్థను నాశనం చేసే తీవ్రమైన తప్పిదానికి సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు పాల్పడ్డారు. మాజీ ముఖ్యమంత్రి మెప్పు కోసం పోలీసులను ఆట బొమ్మల్లా ఆడిస్తూ, కంచే చేను మేసిన చందంగా వ్యవహరించారు."

- రిమాండ్ రిపోర్ట్‌లో సీఐడీ తీవ్ర వ్యాఖ్యలు



కంచే చేను మేసినట్లు

- పోలీసుల్ని ఆటబొమ్మల్లా ఆడించిన పీఎస్ఆర్
- పోలీసు అధికారి అయిఉండీ మహిళపై కుట్ర
- మహిళా దర్యాప్తు అధికారికీ బెదిరింపులు
- నిఘా మాజీ చీఫ్‌పై సీఐడీ రిమాండ్ రిపోర్ట్

అమరావతి, విజయవాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ముప్పై సంవత్సరాలు ఐపీఎస్ అధికారిగా పనిచేసిన ఇంటిలిజెన్స్ మాజీ డైరెక్టర్ జనరల్ పీఎస్ఆర్ ఆంజనేయులు చట్టాన్ని ఏ కోశానా గౌరవించలేదని సీఐడీ అధికారులు కోర్టుకు తెలిపారు. మహిళల భద్రత చూడాల్సిన పోలీసు అధికారే ఒక మహిళను వేధించేందుకు కుట్ర పన్నారన్నారు. ముంబై నటి కాదంబరి జత్వానీపై వేధింపుల కేసులో సీఐడీ పోలీసులు కోర్టులో దాఖలు చేసిన రిమాండ్ రిపోర్టులో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత జగన్ ప్రభుత్వ అరాచక పాలనలో కాదంబరి జత్వానీపై తప్పుడు కేసులు బనాయించి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి తీవ్ర వేధింపులకు పాల్పడిన కేసులో రెండో నిందితుడు పీఎస్ఆర్ ఆంజనేయులు. ఆయనను మంగళవారం సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో నిఘా విభాగం అధిపతిగా తన పదవిని సీనియర్ ఐపీఎస్ దుర్వినియోగం చేశారని సీఐడీ తన రిమాండ్ రిపోర్టులో ఆరోపించింది. ఆయన తన అధికారాన్ని అడ్డు పెట్టుకుని మిగతా పోలీసు అధికారులను 'ఆటబొమ్మలు'గా మార్చేశారని రిమాండ్ రిపోర్టులో పేర్కొంది. నిరపరాధ మహిళను, ఆమె కుటుంబ సభ్యులను వేధించేందుకు కుట్ర పన్నారని రిపోర్టులో స్పష్టంగా వివరించారు. జత్వానీతోపాటు కుటుంబ సభ్యులను విజయవాడ శివారులో కొండల మధ్య నిర్మానుష్య ప్రాంతంలో బంధించి దాడి చేయించినట్లు విచారణలో తేలిందన్నారు.

ఫోర్జరీకి పీఎస్ఆర్ సహకారం

విజయవాడ పోలీసు కమిషనరేట్ డైరెక్షన్‌లో ఇదంతా జరగడం అత్యంత బాధాకర విషయమన్నారు. తప్పుడు కేసులో జత్వానీని, ఆమె కుటుంబ సభ్యులను ఇరికించేందుకు స్థానిక పోలీసు అధికారులు కాంతి రాణా తాతా, విశాల్ గున్నీ, హన్మంతరావు తదితరులను ఆటబొమ్మల్ని చేశారని రిమాండ్ రిపోర్టులో వివరించారు. ఈ కేసులో ఏ1 కుక్కల విద్యాసాగర్‌తో కుమ్మక్కై ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించడంలో ఆంజనేయులు కీలక పాత్ర పోషించినట్లు వెల్లడించారు. చట్టమంటే పీఎస్ఆర్‌కు లెక్కలేదని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి 22న విచారణకు రమ్మంటూ మహిళా దర్యాప్తు అధికారి (ఐవో) నోటీసు ఇస్తే, వచ్చేందుకు కుదరదంటూ ఈ కేసులో ఏడో నిందితుడు వెంకటేశ్వర రావుతో కబురు పెట్టారని పేర్కొన్నారు. అదే వ్యక్తి ఫోనుకు వీడియో కాల్ చేసి "నేను ఏ నేరమూ చేయలేదు. నాకు ఈ కేసుతో సంబంధం లేదు. నన్నెందుకు రమ్మంటున్నారు?" అంటూ ఐవోను బెదిరించినట్లు రిమాండ్ రిపోర్టులో సీఐడీ పేర్కొంది. కేసులో నిందితులు, సాక్షులపై ప్రభావితం చూపగల సత్తా పీఎస్ఆర్‌కు ఉందని, ఆయన బయట ఉండటం కేసు దర్యాప్తునకు తీవ్ర ఆటంకమని స్పష్టం చేసింది. ఆంజనేయులు సహా నిందితుడైన ఐపీఎస్ అధికారి విశాల్ గున్నీ మొత్తం కుట్రను బయట పెట్టారని, ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా పరిశీలించినప్పుడు తాడేపల్లిలోని సీఎంవోలో పీఎస్ఆర్ సహా నిందితులందరి ఫోన్లు ఒకేచోట ఉన్నట్లు వీరి సీడీఆర్ పరిశీలనలో తేలిందన్నారు. మొత్తం కుట్రకు బీజం వేసిన పీఎస్ఆర్ ఇబ్రహీంపట్నంలో జత్వానీపై కేసు నమోదుకు ముందే ముంబై పోలీసులతో మాట్లాడినట్లు తేలిందని సీఐడీ రిమాండ్ రిపోర్టులో వివరించింది. మాజీ ముఖ్యమంత్రి మెప్పు కోసం ఈ వ్యవహారంలో చేయాల్సిందంతా చేసిన ఆయన ప్రత్యేక పోలీసు బృందాలను ముంబైకి పంపారని తెలిపింది. జత్వానీ, ఆమె తల్లిని విశాల్ గున్నీ బృందం అదుపులోకి తీసుకోగా, మరో టీమ్ ఆమె తండ్రిని బలవంతంగా విజయవాడకు తీసుకొచ్చినట్లు వివరించింది. 'ఆమెను అరెస్టు చేశాం. నేను తిరిగి రావొచ్చా?' అంటూ పీఎస్ఆర్‌కు ఫోన్ చేసి గున్నీ అడిగిన విషయం కూడా నిర్ధారణ అయిందని దర్యాప్తు అధికారులు కోర్టుకు వివరించారు.

పోలీసు అధికారిపైనే మచ్చ..

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ కేసులో ముంబైలో నివసిస్తున్న జత్వానీ, ఆమె తల్లిదండ్రులను 2024 ఫిబ్రవరి 3న విజయవాడ డీసీపీ (అప్పట్లో) విశాల్ గున్ని నేతృత్వంలో పోలీసులు అక్రమంగా అరెస్టు చేసినట్లు రిమాండ్ రిపోర్టు పేర్కొంది. వారి బ్యాగులో ఒప్పంద పత్రాన్ని ఉంచినట్టు నాటకం ఆడారని దర్యాప్తు అధికారులు తెలిపారు. అయితే విచారణలో ఎలాంటి ఒప్పందాలు జరగలేదని తేలిందన్నారు. అక్రమ అరెస్టులు పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లోనే చోటు చేసుకున్నాయని, ఇది ఒక మహిళ గౌరవానికి భంగం కలిగించే చర్యగా పేర్కొన్నారు.

పోస్టింగ్ ఆపేస్తామని గున్నీకి హెచ్చరిక

విజయవాడ పోలీస్ కమిషనరేట్‌లో డీసీపీగా పనిచేసిన గున్నీ వాంగ్మూలమే ఈ కేసులో అత్యంత కీలకంగా మారింది. ఆయన గతేడాది సెప్టెంబరులో సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చారు. అందులో జనవరి 31న అప్పటి ముఖ్యమంత్రి జగన్ క్యాంపు కార్యాలయం తాడేపల్లిలో జరిగిన సమావేశంలో పీఎస్ఆర్ ఆంజనేయులు తనను ముంబైకు వెళ్లి అరెస్టులు చేయాలని ఆదేశించారని, విశాఖపట్నం రేంజ్ డీఐజీగా వచ్చిన తన పోస్టింగ్‌ను నిలిపివేస్తానని హెచ్చరించారని విశాల్ గున్నీ తెలిపారు. ఫోన్ కాల్ డిటెయిల్స్ రికార్డులు కూడా ఈ కేసుకు బలమైన ఆధారంగా మారాయి. సీడీఆర్ఎస్, మొబైల్ టవర్ లొకేషన్ డేటా ఆధారంగా జనవరి 31న ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో నిందితులంతా సమావేశం అయినట్టు నిర్ధారించారు. ఇవి పీఎస్ఆర్, విశాల్ గున్నీ, కాంతి రాణా తాతాల మధ్యన జరిగిన సంభాషణలకు సాక్ష్యంగా ఉపయోగపడినట్టు సీఐడీ అధికారులు వివరించారు. రిమాండ్ రిపోర్టు ప్రకారం పీఎస్ఆర్ దర్యాప్తుకు సహకరించటం లేదు. అరెస్టు సందర్భంగా ఆయన అందించిన సమాధానాలు తిరస్కరించేలా, తప్పుదారి పట్టించేవిగా ఉన్నాయని అందులో పేర్కొన్నారు. కేసు సంక్లిష్టత దృష్ట్యా, కుట్ర వెనుక ఉన్న ఇతర వ్యక్తులను గుర్తించడానికి ఆంజనేయులును సీఐడీ కస్టడీకి తీసుకోవడం అత్యవసరమని తెలిపారు.

బెయిల్ ఇస్తే...

పీఎస్ఆర్ బెయిల్ మీద బయటకు వస్తే సాక్షులను బెదిరించవచ్చునని సీఐడీ తెలిపింది. సాక్ష్యాలను నాశనం చేయవచ్చని, దేశం విడిచి పారిపోయే అవకాశం కూడా ఉందని పేర్కొంది. మరి కొందరు సాక్షులను విచారించాల్సి ఉందని, కొన్ని కీలక పత్రాలు సేకరించాల్సి ఉందని దర్యాప్తు అధికారులు రిపోర్టులో పేర్కొన్నారు.

చూడమని చెప్పానంతే!

(మొదటి పేజీ తరువాయి)

జత్వానీ అరెస్టుకు సహకరించాల్సిందిగా ముంబై పోలీసులకు కూడా ఫోన్ చేసి కోరినట్లు అంగీకరించినట్లు సమాచారం. అదే సమయంలో... ఈ కేసులో నిందితుడైన ఆయన తానే 'బాస్' అన్నట్లుగా ప్రవర్తించినట్లు సమాచారం. పీఎస్సార్‌ను మంగళవారం హైదరాబాద్‌లో అరెస్టు చేసిన అనంతరం... విజయవాడలోని సీఐడీ కార్యాలయంలో ఆయనను ప్రశ్నించారు. కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, విజయవాడ సీఐడీ ఆర్వో ప్రసాద్ కలిసి విచారణ జరిపారు. ఈ సందర్భంగా పీఎస్సార్ విచారణ అధికారులపై రుసరుసలాడుతూ, 'మహానుభావా' అని వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తూ, పేరుతో పిలుస్తూ వింతగా వ్యవహరించినట్లు సమాచారం. విచారణ సమయంలో... 'తర్వాతి ప్రశ్న ఏమిటో త్వరగా అడుగు ప్రవీణ్' అని రెట్టించినట్లు తెలిసింది. విచారణలో ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా రిమాండ్ రిపోర్టును తయారు చేసి పీఎస్ఆర్ చేతిలో పెట్టినప్పుడు... దాన్ని చదువుకుని 'మీరంతా దొంగలు..' అని నిందిస్తూ సంతకం చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... పీఎస్సార్‌ను అడిగిన ప్రశ్నలు, ఆయన ఇచ్చిన సమాధానాలు ఇవి...

కాదంబరి జత్వాని కేసు విషయంలో కాంతిరాణా, విశాల్‌గున్నీపై ఎందుకు ఒత్తిడి చేశారు?

చూడు ప్రవీణ్ (డీఐజీ)... నీ దగ్గరికి ఎవరో ఒకరు వచ్చి సహాయం చేయమని అడిగితే ఏం చేస్తావు? ఆయన సమస్యలో న్యాయం ఉంటే సహాయం చేయాలని ఏ పోలీస్ అధికారికో, ఎస్‌హెచ్‌వోకో ఫోన్ చేసి చెబుతావు. అంతేకదా! ఫోన్ చేసినంత మాత్రాన కిందిస్థాయి అధికారులు చేసిన తప్పులు నువ్వు చేయించినట్టా? కుక్కల విద్యాసాగర్ నా దగ్గరికి వచ్చి ఒక మాటగా చెప్పమని అడిగారు. ఆ కేసు ఏమిటో చూడమని చెప్పాను. దానికి నేనెలా బాధ్యుడ్ని అవుతాను. మీరంతా దొంగలు.

కాంతిరాణా, గున్నీని సీఎంవోకు ఎందుకు పిలిపించారు?

నిఘా విభాగం అధిపతి హోదాలో ఏ విషయాన్నయినా అప్పట్లో సీఎంతో పంచుకునేవాడిని. ఇంతకుముందు ఇంటెలిజెన్స్ చీఫ్‌లుగా పనిచేసిన వారు కూడా ఇదే చేశారు. అక్కడికి కాంతి రాణా, విశాల్‌గున్నీ యాదృచ్ఛికంగా వచ్చి ఉంటారు.

జత్వానిపై కేసు నమోదు చేయాలని కాంతిరాణా, గున్నీలపై ఎందుకు ఒత్తిడి తెచ్చారు?

కుక్కల విద్యాసాగర్ అనే వ్యక్తి నన్ను కలిసి తనకు వచ్చిన ఇబ్బంది చెప్పి సహాయం చేయాలని కోరారు. ఆయన కేసు ఏవిటో చూడాలని కాంతిరాణాకు సూచించాను.

ముంబై పోలీసులకు కూడా ఫోన్‌చేసి సహకరించాలని అడిగారు కాదా?

ముంబైలో ఉండే జత్వానిపై కేసు నమోదు చేశాం.. అరెస్టు చేయాల్సి ఉందని కాంతిరాణా, విశాల్‌గున్నీ నాకు తెలిపారు. వారి ద్దరికి సహకారం అందించాల్సిందిగా ముంబై పోలీసులకు ఫోన్ చేసి చెప్పాను.

మీరు ఉపయోగించిన ట్యాబ్ ఎక్కడ?

సర్వీసులో ఉన్నంత వరకు సెల్‌ఫోన్ తప్ప ట్యాబ్, ల్యాప్‌టాప్ ఏనాడూ ఉపయోగించలేదు. (మళ్లీ అదే ప్రశ్న అధికారి వేయగా) చెప్పాను కదా మహానుభావా! ఐదేళ్లపాటు నా వద్ద పనిచేసిన గన్‌మెన్, సీసీలు ప్రస్తుత ప్రభుత్వంలో కూడా పనిచేస్తున్నారు. వారిని విచారిస్తే నేను ట్యాబ్ ఉపయోగించానో లేదో తెలుస్తుంది. అవసరమైతే అప్పుడు సీఎంగా ఉన్న జగన్ ఇంటి సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించండి. అప్పటి సీఎంవోకు అనేకసార్లు వెళ్లినప్పుడు మీడియా షూట్ చేసింది. ఆ క్లిప్పింగ్‌లను పరిశీలిస్తే నా చేతిలో ట్యాబ్ ఉందో లేదో తెలుస్తుంది.

సహకరించని మాధవ్!

- చేబ్రోలు కిరణ్ సమాచారం ఇచ్చింది ఎవరని అడిగిన డీఎస్పీ బృందం
- తెలియదంటూ దాటవేసిన మాజీ ఎంపీ



గుంటూరు/రాజమహేంద్రవరం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పోలీసుల అదుపులో ఉన్న చేబ్రోలు కిరణ్‌కుమార్‌పై దాడికి ప్రయత్నించి దౌర్జన్యం చేసిన కేసులో నిందితుడైన వైసీపీ నేత, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను గుంటూరు నగరంపాలెం పోలీసులు బుధవారం రాజమండ్రి సెంట్రల్ జైల్లో అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం గుంటూరుకు తరలించి జీజీహెచ్‌లో వైద్య పరీక్షల అనంతరం సాయంత్రం నల్లపాడు పోలీసు స్టేషన్‌కు తరలించారు. గుంటూరు వెస్ట్ డీఎస్పీ అరవింద్, నగరంపాలెం సీఐ నజీర్ తదితరులు ఆయన్ను ప్రశ్నించారు. అనంతపురం జిల్లాకు చెందిన మాధవ్‌కు.. కిరణ్‌కుమార్ మంగళగిరి పోలీసుల అదుపులో ఉన్నారని సమాచారం ఇచ్చింది ఎవరు.. దాడికి పురిగొల్పింది ఎవరు.. సహకరించింది ఎవరు.. వెనుక ఉన్న అదృశ్య శక్తులు ఎవరన్న ప్రశ్నలకు మాధవ్ సరైన సమాధానాలు చెప్పలేదని తెలిసింది. దీంతో గురువారం పూర్తిస్థాయిలో విచారించాలని అధికారులు నిర్ణయించారు. పోలీసులు నిబంధనల ప్రకారం మాధవ్‌ను లాకప్‌లో ఉంచారు. సరిగా గాలి ఆడడం లేదంటూ ఆయన తన వంటిపై ఉన్న దుస్తులు విప్పి కట్‌డ్రాయర్‌పై కూర్చున్నట్లు తెలిసింది. అలా కూర్చోవడం సరికాదని, దుస్తులు ధరించాలని పోలీసులు సూచించినా.. గాలి ఆడకపోతే ఏం చేయమంటారంటూ ఆయన పోలీసు భాషలో మాట్లాడారు. వాస్తవానికి బుధవారం ఉదయానికే ఆయన్ను గుంటూరు తీసుకురావలసి ఉన్నప్పటికీ ఆలస్యం కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బుధ, గురువారాల్లో రెండ్రోజులు ఆయన్ను పోలీసు కస్టడీకి అనుమతిస్తూ కోర్టు గత సోమవారం ఆదేశాలిచ్చిన సంగతి తెలిసిందే. ఓ సీఐ ఆధ్వర్యంలో 30 మంది గుంటూరు పోలీసులు బుధవారం ఉదయం 10.30 సమయంలో జైలుకు వచ్చి.. ఆయన్ను కస్టడీకి తీసుకునేప్పటికి మధ్యాహ్నమైంది. మధ్యాహ్నం 12.30కు ఎస్కార్టు మినీ బస్సులో మాధవ్‌తో తిరిగి బయల్దేరారు. అయితే గుంటూరు చేరేసరికి సాయంత్రం దాటింది. వైద్య పరీక్షలు నిర్వహించి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లేటప్పటికి రాత్రి అయింది. దీంతో తొలిరోజు పెద్దగా సమయం లేక పోయింది. ఆలస్యం చేసి ఆయనకు సహకరించారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్‌లు అప్‌లోడ్ చేయండి: హైకోర్టు

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులు, వాటి ఆధారంగా నమోదు చేసే ఎఫ్ఐఆర్‌లను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సిందేనని పోలీసులకు హైకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను నిజమైన స్ఫూర్తితో అమలు చేయాలని న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ ఇటీవల తీర్పు ఇచ్చారు.

రాజ్ తోడల్లుడు అరెస్టు

- మద్యం స్కామ్‌లో 8వ నిందితుడిగా చాణక్య
- ప్రభుత్వం మారగానే దుబాయ్‌కి జంప్

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మద్యం స్కామ్‌లో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) మరో నిందితుడిని అరెస్టు చేసింది. మద్యం కంపెనీల నుంచి ముడుపుల సొమ్ము వసూలు చేసి క్యాష్ హ్యాండ్లర్లు, కొరియర్ల ద్వారా చేర్చాల్సిన చోటుకు చేర్చడంలో కీలక పాత్ర పోషించిన బూనేటి ప్రకాశ్ అలియాస్ చాణక్యను అరెస్టు చేశారు. మద్యం కుంభకోణం సూత్రధారి రాజ్ కసిరెడ్డి (ఏ1) తోడల్లుడే ఈ చాణక్య! ఆయనను మద్యం కేసులో ఏ8గా చేర్చారు. జగన్ హయాంలో ఆర్డర్లు ఎక్కువగా పొందిన మద్యం కంపెనీల నుంచి 'లెక్క' ప్రకారం కమీషన్లను తీసుకుని, ఆ కరెన్సీని అట్ట పెట్టెల్లో తీసుకెళ్లడం.. క్యాష్ హ్యాండ్లర్స్ ద్వారా కొరియర్లకు చేర్చడం.. తర్వాత షెల్ కంపెనీలు, స్థిరాస్తి వ్యాపార ఖాతాల్లో జమ చేయడం.. వారాంతంలో రాజ్ కసిరెడ్డికి లెక్క చెప్పడం.. చైతన్య పని. దిలీప్ రెడ్డి, కిరణ్ అనే మరో ఇద్దరితో కలిపి నగదు రవాణాలో బాధ్యతలు నిర్వహించారు. బేవరేజెస్ నుంచి ముడుపులు అందిన వెంటనే రాజ్ సూచించిన హవాలా ప్రతినిధులకు ముంబై, ఢిల్లీలో నగదు అందజేసేవారని సమాచారం. తర్వాత ఆర్గనైజ్డ్ హవాలా నెట్‌వర్క్ ద్వారా ఈ ముడుపులను షెల్ కంపెనీల్లోకి, స్థిరాస్తి వ్యాపారాల్లోకి మళ్లించే ప్రక్రియను పర్యవేక్షించేవారు. ఈ క్రమంలో మొబైల్ ఫోన్లు, సిమ్‌లను తరచూ మార్చేవారని.. ముడుపులకు సంబంధించిన చర్చలకు వాట్సాప్, సిగ్నల్ వంటి యాప్‌లను ఉపయోగించారని 'సిట్' గుర్తించింది.

కసిరెడ్డిని కస్టడీకి ఇవ్వండి

- ఏసీబీ కోర్టులో సిట్ పిటిషన్ దాఖలు



విజయవాడ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా ఉన్న కసిరెడ్డి రాజశేఖరరెడ్డిని కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు బుధవారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో మరింత విచారణ చేయాల్సి ఉందని, కసిరెడ్డిని వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోరారు. వైసీపీ హయాంలో రూపొందించిన మద్యం విధానంలో డిస్టలరీల నుంచి రూ.3,250 కోట్లు వసూలు చేశాడని తెలిపారు. ఈ నిధులు కసిరెడ్డి నుంచి ఎక్కడికి వెళ్లాయో తేల్చాల్సి ఉందని పేర్కొన్నారు.

దుబాయ్‌కి చెక్కేసి...

ఐదేళ్లపాటు వేల కోట్ల మద్యం కమీషన్లు 'హ్యాండిల్' చేసిన చాణక్య... రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే దుబాయ్ విమానం ఎక్కేశారు. 'సిట్' అధికారులు మద్యం వ్యాపారుల్ని పిలిచి ప్రశ్నించే క్రమంలో ఆయన పాత్ర వెలుగులోకి వచ్చింది. డిస్టిలరీలు, మద్యం కంపెనీల ప్రతినిధులతో చాణక్య నిత్యం టచ్‌లో ఉంటూ.. కమీషన్ల డబ్బులు తీసుకెళ్లే వారని నిర్ధారించుకున్నారు. సంబంధిత ఆధారాలు కూడా సేకరించారు. చాణక్య దుబాయ్‌లో తిష్ట వేసినట్లు గుర్తించారు. అక్కడి నుంచే వీపీఎన్, వీవోఐపీ సర్వీసులతోపాటు వాట్సాప్ ద్వారా ఇక్కడి 'సహచరుల'తో టచ్‌లో ఉన్నట్లు నిర్ధారించుకున్నారు. తన తోడల్లుడు రాజ్ కసిరెడ్డి చుట్టూ ఉచ్చు బిగుసుకోవడం, హైదరాబాద్‌లో సోదాలు, రాజ్ తండ్రి ఉపేందర్ రెడ్డిని విచారించడం వంటి చర్యలతో... ఎప్పటికైనా తనకూ ఇబ్బంది తప్పదని రెండు రోజుల క్రితం చాణక్య హైదరాబాద్‌కు చేరుకున్నట్లు తెలిసింది. కోర్టు ద్వారా రక్షణ పొందేందుకు న్యాయవాదులతో సంప్రదింపులు జరుపుతుండగానే... సిట్ అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. చాణక్యను గురువారం విజయవాడ కోర్టులో ప్రవేశపెట్టే అవకాశముంది.

'హవాలా' నెట్‌వర్క్‌తో వైసీపీ నేతలకు లింకు..

మద్యం ముడుపుల సొమ్మును హవాలా రూపంలోకి మార్చిన ఆర్గనైజ్డ్ నెట్‌వర్క్‌తో కొందరు వైసీపీ నేతలకు సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. చాణక్యను ప్రశ్నించిన సిట్ అధికారులకు ఈ కీలక సమాచారం అందడంతో ఆ దిశగా దర్యాప్తు అడుగులు పడుతున్నాయి. కేసు కొలిక్కి వచ్చే సమయానికి వైసీపీలోని కొందరు కీలక నేతలకు ఉచ్చు బిగుసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కృష్ణా జలాల పునఃపంపిణీపై.. కేంద్ర గెజిట్‌ను రద్దు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

తనకు తీరని నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తంచేసింది. సదరు టీవోఆర్‌ను రద్దు చేయాలని సుప్రీంకోర్టును కోరింది. నదీ పరివాహక ప్రాంతం, ప్రస్తుత నీటివాడకం లెక్కల ఆధారంగానే గతంలో నీటి కేటాయింపులు చేశారని, ఇప్పుడు పునఃపంపకాల కోసం ట్రైబ్యునల్‌కు విధివిధానాలు ఖరారు చేయడం వల్ల తమకు అన్యాయం జరుగుతుందని తెలిపింది. ఈ మేరకు ఏపీ దాఖలుచేసిన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఆంధ్ర తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు వినిపించారు. కేంద్ర నిర్ణయం ఆమోదయోగ్యం కాదని, నదీ జలవివాద చట్టం ప్రకారం బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌కు ఇలా అదనపు అంశాలు పరిశీలించే అధికారం లేదని తెలిపారు. విభజన చట్టం ప్రకారం నీటి కేటాయింపులకు రక్షణ ఉందని, ఇప్పటికే సెక్షన్ 89ఏ, బీ కింద ట్రైబ్యునల్ తెలుగు రాష్ట్రాల మధ్య నీటిని ప్రాజెక్టుల వారీ కేటాయింపులపై పరిశీలిస్తుండగా.. కొత్త నియమ నిబంధనలు చేర్చడం తగదన్నారు. ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర మధ్య కృష్ణా జలాల పంపిణీలో భాగంగా ఉమ్మడి రాష్ట్రానికి గతంలో 811 టీఎంసీలు కేటాయించారని గుర్తుచేశారు. విభజన తర్వాత ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయించారని.. వెల్లడించారు. ఇప్పుడు వీటిని మళ్లీ మొదటి నుంచి పరిశీలించేలా విధివిధానాల ఖరారు తగదని, దీని వల్ల ఏపీకి తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర విభజన చట్టాన్ని పార్లమెంటు ఆమోదించిందని.. దీనిని సవరించే అధికారం, హక్కు కేంద్రానికి లేవన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీలకు బచావత్ ట్రైబ్యునల్ 2013లోనే ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు జరుపుతూ తీర్పు ఇచ్చినా.. న్యాయపరమైన వివాదాల కారణంగా అమల్లోకి రాలేదని.. ఈ తరుణంలో రెండు తెలుగు రాష్ట్రాల నడుమ నీటి పంపకాలపై రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 89కు భిన్నంగా కేంద్రం ఏకపక్షంగా కొత్త టీవోఆర్ విడుదల చేసిందని తెలిపారు. కోర్టు సమయం ముగియడంతో తదుపరి వాదనలు గురువారం వింటామని.. సమయం సరిపోదనుకుంటే ఇంకో రోజు కూడా వింటామని ధర్మాసనం స్పష్టం చేసింది. గురువారం సమగ్ర సమాచారం ఇస్తామని గుప్తా తెలిపారు.

పూర్వాపరాలివీ..: రాష్ట్ర విభజన జరిగాక కృష్ణా జలాల పంపకాలపై కొత్త ట్రైబ్యునల్ వేయాలని తెలంగాణ సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. 2023లో 2 రాష్ట్రాల సీఎంలు కేసీఆర్, జగన్ ఢిల్లీలో అప్పటి కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసినప్పుడు కూడా.. కొత్త ట్రైబ్యునల్ వేయాలని తెలంగాణ కోరింది. అయితే సుప్రీంకోర్టులో కేసును ఉపసంహరించుకోవాలని షెకావత్ సూచించడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం కేసు వాపస్ తీసుకుంది. దరిమిలా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2023 అక్టోబరు 6న కేంద్రం కొత్త టీవోఆర్‌తో గెజిట్ విడుదల చేసింది. అంతర్రాష్ట్ర నదీ జలాల చట్టం-1956లోని సెక్షన్ 3 ప్రకారం పునఃపంపిణీని పరిశీలించాలని ట్రైబ్యునల్‌కు సూచించింది. దీనిని ఏపీ సవాల్ చేసింది.

అనంతబాబు డ్రైవర్ హత్య కేసులో.. తదుపరి దర్యాప్తు అవసరం

- రాజమహేంద్రవరం కోర్టులో ప్రాసిక్యూషన్ పిటిషన్
- సుబ్రహ్మణ్యం తల్లి లేవనెత్తిన అనుమానాల ప్రస్తావన

కాకినాడ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో తదుపరి దర్యాప్తునకు అనుమతి కోరుతూ ప్రాసిక్యూషన్ రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక న్యాయస్థానంలో బుధవారం పిటిషన్ దాఖలు చేసింది. కేసు దర్యాప్తులో అనేక కీలక అంశాలను విస్మరించిన నేపథ్యంలో లోతుగా విచారించాల్సిన అవసరం ఉందని అందులో పేర్కొంది. మృతుడి తల్లి నూకరత్నం సైతం తన కుమారుడి హత్య కేసులో అనేక అనుమానాలు వ్యక్తంచేస్తూ ఇప్పటికే డీజీపీకి ఫిర్యాదు చేశారని తెలిపింది. 'హత్యకు గురైన తన కుమారుడి శరీరంలో మూడుచోట్ల అంతర్గతంగా, 31 చోట్ల శరీరంపై గాయాలున్నాయని ఆమె పేర్కొన్నారు. ఒకే వ్యక్తి ఇన్ని చోట్ల గాయాలు చేసి చంపడం కుదరదని, నిందితుడికి ఈ హత్యలో మరికొందరు సహకరించి ఉంటారని అనుమానం వ్యక్తంచేశారు. అప్పట్లో జరిగిన పోలీసు దర్యాప్తులో ఈ అంశాలను విస్మరించారని తెలిపారు. హత్య జరిగినప్పుడు నిందితుడి కాల్‌డేటాను సైతం విశ్లేషించలేదని, అనంతబాబు వద్ద గన్‌మెన్ ఆ సమయంలో ఎక్కడున్నారనేదానిపైనా పోలీసులు విచారించలేదని ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయా అంశాల్లో తదుపరి దర్యాప్తు చేయాల్సి ఉంది. తదుపరి విచారణకు వీలుగా పాటిల్ దేవరాజ్ మనీశ్ అనే ఐపీఎస్ అధికారిని కాకినాడ జిల్లా ఎస్పీ ఇటీవల నియమించారు. కేసులో మరికొందరు సాక్షులను కూడా విచారించాల్సి ఉండడం, మరిన్ని సాంకేతిక ఆధారాలు సేకరించాల్సి ఉన్న నేపథ్యంలో తదుపరి కేసు విచారణకు అనుమతించండి' అని న్యాయస్థానాన్ని ప్రాసిక్యూషన్ కోరింది. డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఆరోపణలపై ఎమ్మెల్సీ అనంతబాబు ఇప్పటికే జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చిన సంగతి తెలిసిందే.

వంశీకి రిమాండ్ పొడిగింపు



విజయవాడ, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీతో పాటు పది మంది నిందితుల రిమాండ్‌ను కోర్టు పొడిగించింది. విజయవాడ జిల్లా జైలులో ఉన్న వంశీ, ఆయన ప్రధాన అనుచరుడు ఓలుపల్లి మోహనరంగారావుతో పాటు మరో ఇద్దరిని ప్రత్యక్షంగా, నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న మరో ఆరుగురిని వర్చువల్‌గా మూడో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో బుధవారం హాజరుపరిచారు. ఈ పది మందికి మే 7 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి పి.తిరుమలరావు ఆదేశాలు ఇచ్చారు.

చేబ్రోలు కిరణ్‌కు బెయిల్ మంజూరు

మంగళగిరి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసి సస్పెన్షన్‌కు గురైన ఐటీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌కు గుంటూరు జిల్లా మంగళగిరి కోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసింది. మాజీ సీఎం వైఎస్ జగన్ సతీమణి భారతిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ అందిన ఫిర్యాదు మేరకు మంగళగిరి రూరల్ పోలీసులు ఈ నెల 11న కిరణ్‌ను అరెస్టు చేశారు. అదే రోజు కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. అనంతరం కిరణ్‌ను గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో మంగళగిరి న్యాయస్థానం కిరణ్‌కు బెయిల్ మంజూరు చేసింది. అయితే జామీను పత్రాలు సమర్పించడంలో ఆలస్యం కావడంతో విడుదలలో జాప్యం చోటుచేసుకుంది. ప్రస్తుతం కిరణ్ జిల్లా జైలులోనే ఉన్నారు. కిరణ్ గురువారం జైలు నుంచి విడుదలయ్యే అవకాశం ఉంది. సాధారణంగా ఐటీ యాక్టు కేసుల్లో వారం రోజుల్లో బెయిల్ వచ్చే అవకాశం ఉన్నప్పటికీ కిరణ్ విషయంలో కొంచెం ఆలస్యమైంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.